# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376
ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:4 170 ఏప్రిల్ 2025 హైదరాబాద్

- ఓయూ పూర్వ వైభవాన్ని చూడగలమా?
- సహజ న్యాయానికి వ్యతిరేకంగా జీవో నెం.21
- మహాత్మా జ్యోతిబాఫూలే స్ఫూర్తి 'ధిక్కార'
- తెలంగాణ ప్రాచీన ఇనుము, ఉక్కు పరిశ్రమ సంబంధిత గ్రామ నామాలు
- బాల సాహిత్యం-కథలు, గేయాల్లో అనివార్య చర్చనీయాంశాలు



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఏప్రిల్ 2025

సంచిక : 4

సంపుటి : 15



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహా మండలి

**అల్లం నారాయణ**

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

**ప్రొఫెసర్ గణేష్**

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

**సంపాదకురాలు**

**స్నేహలత ఎం.**

**సంపాదకవర్గం**

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,**

ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డిటిపి, లే ఔట్ :** స్నేహ

**కవర్ డిజైన్ :** శేషు



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

*అడవి పువ్వులు*
*అందంగా ఉంటాయి*
*కవి సమయంలా*
*కథా ఇతివృత్తంలా*

*ఆకురాలు కాలంలో*
*వేటగాడు*
*అడవిలో సంచరిస్తున్నప్పుడు*
*పువ్వులు*
*పక్షుల్లా వలసపోతుంటాయి*
*జీవజలం కోసమో*
*ఆత్మ రక్షణ కోసమో*

*విరామం*
*సుదీర్ఘ యుద్ధానికి*
*గొడుగు లాంటిది*
*అభావం అభావం చెందటం*
*ప్రకృతి నేర్పిన మొదటి పాఠం*

*అడవి మండుతున్నప్పుడు*
*మైదానం మౌనంగా ఉంటే*
*పువ్వుల పక్షుల కమురువాసన*
*ఆకాశాన్ని కమ్ముకుంటుంది*

30 ఏప్రిల్, 2025


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

ఓయూ పూర్వవైభవాన్ని చూడగలమా ? — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 5

**ప్రొఫెసర్**

మేధో శ్రమజీవి బిరుదురాజు — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 7

**సామాజికం**

సహజన్యాయానికి వ్యతిరేకంగా జీవో నెం.21 — **డా. ఇమ్మిడి మహేందర్** — 12

**తొవ్వ ముచ్చట**

"కృత్రిమమేధ(AI)ని శాసించే స్థాయికి భాషాసాహిత్య పరిశోధన చేరుకోవాలి" -ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు — **డా. ఆదినారాయణ** — 14

**పరిశోధన**

తెలంగాణ ప్రాచీన ఇనుము, ఉక్కు పరిశ్రమ సంబంధిత గ్రామనామాలు – ఒక పరిశీలన — **డా. బూర్ల చంద్రశేఖర్** — 23

పాలనలో అవినీతిని ప్రశ్నించిన పద్యకవి — **పి. రాజీవ్‌కుమార్** — 28

**విమర్శ**

మహాత్మా జ్యోతిబాపూలే స్ఫూర్తి 'ధిక్కార' — **డా. సంగి రమేష్** — 31

బాలసాహిత్యం కథలు, గేయాల్లో అనివార్య చర్చనీయాంశాలు — **డా. దుగ్గి గాయత్రి** — 35

సమాజ ప్రతిబింబాలు వార్తాపత్రికలు — **డా. ఎల్.నాగేశ్వరరావు** — 37

**పుస్తక పరిచయం**

ద్రావిడ స్వరం వీరనాగు శతకం — **విప్లవకుమార్** — 40

వ్యాస మకరందం-సమాలోచన — **డా. శోభన్‌బాబు బోలుగాని** — 42

**పరిశోధన పరిచయం**

శ్రీనాథుని కవితా ప్రస్థానం-సమగ్ర పరిశీలన — **డా. శరణ్య** — 46

**నివేదిక**

తెలుగును కాపాడాల్సిందే — **డా. ఇమ్మిడి మహేందర్** — 48

**అర్బన్ లైఫ్**

డ్రైవింగ్ — **స్నేహలత ఎం.** — 49

# ఓయూ పూర్వవైభవాన్ని చూడగలమా

ప్రొఫెసర్ చింతకింది కాశీం

ప్రపంచంలో విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని ప్రోది చేసి సమాజంతో అవిశ్రాంత సంవాదాన్ని నడిపాయి. భిన్న ఆలోచనలు, వ్యక్తిత్వాలు, సామాజిక సమూహాల నుంచి విద్యార్జన కోసం విద్యార్థులు ఒకచోట కూడటమే ఆనాటికి అదొక అపురూప చరిత్ర. మనిషి మేధ వికసించటానికి నిరంతర వివేచన అతిముఖ్యమైన ఆలంబన. తరగతిగది బోధన, అభ్యాసం అధ్యయనం పునాది మీద చలనంలో ఉండాలనే నియమం ఆనాటి విశ్వవిద్యాలయాలు పొందిన ఒక విలువ. కనుక యూనివర్సిటీ అనే భావన కూడా ఆధునిక సమాజాల పరిపక్వత నుంచి వ్యక్తమయింది. సమాజాన్ని విశ్లేషించి కొత్త పరికరాలను తోడు తెచ్చుకున్న ఆ కాలం ఒక్కోసారి ప్రగతి నిరోధక భావజాలాలతో తలపడవలసి వచ్చింది. అయినా జ్ఞానానికి ఉండే వెలుతురు వలన చీకటి భావాలు బల్లున తెల్లారేవి.

ఫ్యూడల్ పాలనలో మగ్గిపోతుండిన భారతదేశంలోకి ఆధునిక భావాలు ప్రవేశించటం చాలా ఆలస్యంగా జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెని పాలనతో మనదేశంలోకి శాస్త్రీయ ఆలోచనలు మంద్రస్థాయిలో ప్రవేశించాయి. పెట్టుబడికి ఉండే పురోగామి లక్షణం వలన వలస పాలన కాలంలోనే మనకు ఆధునికత పరిచయం అయింది. వస్తు సంస్కృతిని విస్తృతం చేయడానికి కంపెనీ పాలనకు భాష కూడా ఒక సాధనమయింది. భాష ముడిపదార్థం కాదు. వ్యవహర్తలు దాని జీవలక్షణం. బోధన ద్వారానే భాషా విస్తృతి జరుగుతుంది. ఈ నేపథ్యం నుంచి ఆంగ్ల మాధ్యమం(1835), యూనివర్సిటీల ఏర్పాటు(1857) కుంఫిణి పాలకులకు అవసరమయ్యాయి. కానీ అంతిమంగా విశ్వవిద్యాలయాలలో సామూహిక అధ్యయనం చేస్తుండిన యువతరంలో జాతీయ భావాలు వికసించడానికి ఈ కాలం దోహదపడింది. భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు, వందేమాతర ఉద్యమం రూపొందడంలో విశ్వవిద్యాలయాలు చురుకైన పాత్రను పోషించాయి. దేశంలో రాజకీయ సందోహం ప్రారంభమయింది. దేశీయంగా మేధోవర్గం కూడా తగిన మోతాదులో రూపొందింది. బ్రిటిష్ ప్రభుత్వంలో తమ ప్రాతినిధ్యం గురించిన చర్చను ఈ మధ్యతరగతి ఆలోచనాపరులు ముందుకు తెచ్చారు.

దేశంలో జరుగుతుండిన ఈ చలనానికి తెలంగాణ పులకరించకుండా ఉండలేకపోయింది. ఇక్కడి ఫ్యూడల్ పాలకులు కూడా ఆధునిక విద్యాలయాల స్థాపన వైపు తమ ఆలోచనలను ప్రసరించక తప్పలేదు. గ్రామాలలో గనీభవించిన ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలు కొంత మేరకు ఉదాసీనంగా మారాయి. జమీందారుల పిల్లల ఆలోచనలలో కూడా మార్పు వచ్చింది. హైదరాబాద్ నగరంలో సంప్రదాయ విద్యా స్థానంలో ఆంగ్ల విద్య అధ్యయనం అవసరమైంది. ఈ అవసరాన్ని పరిపూర్తి చేయడానికి నిజాం కళాశాల(1887) ఏర్పాటు అనివార్యమయింది. వీధి బడులకే పరిమితమైన నిజామాంధ్ర మొదటిసారి విశ్వజ్ఞానానికి ద్వారాలు తెరుచుకున్నది. ప్రకృతి, జీవ, సామాజిక శాస్త్రాల అధ్యయనం ఈ తరానికి పరిచయమయ్యాయి. బయటి ప్రపంచంలోని నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు తెలంగాణ సమాజాన్ని కదలబార్చాయి. నిదానంగానైనా ఇక్కడ మధ్యతరగతి ఉనికిలోకి వచ్చింది. మార్పుల పట్ల ఎరుక ఏర్పడింది. తెలంగాణ సమాజంలో రావలసిన కదలిక గురించి ఆలోచనలు ప్రారంభమయ్యాయి.

నిజాం పాలకులు కూడా ఇంకెంత మాత్రం సమాజ చైతన్యానికి పరిమితులు విధించలేకపోయారు. తమ అవసరం కోసమైనా కొత్తగాలిని పీల్చుకొనక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే ఉర్దూ బోధనా మాధ్యమంగా, ఆంగ్ల అధ్యయనాన్ని తప్పనిసరి చేస్తూ మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి (1917-ఏప్రిల్ 26) ఫర్మానా జారీచేసాడు. ఈ శతాబ్దంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ అనుభవించిన పురిటి నొప్పులకు సాక్ష్యంగా ఉండింది. అధ్యయనం, అధ్యాపనం, పరిశోధనకే పరిమితం కాకుండా తెలంగాణ సమాజపు చలనాన్ని వేగవంతం చేయడానికి ఓయూ నిర్వహించిన పాత్ర ముచ్చట గొలుపుతుంది. దేశానికి ప్రపంచానికి కావలసిన మేధావులను రూపొందించి అందించింది. సామాజిక, రాజకీయార్థిక చలనాలకు కావలసిన దినుసును నిరంతరం పంపిణీ చేస్తూ వచ్చింది. శుద్ధ విద్యా ప్రమాణాలను మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికి అవసరమైన అపురూప నాయకత్వానికి తర్ఫీదునిచ్చింది. కుడి, ఎడమ భావజాలాలకు వేదికై ఆలోచనలలో, ఆచరణలో పరిపక్వతను తీసుకొచ్చింది. రెండు కాలాల ప్రత్యేక తెలంగాణ సందోహానికి ఓయూనే నాయకత్వం వహించింది.

సారాంశంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బూర్జువా స్వభావాన్ని కల్గి ఉంటుంది. కనుక నిర్మాణాత్మక ఆచరణ కంటే అరాచకవాద వ్యక్తీకరణకే మొగ్గు ఉంటుంది. సైద్ధాంతిక తలంలో జరగవలసిన చర్చకు బదులు రోజు వారి కార్యాచరణకే ప్రాధాన్యం ఉంటుంది. ఏ ఉద్యమమైనా నూతన విలువలను ఆవిష్కరిస్తుంది. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విద్యార్థి, యువతలో విలువల రాహిత్యాన్ని పోషించింది. సమాజంలో మౌలిక మార్పు కోరే ఉదాత్త ఆలోచనల స్థానంలోనే వైయక్తి ప్రయోజనాలకు ప్రాంతీయ ఉద్యమాలు పెద్ద పీటవేస్తాయి. శాస్త్రీయ భావాలు కలిగిన ఉద్యమ శక్తులు ఉదాసీనంగా ఉండడం వలన పార్లమెంటరీ రాజకీయాలలో ఉండే అవలక్షణాలన్ని విశ్వవిద్యాలయాలను కలుషితం చేసాయి. సైద్ధాంతిక చర్చలు లేని శూన్య కాలాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ దశాబ్దంలో అనుభవించింది. నిధుల, నియామకాల లేమి, క్షీణ అభ్యాస ప్రమాణాలు, బోధనలో

అలసత్వం, మదింపులో నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని చుట్టుముట్టాయి. ఒక చీకటి అధ్యాయాన్ని ఈ దశాబ్దం తనకు తాను రచించుకున్నది.

ఇలాంటి సంక్షుభిత కాలంలో ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అట్టడుగు సామాజిక సమూహం నుంచి ఎదిగిన ప్రొఫెసర్ కుమార్ మొలగరం వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఓయూ చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టమే. ఎంత ప్రతిభ ఉన్నా వైస్‌ఛాన్స్‌లర్ల నియామకంలో సామాజిక సమీకరణలే ప్రధానమవుతున్న కాలంలో పీడిత వర్గాలకు వచ్చిన అవకాశంగా కుమార్ నియామకాన్ని సమాజం స్వీకరించింది. సామాజిక సమీకరణల పాత్ర ఎంత ఉన్నా అకాడమిక్స్‌లో అత్యున్నతమైన ఆయన ప్రమాణాలు సహజంగా ఈ ఎంపికలో పూలలో దారం వలె ఉన్నాయి. కనుక ఈ కాలంలో ప్రొఫెసర్ కుమార్ వేసే ప్రతీ అడుగు చర్చనీయాంశంగా ఉంటుంది. అనుకూల, ప్రతికూలతలు వెంటాడుతాయి. ప్రతి చర్యను బూతద్దంలో పెట్టి ప్రయోగానికి నిలబెట్టాలని చూస్తారు. కిందివర్గాలకు పదవులు ఇస్తే సామర్థ్యాలు నిరూపించుకోలేరనే అపవాదు కూడా వెన్నంటే ఉంటుంది. ఆయనకు ఈ మూడేళ్లు పరీక్షా సమయం. ఇప్పటికే అనేక పదవులలో తన ప్రావీణ్యాన్ని, పారదర్శకతను నిరూపించుకున్నా సామాజికకోణంలో మకిలి అంటించడానికి కొన్ని సమూహాలు సిద్ధంగా ఉంటాయి. కనుక ఆయన నిర్ణయాలు సహేతుకంగా ఉండాలని శ్రేయోభిలాషులు కోరుకుంటారు. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రలో పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రాం జయంతులను విద్యాత్మక ప్రమాణాలతో నిర్వహించిన సందర్భాలు లేవు. కేవలం సెనెట్ హాల్‌లో పూలమాలలకే పరిమితం చేసేవారు. ఈ సారి ప్రొఫెసర్ కుమార్ చొరవతో ఓయూలో మహనీయుల జయంతోత్సవాలను నాలుగు రోజులపాటు ఉన్నత ప్రమాణాలతో నిర్వహించారు. విద్యాత్మక పోటీలు, సదస్సులలో చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వలన మహనీయుల కృషి కొందరికే పరిమితం కాకుండా విస్తృతిని పొందింది. ఓయూ విద్యార్థులు తమలో దాగి వున్న ప్రతిభా పాటవాలను ఈ సందర్భంలో అద్భుతంగా ప్రదర్శించారు.

ప్రొఫెసర్ కుమార్ పనివిధానం ప్రభుత్వం అందించే చేయూత మీద ఆధారపడి ఉంటుంది. విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఒకప్పటి మాట. క్షణం గడవక ముందే ప్రభుత్వం వైపు బేలగా చూసే కాలం ఈనాటిది. ఏ వ్యవస్థ అయినా నిధులుంటేనే దాని గమ్యం, గమనం సులువుగా ఉంటుంది. ఓయూకు వెయ్యికోట్ల నిధులిస్తే తప్ప ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం సాధ్యం కాదు. ఖాళీగా ఉన్న వెయ్యి పోస్టులను భర్తీ చేస్తేనే బోధన, పరిశోధనలతో నూతన ఆవిష్కరణలను ఆశించగలం. ప్రభుత్వం కేవలం జీతభత్యాలకు సరిపడ నిధులు మాత్రమే విదిలించి తమ బాధ్యత తీరిందని భావిస్తే విశ్వవిద్యాలయాలలో ఉన్నత ప్రమాణాలను ఆశించలేము. విద్యార్థుల మెస్ బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రభుత్వమే చెల్లించాలి. నూతన భవనాల నిర్మాణం, దానికి తగిన ఫర్నీచర్ ఏర్పాటు ఉండాలంటే బడ్జెట్ కేటాయింపులు తప్పనిసరి. ఉత్తమ ప్రమాణాలు కల్గిన బోధన, పరిశోధన జరగాలంటే అంతర్జాతీయ స్థాయి కలిగిన అధ్యాపకుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలతో పోటీపడాలంటే, న్యాక్ గుర్తింపు రావాలంటే బోధన, పరిశోధనారంగాలలో ఆసక్తి ఉండి, వృత్తి నిబద్ధత కలిగినవారిని ఎంపిక చేయాలి. విషయ పరిజ్ఞానం, భాషా నైపుణ్యాలు, సామాజిక బాధ్యత విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఉండవలసిన కనీస లక్షణాలు.

విశ్వవిద్యాలయ వాతావరణం కూడా విద్యార్జనకు మొదటిమెట్టు. ఓయూ మధ్యలో నుంచి వాహనాల రాకపోకలకు ప్రధాన రహదారి ఉండటం వలన విద్యాత్మక వాతావరణానికి అనేక పరిమితులు ఏర్పడుతున్నాయి. భారతదేశంలో ఏ విశ్వవిద్యాలయానికి ఇలాంటి పరిస్థితి లేదు. ఓయూలోకి ప్రవేశించడానికి కనీసం అరడజను అడ్డదారులు ఉన్నాయి. ఓయూ లోపల అనేక నివాస క్యాంపులు ఉన్నాయి. ఈ క్యాంపుల్లో కనీసం వెయ్యి కుటుంబాలు నివాసముంటున్నాయి, వీరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసివ్వటం వలన సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఓయూ భద్రతకు ఇలా ఎన్నోరకాల సవాళ్లు ఉన్నాయి. కొన్ని విద్యార్థి సంఘాలకు, నాయకులకు విద్యారంగ సమస్యల పట్టింపుల కంటే వ్యక్తిగత ఎజెండాల మీద దృష్టి ఎక్కువ. సైద్ధాంతిక చర్చలకంటే సోషల్ మీడియా ప్రచారాలకు ప్రాధాన్యత ఎక్కువ. వాళ్లు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల పుట్టినరోజులు జరపడానికే ఆసక్తి చూపుతారు. వాటి వెనుక వారికొక నిర్దేశిత ప్రయోజనం దాగి ఉంటుంది. తెలంగాణలో ప్రతి ఒక్కరూ తమ అసమ్మతిని ప్రకటించటానికి ఓయూనే వేదికగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇది ఓయూకు నష్టం చేసే కార్యాచరణ అవుతుంది. ఇటీవల ఆర్ట్స్ కాలేజీ వద్ద ఒక కులసంఘంలోని రెండు వర్గాల మధ్యన ఘర్షణ ఏర్పడి ఒకరి మీద ఒకరు దాడులు చేసుకున్నారు. ఇలాంటి వాళ్లు కూడా ఇక్కడి విద్యాత్మక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ఓయూ నిరంతరం అలజడులకు, ఆందోళనలకు వేదికై విద్యా ప్రమాణాలకు అవకాశం లేకుండా పోయిందనే తప్పుడు సంకేతాలు ఇప్పటికే సమాజంలోకి వెళ్లాయి. ఫలితంగా మధ్యతరగతి తమ పిల్లలను ఓయూలో చదివించటానికి ఇష్టపడటం లేదు. కానీ ప్రతి ఏటా ఓయూలో అధ్యయనం కోసం ప్రతిభావంతులైన పదివేల మంది ప్రవేశిస్తారు. వారికి సరైన నైపుణ్యాలు నేర్పిస్తే తెలంగాణలో అద్భుతాలు సృష్టిస్తారు. అయితే అపసవ్య ధోరణుల మీద ప్రభుత్వమే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. ఓయూను క్లోజ్డ్ క్యాంపస్‌గా మార్చాలి. రాజకీయ నాయకులు తమ అనుచర విద్యార్థులకు పరిమితులు విధించాలి. ఇలాంటి సహేతుక చర్యలకు ప్రభుత్వం పూనుకుంటేనే ఓయూ పూర్వ వైభవాన్ని మనం దర్శించగలం.

(ఏప్రిల్ 26, ఓయూ 108వ ఫౌండేషన్ డే సందర్భంగా…).

# మేధో శ్రమజీవి బిరుదురాజు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

శారీరక శ్రమ, మేధో శ్రమ అనే రెండు సందర్భాలను సాహిత్యంలో ప్రయోగిస్తుంటాం. శారీరక శ్రమ సామాజిక సంపదను సృష్టిస్తుంది. మేధోశ్రమ సమాజ సంస్కారాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ రెండింటి మధ్య పోటీ అక్కర్లేదు, దేని ప్రాధాన్యత దానికి ఉంటుంది. భావాలైన, సంపదయినా సమాజ ఉత్పత్తిలో భాగమే. కనుక సమాజ చలనం ఈ రెండింటి మీద ఆధారపడి ఉంటుంది. ఉత్పత్తి చేసిన వస్తు సముదాయం సమాజ అవసరాలను కొంతకాలం మేరకు తీర్చుతుంది. కాని భావాలు, ఆలోచనల ఉత్పత్తి విస్తృతమయింది. వాటి ప్రభావం సమాజం మీద దీర్ఘకాలంగా ఉంటుంది. మేధో శ్రమ సమాజాన్ని పరిపక్వం చేస్తుంది. నిచ్చెనమెట్ల నిర్మాణంగా ఉన్న మన సమాజంలో శారీరక శ్రమ, మేధో శ్రమ మధ్యన అంతరాలు ఉన్నాయి. మేధో శ్రమ కూడా ఏ రంగంలో చేయాలనేది మన సమాజంలో ముందే నిర్ణయించబడి ఉంటుంది. దీనికి భిన్నంగా ఆలోచించడం అరుదుగా జరుగుతుంది. మేధో రంగంలో శ్రమ చేయకుండా మేధావులుగా గుర్తింపుపొందేవాళ్లు ఉంటారు. ఏ రంగంలోనైనా మనం చేసే శ్రమ మీద ఆధారపడి ఫలితం ఉంటుంది. మేధో రంగంలో విశ్రాంతి లేని శ్రమజీవులు కొందరుంటారు. అలాంటి అరుదైన మేధో శ్రమజీవి బిరుదురాజు రామరాజు.

సమాజమే మనిషిని రూపొందిస్తుందనే సత్యం కాలాతీతమయింది. రామరాజును తెలంగాణ నేల తీర్చిదిద్దింది. ఆయన కుటుంబం, గ్రామం చోదకంగా పనిచేసాయి. చదువుకున్న ప్రాంతాలు ఆయనకొక ఆచరణను నేర్పించాయి. తెలంగాణలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణం అతడి ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందించింది. అధ్యయనం ఇచ్చిన తెలివిడి వలన సాహిత్యాన్ని కొత్తగా దర్శించే చూపు ఏర్పడింది. విస్మరించిన సాహిత్యాన్ని స్మరించడం మొదలుపెట్టాడు. చరిత్రకెక్కని చరితార్థులను అక్షరబద్ధం చేసాడు. ఆంధ్ర యోగులను ప్రపంచానికి పరిచయం చేసాడు. అక్షరాల వ్యవసాయంలో బిరుదురాజు ఆరుకాలం శ్రమించిన రైతు. 16 ఏప్రిల్ 2025న దేవనూరు గ్రామం. వరంగల్ జిల్లాలో ఆయన జననం ఒక చారిత్రక అవసరంగా జరిగింది.

రామరాజుది వ్యవసాయ కుటుంబం. కనుక బాల్యంలోనే శ్రమ విలువ తెలిసిన వ్యక్తిత్వం రూపొందింది. సాహిత్యం, వైద్యశాస్త్రం తెలిసిన రామరాజు మేనమామ రామచంద్రరాజు ప్రభావం ఆయన మీద విస్తృతంగా ఉంది. మేనమామ ద్వారానే సాహిత్య పరిచయం ఏర్పడింది. వీధి బడిలో జరిగిన విద్యాభ్యాసం ఆయన ఆలోచనా స్రవంతిని మార్చింది. రామరాజు మడికొండ(ఉమ్మడి వరంగల్)లో మెట్రిక్యులేషన్ చదువుతుండిన రోజుల్లో కవి పండితుల పరిచయం వలన కావ్య ప్రపంచం తెలిసింది. కాళోజీ సోదరులు, పల్లా దుర్గయ్య, విశ్వనాథశాస్త్రీ, అనుముల కృష్ణమూర్తి మొదలైన వారి సహచర్యం వలన సాహిత్య సంస్కారం ఇనుమడించింది. ముఖ్యంగా అనుముల కృష్ణమూర్తితో కలిసి అమరం, వేదం చదువుకున్నారు. రామరాజు చిన్న వయసులోనే రచనా వ్యాసంగం మీద దృష్టి పెట్టారు. పండరినాథ రామాయణం(పండరినాథరావు) అనే రాత ప్రతి మీద రామరాజు భారతి పత్రికలో వ్యాసం రాసాడు.

విద్యాభ్యాసం కోసం రామరాజు కొన్నాళ్లు వరంగల్‌లో ఉన్నారు. అక్కడ ఉన్న రాజరాజనరేంద్ర భాషా నిలయంలో గంటలకొద్ది అధ్యయనం చేయడం ఆయనకు అలవాటుగా మారింది. బెంగాలి నుంచి తెలుగులోకి అనువాదమై వచ్చిన నవలలు, డిటెక్టివ్ నవలలు చదివారు. ఈ ప్రభావంతో ఆయన కాలభైరవ అనే నవలను రాసే ప్రయత్నం చేసారు. మెట్రిక్యులేషన్‌లో ఉండగానే వసుచరిత్రను గద్యంలో రాసాడు. నిజాం కళాశాలలో అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం, తెలుగు ప్రధానాంశాలుగా బి.ఏ డిగ్రీని పూర్తిచేసారు. ఆ తర్వాత

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ తెలుగులో పట్టాపొందారు.

సాహిత్య అధ్యయనం వలన రామరాజుకు సామాజిక చరిత్ర కూడా పరిచయం అయింది. సమాజంలో ఉండిన వివిధ భావజాలాలు, ఆచరణలు తెలుసుకున్నాడు. తెలుగు సాహిత్యం, సంస్కృతి రంగాలలో పనిచేసారు. ఆ క్రమంలో తెలుగు సాంస్కృతిక వారోత్సవాలను నిర్వహించాడు. తెలంగాణ నేల మీద నిజాంకు వ్యతిరేకంగా ప్రజలు సమీకరించబడుతున్న కాలం కావటం వలన వివిధ కార్యకలాపాలలో పాల్గొన్నాడు. 1945లో మడికొండలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభలలో వాలంటీర్‌గా పనిచేసాడు. నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొనడం వలన బి.ఏ చదువుతుండిన రోజుల్లో జైలుకు కూడా వెళ్లాడు. నిజాం కళాశాల ఆంధ్ర సంఘానికి జాయింట్ సెక్రెటరీగా పనిచేసాడు. తెలంగాణ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసాడు. ఇదంతా ఆయన సామాజిక కార్యాచరణను అంచనా వేయడానికి ఆలంబనగా ఉండే ప్రాతిపదిక. సామాజిక జీవితం, కార్యాచరణ నుంచే సాహిత్య రచన వైపు రామరాజు మళ్లాడని చెప్పడానికి ఇది తోడ్పడుతుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ తెలుగు చదువుతుండిన రోజుల నుంచే రామరాజుకు సాహిత్య అధ్యయనం, పరిశోధన మీద మక్కువ ఏర్పడింది. వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణ కవి ప్రభావం వలన తాళ పత్రాలను పరిష్కరించే పని మీద ఆసక్తి పెరిగింది. ఆయనకు బాల్యం నుంచే జానపద సాహిత్యం మీద ఆసక్తి వుంది. వ్యవసాయ కుటుంబం నుంచి రావటం వలన శ్రమ జీవితం నుంచే రూపొందే మౌఖిక సాహిత్యం మీద మక్కువ ఏర్పడింది. నాట్ల సమయంలో, ధాన్యం దంచే సమయంలో, విసుర్రాయి పాటలలో, మేలుకొలుపు పాటల్లో ఉండే సౌందర్యాన్ని బాల్యంలోనే గ్రహించాడు. ఈ ఆసక్తి వలన ఆయన పరిశోధనకు జానపద సాహిత్యాన్ని ఎంచుకున్నాడు. మొదట పరిశోధనాంశంగా యక్షగాన సాహిత్యాన్ని ఎంచుకోవాలని అనిపించినా తర్వాత రామరాజు గురువు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం సూచనతో జానపద సాహిత్యం వైపు మళ్లాడు.

ముప్పై నెలలపాటు తెలుగు దేశమంతా పర్యటించి మౌఖిక సాహిత్యాన్ని సేకరించాడు. పరిశోధనను పూర్తి చేయడానికి ఆయన సేకరించిన సమాచారంలో పదోవంతు మాత్రమే ఉపయోగించుకున్నాడు. విస్తృత సమాచార సేకరణలో ఉండే శ్రద్ధనే పరిశోధకుల నాణ్యతను నిర్ణయిస్తుందని రామరాజును చూసి ఎవరైనా నేర్చుకోవలసిందే. ఆయన జానపద సాహిత్యం మీద పరిశోధనను ప్రారంభించే నాటికి సంబంధిత పరిశోధన పద్ధతుల మీద సరైన సమాచారం లేదు. పరిశోధనా పద్ధతులు రూపొందలేదు. కనుక పరిశోధనా పరికరాలను, ప్రమేయాలను, పద్ధతులను స్వయంగా ఆయననే రూపొందించుకున్నాడు. పాశ్చాత్య జానపద సాహిత్య పద్ధతులను అన్వయించి నూతన విశ్లేషణ, అంచనాను జానపద సాహిత్యానికి ఇచ్చాడు. క్షేత్ర పర్యటన, సమాచార సేకరణకు సంబంధించిన పద్ధతులను కూడా రామరాజే రూపొందించాడు. తర్వాతి జానపద పరిశోధకులకు మార్గం వేయటమే కాకుండా ఆయన పరిశోధనా గ్రంథం ఆకరంగా ఉంది. రామరాజు కృషి ఫలితంగానే తమిళ, కన్నడ, మళయాళం భాషల్లో జానపద సాహిత్యం మీద పరిశోధన చేయడానికి మార్గం సులభమయింది. తెలుగులో జానపద సాహిత్యానికి కొన్ని ప్రత్యేక లక్షణాలను ఆయన రూపొందించి స్థిరపర్చాడు.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో రామరాజు తన పరిశోధనను పూర్తిచేసాడు. 1955లో సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయ మూల్యాంకనం కోసం సమర్పించి 1956లో ఓయూ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ఓయూ తెలుగు శాఖలో రామరాజుదే మొదటి సిద్ధాంత గ్రంథం. పాశ్చాత్య జానపద సాహిత్య సిద్ధాంత పద్ధతులను అన్వయించి రాసిన మొదటి గ్రంథం కూడా రామరాజుదే. ఆయన పరిశోధనాంశానికి నిర్ణయించుకున్న శీర్షిక ఔచిత్యంగా ఉన్నది. "తెలుగు జానపద గేయ సాహిత్యం" అనటంలో ప్రాధాన్యతను వ్యక్తపరిచాడు. జానపదుల సాహిత్యం గేయరూపంలో వ్యక్తమవుతుంది. కథాగేయాలు, గేయాలు, వీరగాథలు, సామెతలు, పొడుపు కథలు.... మొదలైన ప్రక్రియలన్ని పాట రూపంలో వినిపిస్తాయి. కనుక ఆయన 'గేయ సాహిత్యం' అనే

పరిశోధనాంశ శీర్షికను ఎన్నుకోవటం దగ్గరనే నూతన పరిశోధన ఒరవడిని రూపొందించాడు. పరిశోధన కర్తవ్యాన్ని, లక్ష్యాన్ని శీర్షికలోనే చెప్పాడు. విశ్వవిద్యాలయం స్థాయిలో పల్లెపదాలకు పరిశోధనా స్థాయిని కల్పించిన మొదటి వ్యక్తి రామరాజే. తన పరిశోధనా గ్రంథాన్ని పదహారు అధ్యాయాలుగా విభజించి జానపద సాహిత్యాన్ని విశ్లేషించిన తీరు తర్వాతి పరిశోధకులకు ఆదర్శంగా ఉండిపోయింది.

జానపద సాహిత్యాన్ని అధ్యయనం చేయాలంటే నిర్దిష్ట లక్షణాలు రూపొంది ఉండాలి. నిర్వచనం, లక్షణాలను వింగడించుకున్న తర్వాతనే విశ్లేషణ సాధ్యమవుతుంది. అదే విధంగా స్నాతకోత్తర స్థాయిలో జానపద సాహిత్యాన్ని పాఠ్యాంశంగా చదవాలంటే కొన్ని ప్రమాణాలు ఏర్పడి ఉండాలి. అందుకే రామరాజు తన పరిశోధన ద్వారా జానపద సాహిత్య లక్షణాలను ప్రతిపాదించారు. 1.జానపద గేయాలకు ప్రత్యేక కవిలేరు. 2.జానపద గేయాలకు పరిణత స్వరూపం ఉండదు. 3.జానపదగేయ రచనా కాలం తెలియదు 4.జానపద గేయం మౌఖిక వ్యాప్తిలో ఉంటుంది. 5. జానపద గేయం సహజ శైలిలో నిర్మాణం అవుతుంది 6. ప్రజలకు పరిచితమైన వస్తువే జానపద గేయంగా మారుతుంది. జానపద విజ్ఞానం విస్తృత అర్థంలో ప్రయోగించడానికి వీరి పరిశోధన దోహదం చేసింది. జానపద విజ్ఞానాన్ని జానపద విజ్ఞాన శాస్త్రంగా రూపొందడానికి రామరాజు చేసిన కృషిని విస్మరించలేము.

తాళ పత్రాలను సేకరించి, పరిష్కరించి, కొత్త విషయాలను వెలికి తీయడానికి రామరాజు ఎంతగానో శ్రమించారు. మార్గ, మౌఖిక సాహిత్యాన్ని తులనాత్మకం చేయడానికి తాళపత్రాలను ఉపయోగించుకున్నాడు. ఈ సరళిలో పరిశోధనకు పూనుకోవడం దక్షిణాదిభాషల్లో రామరాజునే ప్రథముడిగా చెప్పవచ్చు. జానపదం అనే పేరును ఖాయం చేసి స్థిరపర్చడంలో ఆయన నడిపిన సంవాదం సాహిత్య ప్రియులకు ముచ్చట కొలుపుతుంది. ఆనాటి కాలంలో కొందరు పండితులు జానపద సాహిత్యాన్ని వివిధ పేర్లతో వ్యాఖ్యానించారు. ప్రజా వాఙ్మయం(ఖండవల్లి లక్ష్మీరంజనం), పదవాఙ్మయం(ఆడిదం రామారావు), అనాధృత వాఙ్మయం(మల్లంపల్లి సోమశేఖరశర్మ), గేయరచనలు(వావిలాల సోమయాజులు), మధుర కవిత(వేటూరి ప్రభాకరశాస్త్రి), దేశి సారస్వతము(శ్రీపాద గోపాల కృష్ణమూర్తి), జానపదం(నేదునూరి గంగాధరం) ఎందరు ఎన్నిరకాలుగా పేర్కొన్నా రామరాజు మాత్రం జానపద శబ్దాన్నే ప్రాచుర్యంలోకి తెచ్చాడు. తర్వాతి పరిశోధకులు, విశ్లేషకులు, విమర్శకులు, పండితులు జానపద శబ్దాన్నే తమ రచనల్లో ప్రయోగించారు.

కవిత్వం అనగానే సాహిత్య ప్రపంచంలో పద్యం గుర్తుకు వస్తుంది. ఆధునిక ఉద్యమాల సందర్భంలోనైతే వచన కవిత అని తెలుస్తుంది. అంటే అక్షరం, కవిత్వం ఒడుపు తెలిసి రాసినదే కవిత్వమనే అభిప్రాయం సర్వత్రా వ్యాపించి ఉంది. కాని రామరాజు తన పరిశోధన ద్వారా కొత్త ఆలోచనలకు తెరలేపాడు. కవిత్వ భావనకు ఉండిన ప్రమాణాలను ప్రశ్నించి జానపద కవిత్వం అనే ప్రయోగాన్ని తెలుగు సాహిత్య ప్రపంచానికి పరిచయం చేసాడు. ఒక వ్యక్తితో రూపొందిన జానపద కవిత్వాన్ని కళాత్మక కవిత్వమని, సామూహిక కర్తృత్వమైన జానపద కవిత్వాన్ని అజ్ఞాత కర్తృత్వమని విభజన చేసాడు. జానపద గేయం లేదా పాటను జానపద కవిత్వమని వ్యాఖ్యానించాడు. ప్రారంభ అధ్యాయాలలో జానపద సాహిత్యం లక్షణాలను వివరించిన రామరాజు జానపద గేయ విభజన, వాటి లక్షణాలను వరుస క్రమంలో విశ్లేషించాడు. గేయాలను స్థూలమైన విభజన చేసి జానపద సాహిత్యాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి దారిచూపాడు.

జానపదులు ఉపనిషత్తులను, ధర్మసూక్తులను, తమ జీవితంలో భాగం చేసుకొని సులభంగా జన సామాన్యానికి అర్థమయ్యేలా పాడుకున్న గేయాలను పౌరాణిక గేయాలని రామరాజు వివరించాడు. కథల రూపంలో పాడుకున్న ధర్మ సంబంధ విషయాలను ఈ గేయాలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాయి. పౌరాణిక గాథలపై ప్రజలకు ఉన్న భక్తిని ఈ గేయాలు వ్యక్తం చేస్తున్నాయని రామరాజు నిర్ధారణ చేసాడు. జానపదులు రామాయణం మీద పాడుకున్న పాటలన్నింటిని సేకరిస్తే జానపద రామాయణం అవుతుందని ఆయన చేసిన ఆలోచన పరిశోధన ప్రమాణాలకు మకుటాయమానంగా ఉంది. చరిత్రను నిర్మాణం చేయడానికి ప్రజల చరిత్ర మౌలిక ఆధారం. ప్రజలు తమ చరిత్రను పాటల రూపంలో పాడుకుంటూ నిర్మాణం చేసుకుంటారు. కనుక జానపదుల

గేయాలు కూడా చరిత్రకు ప్రభల ఆధారమని రామరాజు చారిత్రక గేయాల పార్ట్‌లో వివరించాడు. జానపదులకు తమదైన ప్రత్యేక వారసత్వం ఉంటుంది. జానపద నాయికా నాయకులు కూడా ఉంటారు. మియాసాబ్, సోమనాద్రి, రామేశ్వరరావు, రాణి శంకరమ్మ, పందుగోల్ల సాయన్న మొదలైన వ్యక్తుల చరిత్ర ప్రధాన స్రవంతి చరిత్రలో భాగం కాలేదు. ఈ చరిత్ర పుటలకెక్కాలంటే జానపద చారిత్రక గేయాలను ఆకరంగా స్వీకరించాలని రామరాజు ప్రతిపాదించాడు. సదాశివారెడ్డి, పర్వతాల మల్లారెడ్డి, సర్వాయి పాపన్న, బల్మూరి కొండలరాయుడు చరిత్ర చారిత్రక గేయాల ద్వారా గుర్తించగలుగుతాం. చారిత్రక గేయాలలో అద్భుతరసం తప్పనిసరి ఉంటే, జానపదుల కల్పనా చాతుర్యానికి ఇదొక తార్కాణంగా ఆయన పేర్కొన్నాడు. "రామరామ యనంత కాలం రాజ్యమేల లేము జగము వుందు కాలము వరకు మనము వుండబోము" అనే పాట బొబ్బిలి వారి నినాదంగా రామరాజు భావించి నిర్ధారణ చేసాడు.

భారతీయుల్లో అమూర్త భావాలు అత్యధికంగా ఉంటాయి. కనుక జానపదులు తమ విశ్వాసాల నుంచి, భక్తి భావం నుంచి అల్లుకొని పాడుకున్న పాటలను మత సంబంధ గేయాలుగా రామరాజు విభజించాడు. మనిషి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక విషయాలన్నీ చాలా సందర్భాలలో మతానికి లోబడి ఉంటాయని ఆయన అభిప్రాయం. ఈ విషయంలో ఎవరికైనా భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అయితే శైవ, వైష్ణవ మతాలకు ఆవల కూడా మత సంబంధ గేయాలుంటాయనే మౌఖిక సంప్రదాయాన్ని ఆయన ఈ పరిశోధనలో  పేర్కొన్నాడు. ఉత్పత్తిలో, కుటుంబంలో, సామాజిక కార్యకలాపాలలో స్త్రీలు ప్రధాన పాత్రను పోషిస్తారు. ఈ క్రమంలో వాళ్లు సృష్టించే లాలి, జోల పాటలు, పెళ్లి పాటలను కలిపి రామరాజు స్త్రీల పాటలుగా విభజన చేసాడు. వివిధ వేడుకల్లో పాడుకునే పాటలన్నింటిని ఈ విభాగంలో విశ్లేషించాడు.

మన సాహిత్యంలో ఒక్కో శబ్దానికి ఒక్కో ప్రత్యేక అర్థం ఉంటుంది. కార్మిక శబ్దం కేవలం కార్మికులకు సంబంధించి, కర్షక శబ్దం వ్యవసాయ సంబంధ పనులకు సంబంధించి వాడుతున్నాం. అయితే రామరాజు ఈ రెండింటిని కలిపి శ్రమ అనే పదంతో అన్వయం చేసి శ్రామిక గేయాలని పేర్కొన్నాడు. ఈ రెండు సందర్భాలలో పరిశోధకుడు విశ్రాంతి వర్గాల పాటనే ఎక్కువగా స్వీకరించాడని కొన్ని పాటలను పరిశీలిస్తే అర్థమవుతుంది. శిష్ట సాహిత్యంలో శృంగారానికి ప్రథమ స్థానం ఉంటుంది. అలాగే జానపదులలో కూడా శృంగారానికి, కరుణ రసానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని ప్రతిపాదించిన రామరాజు శృంగార గేయాలనే విభజన కూడా చేసాడు. రామరాజు చేసిన ఈ స్థూలమైన పాటల వర్గీకరణ జానపద పరిశోధకుల చేత  అనుసరించబడింది.

రామరాజు చొరవతో మరో రెండు పాటల పుస్తకాలు తెలుగు సాహిత్య ప్రపంచానికి అరుదుగా దొరికాయి. ఆయన నిశిత పరిశోధన దృష్టికి ఈ పుస్తకాలు అద్దం పడుతాయి. ఒకటి 'త్రివేణి'(స్త్రీల పిల్లల పాటలు) రెండోవది పల్లెపాటలు. త్రివేణి రామరాజు సంపాదకత్వంలో 1960లో వెలువడింది. తొమ్మిది శీర్షికలతో ఉన్న ఈ పుస్తకంలో 243 పాటలు ఉన్నాయి. ఈ పుస్తకం ఆధారంగా ఆయన తెలుగు ప్రాంతాన్ని విభజించిన తీరు కొత్తగా ఉంది. కోస్తా ప్రాంతాన్ని చాళుక్య సీమ అని తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ సీమ అని రాయలసీమను రాయలసీమ అని పేర్కొన్నాడు. ఈ మూడు సీమలను కలిపి జానపద కవితా సంగమం అని ప్రతిపాదించాడు. రామరాజు సేకరించి 1960లో ముద్రించిన ఇంకో పుస్తకం పల్లెపాటలు. ఏడు శీర్షికలతో ఉన్న ఈ పుస్తకంలో 227 పాటలున్నాయి.

తెలుగు సాహిత్య చరిత్రలో రామరాజు చేసిన మరో పరిశోధన ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. చరిత్రకెక్కని చరితార్థులు అనే ఈ రచన అమూల్యమైనది. తెలంగాణ ప్రాంతం గోల్కొండ నవాబుల పాలన తర్వాత 225 సంవత్సరాల అసఫ్‌జాహి పరిపాలనలో తెలంగాణ ఆంధ్ర తెలుగు కవులు, భాషా సాహిత్యాలు నిరాదరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే 1920వ దశకంలో ఆంధ్రోద్యమం వచ్చింది. ఈ కాలంలోనే ఆంధ్రజనసంఘం ఏర్పడింది. ఈ క్రమంలో తాళపత్ర గ్రంథాల సేకరణ, పరిష్కరణ అవసరం ఏర్పడింది. తెలుగు నేల మీద మానవల్లి రామకృష్ణ కవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి ప్రముఖ పరిశోధకులు విస్మృత కవుల మీద, వారి రచనల మీద కృషి చేసారు. వీరి పరంపరను

తర్వాతి కాలంలో కొనసాగించిన వారు బిరుదురాజు రామరాజు.

తనముందు పరిశోధకులు రాసిన రచనలను, పీఠికలను, పరిశోధనాత్మక వ్యాసాలను, అముద్రిత గ్రంథాలను నిరంతరం అధ్యయనం చేయుటం వలన పరిశోధన పట్ల, విస్మృత కవుల పట్ల ప్రత్యేక ఆసక్తి పెరిగింది. ఇతరులు చేయని పనిని తాను చేయాలనే సంకల్పం కూడా ఏర్పడింది. కనుక చరిత్రకెక్కని చరితార్థులు అనే ఈ రచనలో సాహిత్య చరిత్రకు ఎక్కని ప్రాచీన, మధ్యకాలీన తెలుగు సంస్కృత కవులను పరిచయం చేసారు. మరగున పడిన మాణిక్యాలు, చరిత్రకెక్కని చరితార్థులు పేర్లతో పుస్తకాలను ప్రచురించాడు. "విధి విలాసమెట్టిదో కానీ కాలగర్భమున కనుమరుగైన కృతులను, తత్కవి జీవితములును ఎన్నియో గలవు. కాల ప్రవాహమున కెదురీది నిల్చిన కృతులు కొన్నియే కడమ గ్రంథములుత్తమములైనను నామ రూపాదులు తెలియరానివి కొన్ని, నామమాత్ర వశిష్టములు కొన్ని జీర్ణావస్థలో నున్నవి మరికొన్నియు గలవు. ఇట్లున్న వానిలో గూడా చరిత్రమున కెక్కనివి వేనవేలు. ఆయా గ్రంథములతో పాటు వాని కర్తలకు గూడా నదియే గతిపట్టినదని వేరుగా చెప్పనక్కర్లేదు అని రామరాజు ఆవేదన" కనుక ఈ గ్రంథంలో 34 మంది కవులను చరితార్థులను చేసాడు. ఈ గ్రంథంలో రెడు విభాగాలున్నవి. అప్పటివరకు తెలుగుసాహిత్య లోకం గుర్తించని ఇరవై రెండు మంది తెలుగు కవులు, వారి కావ్యాలలోని ముఖ్యాంశాలను గుర్తించి వివరించారు. పన్నెండు మంది సంస్కృత కవుల గురించి రెండో భాగంలో చెప్పారు. ఈ రచనలో పేర్కొన్న కవులందరి గ్రంథాలు తాళపత్రాల మీద ఉన్నవే.

రామరాజు చేసిన పరిశోధనా కృషిలో మరో ముఖ్యమైన రచన ఆంధ్రయోగులు. ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతూ తమదైన మార్గంలో ప్రయాణిస్తూ ప్రజలకు భక్తి సందేశాన్ని ఇవ్వాలని భావించే వ్యక్తులను యోగులుగా భావించి వారి గురించి కృషిచేసాడు. 1976 నుంచి రామరాజు సత్యసాయిబాబాకు భక్తుడిగా మారారు. అప్పటి నుంచి యోగుల చరిత్రను, యోగభూములను దర్శించటం ఆయనకు అలవాటుగా మారింది. "ఇంద్రీయాలను స్వాధీన పరుచుకొని తగిన ఉపాయంతో చేసేది యోగం. దానిని ఆచరించేవాళ్లు యోగులు. ఆధునిక సామాజిక, రాజకీయ, సాహిత్య చరిత్రల్లో, విజ్ఞాన సర్వస్వాల్లో అరుదుగా కన్పించే యోగుల చరిత్రను రాయాలనే పట్టుదలతో వారిని చదవటం ప్రారంభించిన రామరాజు వారి చరిత్రను ప్రపంచానికి అందించాలని సంకల్పించాడు. 1995లో భారత ప్రభుత్వం చేత నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్‌షిప్ పొందాడు. ఈ అవకాశాన్ని యోగుల చరిత్ర రాయడానికి ఉపయోగించుకున్నాడు. సమాచార సేకరణ కోసం యోగుల సమాధులను దర్శించాడు. వారి శిష్యుల వద్ద నుంచి సమాచారాన్ని సేకరించాడు. ఈ క్రమంలోనే ఆయన విశ్వప్రకాశం, విశ్వహిందు వంటి పత్రికల్లో వ్యాసాలు రాసాడు. 1998లో యాభై మంది యోగులతో పుస్తకం వెలువడింది. ఆయన పరిశోధనలో హిందూ యోగులు, ముస్లీం యోగులు, మహిళా యోగులు అనే విభజన చేసాడు. ఆరు సంపుటాలు వెలువడి, ఇంకా పూర్తి చేయవలసినవి పూర్తి కాకుండానే రామరాజు 2010 సంవత్సరంలో మరణించాడు.

తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును, స్థానాన్ని పొందిన రామరాజు చేసిన కృషి అద్వితీయమయినది. అధ్యయనం, పరిశోధన, అధ్యాపనం అనే మూడు లక్షణాలతో ఆయన జీవించాడు. వైయక్తికంగా ఆయన ప్రాపంచిక దృక్పథంతో, భావాలతో, ఆచరణతో నాకు భిన్నాభిప్రాయం ఉంది. కాని ఆయన పరిశోధన పట్ల, బోధన పట్ల, నిబద్ధత పట్ల అమితమైన గౌరవం కూడా ఉంది. తెలంగాణ సమాజంలో చదువుకున్న మొదటితరం వ్యక్తి ఆయన. ముఖ్యంగా తెలుగు సాహిత్యాన్ని అభ్యసించి ఆ రంగంలోనే ప్రత్యేక పరిశోధన చేసి సాహిత్య విద్యార్థులకు కొత్త చూపును ఇచ్చాడు. పరిశోధకులకు లోతైన దృష్టిని అలవాటు చేసాడు. ఆయన శైలి గ్రాంథికంలో ఉండటం వలన కొంత పరిమితి ఏర్పడింది. అయినా లోతైన పరిశోధన దృష్టి వలన ఎప్పటికీ ఆయన అనుసరనీయుడు.

జ్ఞాపికలు:

1. త్రివేణి, 1998
2. తెలుగు జానపద గేయ సాహిత్యం, 1978
3. చరిత్రకెక్కని చరితార్థులు, 1983
4. ఆంధ్రయోగులు

T

సామాజికం

# సహజ న్యాయానికి వ్యతిరేకంగా జీవో నెం.21

డా. ఇమ్మిడి మహేందర్

తెలంగాణలోని 12 విశ్వవిద్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్ మెంట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందించదగ్గ విషయం. గత దశాబ్ది తెలంగాణలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి అనేక పరిమితులు ఏర్పడ్డాయి. ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకు గత ప్రభుత్వం చూపాల్సినంత చొరవ చూపలేదనే విషయాన్ని గత ప్రభుత్వానికి తెలంగాణ సమాజం అర్థం చేయించింది. ఏ సమాజంలోనైనా విద్య మొదటి ప్రాధాన్యత అవ్వాలి. కానీ, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కర్ణుని చావుకి సవాలక్ష కారణాలంటూ దీనికి అనేక కారణాలున్నాయి. చెప్పుకుంటే ఒడిసే ముచ్చట కాదు. కానీ, వర్తమాన సమాజం ఈ పరిస్థితి మారాలని కోరుకుంటుంది.

ప్రపంచీకరణ ప్రభావం, పెట్టుబడి ప్రవాహం వల్ల విద్య ప్రాథమిక హక్కుగా, నైతిక బాధ్యతగా గుర్తించబడటం లేదు. కేవలం ఒక పారిశ్రామిక రంగంగా తయారు అయింది. తెలంగాణ రాజధానిగా, మిని ఇండియాగా పిలవబడుతున్న హైదరాబాద్‌లో ఉన్నత విద్య ముఖ్యంగా ప్రైవేట్ రంగం చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. గత 30 ఏళ్ల కాలంలో నెలకొన్న రాజకీయార్థిక కారణాల వల్ల దేశవ్యాప్తంగా ఒక అసమ సమాజం ఏర్పడింది. దీనివల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు నాణ్యమైన విద్య దూరమయింది. ఇప్పుడు ఈ పరిస్థితి మారాలి.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి విధి, విధానాలను జీవో నెం. 21 ద్వారా ఖరారు చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీని ప్రతిపాదిస్తూ 04.04.2025 తేది నాడు ఈ జీవోని విడుదల చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించిన ఉన్నత స్థాయి కమిటీ ఈ సిఫారసులను చేసినట్లు, వాటిని ఆమోదించినట్లు ప్రకటించారు. నిజానికి ఈ విశ్వవిద్యాలయాల్లో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ అధ్యాపకుల స్థానాన్ని నిర్ధారించకుండా రిక్రూట్‌మెంట్ ప్రస్తావన తీసుకురావడం ద్వారా గత 20 రోజులుగా వివిధ రూపాలలో నిరసన వ్యక్తం అవుతుంది.

ఇక జీవో నెం. 21ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అది సహజ న్యాయానికి, యూజిసి విధి, విధానాలకు వ్యతిరేకంగా ఉన్నదనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఈ జీవో గతంలో ఉన్న నిబంధనల స్థానంలో మూడు దశల స్క్రూటినీ విధానాన్ని అనుసరిస్తూ విశ్వవిద్యాలయాలు ఖాళీలను భర్తీ చేయాలని ప్రతిపాదించింది. ఈ విధానాలను ప్రతీ విశ్వవిద్యాలయం తమ పాలకమండలిలో ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాల్సి ఉంటుందని ఉన్నత విద్యామండలి సూచించింది. జీవో నెం. 21 అనుబంధం A, B, C అనే విభజనల్లో స్క్రూటినీ విధానాలను ఈ కింది విధంగా సూచించారు.

A దశలో 50 మార్కులు కేటాయించారు. ఇందులో అభ్యర్థి అకడమిక్ రికార్డ్, పరిశోధన ప్రదర్శన అంశాల ఆధారంగా మార్కులను కేటాయిస్తారు. ఇందులో యూజీ మార్కులకు గరిష్టంగా 8 మార్కులు, పీజీకి 12 మార్కులు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కి 10 మార్కులు, నెట్/సెట్‌కి 5 మార్కులు, పిహెచ్‌డీకి 10 మార్కులు, ఎం. ఫిల్‌కి 5 మార్కులు, పరిశోధన పత్రాలకు గరిష్టంగా 5 మార్కులను కేటాయించారు. ఈ దశలో సాధించిన మార్కుల ఆధారంగా B దశలోకి 1: 10 లెక్కన పంపుతారు. B దశలో 30 మార్కులు కేటాయించారు. ఇందులో బోధన అనుభవానికి సంవత్సరానికి 1 మార్కు చొప్పున, గరిష్టంగా 10 మార్కులు, పోస్ట్ డాక్టోరల్‌కి 05, రీసెర్చ్ అసోసియేట్‌కి 02 మార్కులు గరిష్టంగా 5 మార్కులు, పుస్తక రచన స్వీయ రచన అయితే 5 మార్కులు, సంయుక్త రచనకు 03 మార్కులు, ఎడిటర్‌గా ఉంటే 02 మార్కులు గరిష్టంగా 5 మార్కులు, డెమో లెక్చర్‌కి 10 మార్కులు కేటాయించారు. ఈ దశలో 30 మార్కులకు గాను అభ్యర్థి సాధించిన మార్కుల ఆధారంగా 1:5 లెక్కన C దశలోకి పంపుతారు. ఈ C దశలోకి 20 మార్కులు కేటాయించారు. ఇందులో అభ్యర్థి విషయ పరిజ్ఞానం, సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వాల

ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఇది ఈ మూడు దశల్లో ఉన్న మార్కుల విభజన. స్క్రూటినీ విధానం.

ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన స్క్రూటినింగ్ విధానాలను లోతుగా గమనిస్తే అనేక లోటుపాట్లు ఉన్నాయనే విషయం అర్థమవుతుంది. వాటిని ఇక్కడ క్షుణ్ణంగా పరిశీలిద్దాం. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు రెండు దశల స్క్రూటినీ పద్ధతినే పాటిస్తున్నారు. మొదటి దశలో API Score 100 మార్కులు, ఇంటర్వ్యూ, ప్రజంటేషన్‌కి 50 మార్కులను కేటాయిస్తారు. ఈ పద్ధతినే చాలా వరకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్నాయి. కానీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రతిపాదిత కమిటీ రూపొందించిన ఈ జీవోలో ఈ పద్ధతిని మార్చారు. స్క్రూటినింగ్ విధానాన్ని మూడు దశలకు పెంచి, A – A-50, B-30, C-20 అని మార్కులకు పరిమితం చేస్తూ, మిగతా వాటితో కలపకుండా వాటిని కట్టడి చేసారు. ఇది అనాలోచిత నిర్ణయం. ఇక ప్రతిపాదిత A దశలో పిహెచ్డీకి 10 మార్కులు మాత్రమే కేటాయించారు. నిజానికి దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో 25 నుండి 30 మార్కులను కేటాయిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే అత్యున్నత డిగ్రీగా పేరు ఉన్న పిహెచ్డీ కన్నా, పీజీకి మార్కులు అధికంగా కేటాయించారు. ఇదెక్కడి విధానమో జీవో రూపకర్తలకే తెలియాలి.

అలాగే బోధనానుభవానికి సంవత్సరానికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కులు ఇస్తున్నారు. అలాగే పోస్ట్ డాక్టోరల్, రీసెర్చ్ అసోసియేట్‌షిప్‌లకి సంబంధించి 05 మార్కులు ఇస్తున్నారు. ఇందులో అభ్యర్థి 30 మార్కులలో సాధించిన మార్కుల ఆధారంగానే ప్రతిపాదిత C దశలోకి 1: 5 పద్ధతిలో ఎంపిక చేస్తామని ప్రకటించారు. దీని వల్ల నూతనంగా పిహెచ్డీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు బోధన, పరిశోధానుభవం విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. స్క్రూటినీ అనేది అభ్యర్థి మెరిట్ ఆధారంగా జరగాలి కానీ, ఇందులో అనుభవం పేరుతో స్క్రూటినీ జరుగుతుంది. ఇది సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకం. అలాగే ఎటువంటి వివక్షత చూపకుండా సమాన అవకాశాలు కల్పించే భారత రాజ్యాంగం ఆర్టికల్ 16కి ఈ జీవో వ్యతిరేకం. 30 మార్కులలో నూతనంగా పిహెచ్డీ పూర్తి చేసుకున్న అభ్యర్థి సహజంగానే 15 మార్కులు కోల్పోతాడు. సగం మార్కులు కోల్పోయిన తర్వాత మిగతా 15 మార్కులకు పోటీ పడి తర్వాతి దశలోకి ఎలా వెళ్లగలరు? ఇంత స్పష్టంగా సమస్య అర్థమవుతుంది. అభ్యర్థి మెరిట్‌ను ప్రతిపాదిత స్థానానికి సూచించిన అర్హతల్లో చూడాలి కానీ, అనుభవం ఏనాటికీ మెరిట్ కాజాలదు. ఈ అభ్యంతరం పట్ల ఈ జీవో రూపకర్తలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అయినా విశ్వవిద్యాలయ స్థాయి అధ్యాపక స్థితికి మొదటి అడుగు (డోర్ స్టెప్) అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానానికి ఎక్స్‌పీరియన్స్‌ని ప్రధానం చేసి, ఈ మార్కులతోనే స్క్రూటినీ చేస్తామని చెప్పడం అప్రజాస్వామికం.

B దశలోకి వచ్చిన అభ్యర్థి మెరిట్‌ని పరిగణలోకి తీసుకోకుండా "బోధనానుభవం, పరిశోధానుభవం" పేరుతో మార్కులను కేటాయించి, ఇంటర్వ్యూ దశలోకి పంపుతున్నారు. దీనివల్ల బోధన, పరిశోధనలపై మక్కువతో ఉన్న నూతన అభ్యర్థులకు ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన విధి, విధానాలే అడ్డంకిగా మారుతున్నాయి. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కి అనర్హులని నూటికి నూరు శాతం ప్రకటిస్తున్నాయి. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల బోధనానుభవాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. విచిత్రమేమిటంటే యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న వారికి సర్వీసును అంగీకరిస్తూ, మాతృ విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న వారికి సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం. యూనివర్సిటీ పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ చేసి పార్ట్ టైమ్ బోధకులను ఎంపిక చేసింది. యూనివర్సిటీలు అధ్యాపకులను ఎంపిక చేసిన ఈ విధానం మంచిది కాదా? తనని తానే దోషి అని పిలుచుకుంటుందా? అనే విషయాలను తేల్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఈ జీవోలో ప్రస్తావించిన A దశ స్క్రూటినీ విధానం ఆబ్జెక్టివిటీకి దగ్గరగా ఉంది. కానీ, B, C దశల్లో కేటాయించిన మార్కుల విషయంలో సబ్జెక్టివిటీ చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ఉన్నత విద్యాసంస్థల్లో బాధ్యతాయుతమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం పారదర్శకంగా, న్యాయంగా జరగాలంటే ఈ జీవోలోని అంశాలను మరింత పారదర్శకంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే సమాజం కోరుకుంటున్న బాధ్యతాయుతమైన, సుశిక్షిత, ప్రతిభావంతమైన అభ్యర్థులు బోధకులుగా మారే అవకాశం ఉంటుంది. కనుక ఇట్లాంటి అప్రజాస్వామిక, సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్న మూడు దశల స్క్రీనింగ్ విధానాన్ని, ఇతర అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, మెరిట్ ఆధారంగా స్క్రూటినీ విధానాలను రూపొందించాలి. జీవో నెం. 21ని వెనక్కి తీసుకొని, తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రాతిపదికను తయారు చేయాలి.

**★ రచయిత: అధ్యాపకులు, తెలుగుశాఖ, ఓయూ** T

తొవ్వ ముచ్చట

# కృత్రిమ మేధ(AI)ను శాసించే స్థాయికి భాషా సాహిత్య పరిశోధన చేరుకోవాలి

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

ఇంటర్వ్యూయర్: డా. జి. ఆదినారాయణ

*"అక్షరం ఒకవైపు/అన్నం ఒకవైపు పెడితే/నేను అక్షరాన్నే హత్తుకుంటాను ఆబగా!" అని అక్షరాన్ని హత్తుకున్న ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు గారు. ఆయన తన కవిత్వం, విమర్శ, పరిశోధన వ్యాసాలతో తెలుగు, ఆంధ్రేతర ప్రాంతాలకు కూడా ఎంతో సుపరిచితమైన వ్యక్తి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, పరిశోధకుడిగా, ప్రొఫెసర్‌గా, తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులుగా ఉంటూ, గత 25 సంవత్సరాల నుండి తెలుగు బోధన, పరిశోధన, విమర్శ, సృజనాత్మక సాహిత్యరంగంలో విశేషమైనకృషి చేస్తున్నారు. సమకాలీన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, తెలుగు భాషాసాహిత్యాలలో నూతన ప్రయోగాలను చేస్తూ, ఆ ఫలాలను విద్యార్థులకు, పరిశోధకులకు అందిస్తోన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు గారితో నడుస్తున్న తెలంగాణ పత్రిక తరుపున డా. ఆదినారాయణ నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది.*

**1. మీరు ఎప్పుడు, ఎక్కడ జన్మించారు. మీ కుటుంబ నేపథ్యం ఏమిటి?**

**ఆచార్య దార్ల:** సంతోషం డాక్టర్ ఆదినారాయణ. ముందుగా ఈ ఇంటర్వ్యూ ప్రచురిస్తున్న నడుస్తున్న తెలంగాణ పత్రిక సంపాదక మండలికి, యాజమాన్యానికి నా కృతజ్ఞతలు.

సమైక్య ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలం, చెయ్యేరు అగ్రహారంలో పుట్టాను. నిజానికి నా నిజమైన పుట్టిన తేదీ నాకు తెలియదు. ఒకవేళ ఇదే నా నిజమైన పుట్టిన తేది అనేది కూడా నాకు అనుమానమే. నాకు నేనుగా స్కూల్ లోకి వెళ్లి చేరిన తర్వాత ఆ ఉపాధ్యాయులు వేసిన పుట్టిన తేదీ 5 సెప్టెంబర్. అంటే నన్ను మా అమ్మా, నాన్న ప్రత్యేకించి పాఠశాలలో చేర్పించలేదు. మా చెల్లిని ఎత్తుకొని ఉండవలసి వచ్చేది. అమ్మానాన్న కూలి పనికి వెళ్లేవారు. ఆ సమయంలో మా చెల్లినీ, తమ్ముడినీ చూసుకోవలసిన బాధ్యత నాపై ఉండేది. నాకంటే ఇద్దరు పెద్దవాళ్ళు ఉన్నారు అందులో పెద్దన్నయ్య చదువుకునేవాడు. చిన్నన్నయ్య అమ్మ నాన్నతో కలిసి పనికి వెళ్లేవాడు. అందువల్ల అనివార్యంగా మా చెల్లెల్ని తమ్ముడిని చూసుకోవాల్సిన బాధ్యత నాపై పడేది. సాధారణంగా తమ్ముడు నాన్నతోపాటు వెళ్ళిపోయేవాడు. చెల్లిని మాత్రం నేనే చూడవలసి వచ్చేది.

మేము కౌలుకు చేస్తున్న పొలం ప్రాథమిక పాఠశాలకు ఆనుకునే ఉంటుంది. ఆ పొలంలో వేరుశెనగ ఎండేసిన వాటిని చూస్తూ మా చెల్లిని కూడా నేను చూసుకోవాలి. చాలామంది స్కూలుకు వెళుతూ, ఆడుకుంటూ ఉంటే వాళ్లతోపాటు నాకు కూడా ఆడుకోవాలనీ, బడికి వెళ్లాలనీ అనిపించేది. అలా మా చెల్లిని తీసుకుని నేను స్కూల్ కి వెళ్ళిపోయాను. ఈలోగా ఆ పొలంలో ఎండేసిన వేరుశనగలు ఒకరిద్దరు తస్కరించటం, ఆ తర్వాత ఇది తెలిసి ఇంట్లో నన్ను తిట్టడం, బాధపడడం అన్నీ జరిగిపోయాయి! కానీ, మళ్ళీ బడి మాత్రం మానిపించలేదు.

మా కుటుంబం నేపథ్యం చూస్తే, మా నాన్న కొబ్బరి చెట్లు ఎక్కి కొబ్బరికాయలు తీయడం, తాటాకు కొట్టడం, కల్లు గీయడం వంటి పనులు చేసేవాడు. ఆ పనులు అయిపోయిన తర్వాత ఆయనకి వచ్చిన అన్ని పనులు చేసేవాడు. అంటే వ్యవసాయ పనులు, ఇతరమైన చేపలు పట్టడం వంటి పనులు.

అమ్మ మా కుటుంబాన్ని చూసుకుంటూనే వ్యవసాయ కూలీగా ఉండేది. మా తాత కొంచెం చదువుకున్నాడని




చెప్పారు. ఆయన కవ్వమ్మ, బాలనాగమ్మ కథలు చదివేవాడు. భారత, రామాయణాలు వంటివి చదివేవాడు. పెద్ద చదువులు చదవలేదు. మా తాతకు కూడా కొబ్బరి దింపులు తీయడం, తాటాకు కొట్టడం, కల్లు గీయడం అనేది వృత్తిగా ఉండేది.

ఆ విధంగా మా అన్నదమ్ముల నుండే చదువుకున్న తొలితరంగా చెప్పుకోవాలి. నా బాల్యం గురించి నా ఆత్మకథ 'నెమలి కన్నులు' మొదటి భాగంలో సవివరంగా చెప్పాను.

**2. మీ విద్యాభ్యాసం విశేషాలను వివరించండి?**

ఐదో తరగతి వరకు మా స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఉన్నత పాఠశాల విద్య మండల కేంద్రం కాట్రేనికోనలో చదివాను. కళాశాల విద్యను శ్రీ కోనసీమ బానోజీ కామర్స్ కళాశాల అమలాపురంలో అంటే తాలూకా కేంద్రంలో చదివాను. తాలూకా కేంద్రంలో చదవడంవల్ల కూడా డిగ్రీ చదవాలని, అది ఎలా చదవాలో కూడా తెలిసింది. అమలాపురంలోని ఎస్.కె.బి.ఆర్ కళాశాల చాలా పెద్దది. అక్కడున్న అధ్యాపకులు ఉన్నత విద్య గురించి దానివల్ల వచ్చే అవకాశాల గురించి చెప్పేవారు. వాళ్ళ మాటలు నాకు ఉన్నత విద్యను అభ్యసించడానికి గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి.

**3. మీ ఉన్నతవిద్య, పరిశోధన విశేషాలు తెల్పండి?**

డిగ్రీ అయిపోయిన తర్వాత ఎం.ఏ.తెలుగుకోసం రెండు చోట్ల ఎంట్రెన్స్ రాశాను. అవి, ఆంధ్రా యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ. రెండింటిలోనూ సీట్లు వచ్చాయి. సెంట్రల్ యూనివర్సిటీలో చేరాను. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యాబోధన, పరిశోధనలను ప్రేరేపించేలా ఉంటుంది. దానితో ఎం.ఫిల్., పిహెచ్.డి. కూడా అక్కడే పూర్తిచేశాను. డాక్టర్ ఎస్. టి. జ్ఞానానందకవి రాసిన 'ఆమ్రపాలి' కావ్యం పై ఎం.ఫిల్, ఆరుద్ర రచనలపై ముఖ్యంగా 'పరిశోధకుడుగా ఆరుద్ర' అంశంపై పిహెచ్.డి.చేశాను. ఆచార్య కేకే రంగనాథాచార్యులుగారంటే నాకు అపారమైన గౌరవం. పిహెచ్.డి. పరిశోధనాంశం ఎంపిక చేసుకోడానికి ముందు ఆయన్ని కలిసాను. ఆయన నన్ను "నువ్వు ఏ రంగంలో స్థిరపడాలని కోరుకుంటున్నావు?" అని అడిగారు. టీచింగ్ ఫీల్డ్ లో ఉండాలనుకుంటున్నానని చెప్పాను. అప్పుడు అన్ని సాహిత్య చరిత్రలు అధ్యయనం చేయడంతోపాటు,

సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి అవకాశం ఉండేలా ఆరుద్రపై పరిశోధన చేయమని సూచించారు.

ఆమ్రపాలి కావ్యం ఒక బౌద్ధ ఇతివృతానికి సంబంధించింది. దీనివల్ల బౌద్ధం గురించి అధ్యయనం చేయటం తప్పనిసరి అయింది. నాకు ఎంతో ఉపయోగ పడింది. మరొకవైపు ఆ కావ్య సౌందర్యాన్ని వివరించడానికి అలంకార శాస్త్రాన్ని కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఆరుద్రపై పరిశోధన చేయడంవలన అనేక రచనలు, సాహిత్య చరిత్రలు, విమర్శ గ్రంథాలు విస్తృతంగా చదవాల్సిన అవసరం ఏర్పడింది. అప్పుడే నాకు పరిశోధనలో అనేకమైన గ్యాప్స్ కనిపించాయి. ముఖ్యంగా దళితసాహిత్యం, బహుజన సాహిత్యం, సౌందర్య శాస్త్రంలోని అనేక అంశాలతోపాటు సాహిత్య విమర్శలు, పునర్మూల్యాంకనం చేయువలసిన అంశాలు ఉన్నాయనిపించింది. ఒకవైపు పరిశోధనచేస్తూనే మరొకవైపు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవాళ్ళకి పాఠాలుకూడాచెప్పేవాడిని. ఆకాశవాణిలో అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు ఇవ్వడంతోపాటు, క్యాంపెరర్ గా (ఒక రకంగా ఎనౌన్సర్ వంటి పనే) చేసేవాడిని. గొప్ప గొప్ప వ్యక్తులను కలవడంతోపాటు, నాతోపాటు పనిచేసేవాళ్ళలో గొప్ప ప్రతిభావంతులతో పనిచేయడంవల్ల నిరంతరం ఎంతగా శ్రమించాలో తెలిసేది.

**4. మీ ఉద్యోగ జీవితం గురించి చెప్పండి?**

రిజర్వేషన్ పొందే అవకాశం నాకు ఉన్నా నేనెప్పుడూ మెరిట్ లో సీట్లు సాధించాను. ఆ విధంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూ ద్వారా జూనియర్ లెక్చరర్ గా ఎంపికయ్యాను. తర్వాత ఎయిడెడ్ కళాశాలలో డిగ్రీ లెక్చరర్ గా సెలెక్ట్ అయ్యాను. డిగ్రీ కళాశాలలో చేరాను. ఆ తర్వాత హైదరాబాదులో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు ప్రకటన వెలువడటం, దానికి దరఖాస్తు చేయడం, ఎంపిక కావడం జరిగిపోయాయి. నాకు తెలిసి నా ఉద్యోగాలన్నీ నిజాయితీగా జరిగాయి. రికమండేషన్ కు తావులేకుండా జరిగాయి. నిజాయితీగా ఇంటర్వ్యూలో ప్రశ్నలకు సమాధానం చెప్పడం, ఈ పరీక్షల్లో బాగా మార్కులు వచ్చేలా ప్రయత్నించడం ఇవే నా వ్యూహాలు.

**5. మిమ్మల్ని ఎక్కువగా ప్రభావితం చేసిన రచనలు ఏవి?**

అలెక్స్ హెలీ రచించిన 'ఏడుతరాలు', ఉన్నవ వారి 'మాలపల్లి, గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది', అంపశయ్య నవీన్ 'అంపశయ్య', చిలుకూరి దేవపుత్ర 'పంచమం' వంటి నవలలు, గుర్రం జాషువ 'గబ్బిలం', శ్రీశ్రీ మహాప్రస్థానం, కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం', గురజాడ 'కన్యాశుల్కం' నాటకం, మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' నవల...ఇలా చాలా ఉన్నాయి.

**6. తెలుగుసాహిత్యంలో సద్విమర్శకుడిగా మీకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ రంగాన్ని ఎంచుకోవడానికి కారణమేంటి?**

అసలు విమర్శ అంటేనే గుణదోషాల సమీక్ష చేసి సమాజానికి, సాహిత్యానికి ఏది మంచిదో సూచించే పని చేయడం. కానీ జనవ్యవహారంలో విమర్శ అనగానే ఎత్తిపొడవడం, నిందించడం వంటి అర్థాలలో ప్రాచుర్యం చెందుతోంది. సాహిత్య పరిభాషలో మాత్రం విమర్శ అంటే భిన్న దృక్పథాలతో పరిశీలించడం. సద్విమర్శకుడు అనే పదం కూడా సాహిత్యంలో ఉంది. పాండిత్యం ఉండి, సహృదయతతో చేసే విమర్శ నిజానికి సద్విమర్శ.

సాహిత్య ప్రయోజనాన్ని ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళేదీ, సాహిత్యాన్ని విశ్లేషించేదీ విమర్శ రంగమే. ఎన్ని రచనలు వచ్చాయనే దానికంటే, వచ్చిన రచనల్లో ఎన్ని రచనలు మంచివి అనేది చెప్పాలంటే విమర్శ ఉండాలి. జ్ఞానాన్ని అన్వేషించడంలో, మార్గదర్శనం చేయడంలో సాహిత్య విమర్శ పాత్ర ఎంతో ముఖ్యమైంది. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి గారి దగ్గర బిఏ స్పెషల్ తెలుగు చదువుకునే రోజుల్లోనే సాహిత్య విమర్శ గురించి కూడా చదువుకున్నాను. కవి కంటే విమర్శకుడు సాహిత్య సిద్ధాంతవేత్త ఎంత గొప్పవారో ఆయన చెప్తుండేవారు. ఆ తరువాత సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి పాఠాలు

విన్నాను. సాహిత్య విమర్శకు మహోన్నతమైన స్థానం ఉందనిపించేటట్లు వారి పాఠాలు కొనసాగేవి. ఒక పద్యం, ఒక నవల, ఒక కథ, ఒక నాటకం సామాన్య పాఠకుడు చదువుకోవడం కంటే, విమర్శకుడు దాన్ని విశ్లేషించి చెప్పడం వేరు. వీరితోపాటు చాలామంది రాసిన సాహిత్య విమర్శలను చదువుకున్నాను. అవన్నీ సాహిత్యాన్ని దీప్తివంతం చేస్తున్నాయనిపించింది. నేను కూడా ఒక ఉత్తమ విమర్శకుడుగా కృషి చేయాలనిపించింది. సృజనాత్మక రచనలు చదువుతూ, చిన్నచిన్న ఉత్తరాలుగా, సమీక్షలుగా, వ్యాసాలుగా, సిద్ధాంత గ్రంథాలుగా, వివిధ పరిణామాలలో పయనిస్తున్న నన్ను కూడా ఒక విమర్శకుడిగా గుర్తించటం సంతోషంగా ఉంది.

**7. మీకు నచ్చిన కొంతమంది సాహిత్య విమర్శకుల గురించి చెప్పండి!**

ఇది నిజానికి పెద్ద జాబితా చెప్పవలసిన సమాధానం. అయినప్పటికీ కొంతమందిని ఇక్కడ పేర్కొంటాను. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, శ్రీశ్రీ, ఆరుద్ర, కె.వి.రమణారెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, ఎస్వీ రామారావు, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, చేరా, బేతవోలు రామబ్రహ్మం, వడలి మందేశ్వరరావు, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య, అద్దేపల్లి రామమోహనరావు, త్రిపురనేని మధుసూదనరావు, పాపినేని శివశంకర్, వరవరరావు, ఆచార్య కాత్యాయనీ విద్మహే, సి. మృణాళిని, ఆచార్య కొలకలూరి ఇనాక్, జి.లక్ష్మీనరసయ్య, అంపశయ్య నవీన్, ముదిగంటి సుజాత రెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, ఆచార్య బన్న ఐలయ్య, కత్తి పద్మారావు, సీతారాం, అఫ్సర్, బి. తిరుపతిరావు, చింతకింది కాశీం, ఎ.కె. ప్రభాకర్, కాసుల ప్రతాపరెడ్డి, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, కోయి కోటేశ్వరరావు, సిహెచ్.లక్ష్మణచక్రవర్తి వరకూ ఇలా ఎంతోమంది ఉన్నారు. భాషాశాస్త్ర దృక్పథంలోంచి శైలీశాస్త్ర విమర్శను విశేషంగా చేసిన ఆచార్య వరివి రామనరసింహంగారికి విమర్శరంగంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. భారతీయ ఆలంకారిక సిద్ధాంతాలతోపాటు పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలను సమన్వయం చేసుకుంటూ, ఒక నూతన ఆలోచనా విధానాన్ని కలిగించేలా ఆ విమర్శ కొనసాగింది.

**8. సాహిత్య పరిశోధనలో సిద్ధాంతం, విమర్శ, చరిత్ర వంటివాటిపై శాస్త్రీయ అన్వయం ఎలా ఉండాలి?**

తెలుగులో కూడా ప్రక్రియల పట్ల ప్రత్యేక అధ్యయనాలు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు పరిశోధనలో విమర్శ, విమర్శలో పరిశోధన, సాహిత్య చరిత్రలో పరిశోధన, విమర్శ మిళితమై కొనసాగాయి. ఆ పరిస్థితిని నేటికీ కొంతమంది కొనసాగిస్తున్నారు. అలా కొనసాగినప్పుడు వాటిని పరిశోధనాత్మక విమర్శలనీ, విమర్శనాత్మక పరిశోధనలనీ ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం వంటివారు వింగడించే ప్రయత్నం చేశారు. సిద్ధాంతీకరించడం అనేది ప్రధానంగా పరిశోధనకు సంబంధించింది. గుణదోష సమీక్ష చేయడం విమర్శలో ముఖ్యం. సాహిత్య పరిణామాల్ని, ఆ వివిధ దశలను కాలానుక్రమంగా గుర్తించటం సాహిత్య చరిత్ర పని. వీటి మౌలిక స్వభావాన్ని ముందుగా అర్థం చేసుకుంటే వాటిని శాస్త్రీయంగా సమన్వయించుకోవడం సులభం అవుతుంది. తొలిదశలో వచ్చిన కవుల చరిత్ర, సాహిత్య చరిత్ర, వికాస చరిత్రలలో ఈ మూడు అంశాలు పెనవేసుకొని కొనసాగాయి. ప్రస్తుతం ఈ దృష్టితో పరిశోధనలు జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**9. తెలుగు సాహిత్యంలో ప్రక్రియాపరమైన అధ్యయనం, పరిశోధనలకు ఉపయోగించే గ్రంథాలు ఏవి?**

ఇప్పుడిప్పుడే వీటిపై అధ్యయనంలోనూ, పరిశోధనలలోనూ దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పింగళివారి సాహిత్య శిల్పసమీక్ష, డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి ఆధునిక ఆంధ్ర కవిత్వం; సంప్రదాయం-ప్రయోగాలు అనే సిద్ధాంత గ్రంథం, జి.వి. సుబ్రహ్మణ్యం గారి సాహిత్యంలో చర్చనీయాంశాలు, వడలి మందేశ్వరరావుగారి అనుశీలన, సిహెచ్. లక్ష్మణ్ చక్రవర్తి గారి సంపాదకత్వంలో వచ్చిన తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, నళిని గారి సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ వంటివి ప్రక్రియల స్వరూప, స్వభావాన్ని అవగాహన చేసుకోవడానికి వాటిని అనుశీలించే శాస్త్రీయ విధానానికి ఉపయోగపడే కొన్ని గ్రంథాలు.

**10. తెలుగు భాషాసాహిత్య పరిశోధనల లక్ష్యం, పరిశోధన సమస్యలను ఎలా అవగాహన చేసుకోవాలి?**

ఏ పరిశోధనకైనా ఆ పరిశోధనకు మొట్టమొదట తెలియజేయవలసింది పరిశోధన లక్ష్యం. పరిశోధన లక్ష్యం

అనేది పరిశోధన ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన భాగం. ఇది సత్యాన్వేషణ చేసే పరిశోధకుడి అధ్యయనానికి దారిదీపంగా మారుతుంది. పరిశోధన లక్ష్యం (Research Objective) అనేది శోధకుడు పరిశోధనలో సాధించదగ్గవి: స్పష్టత, కొలవగలగడం, చేరుకోవడానికి సాధ్యమైన గమ్యం. దీనికి కొన్ని ముఖ్య లక్షణాలను చెప్పుకోవచ్చు. అ) స్పష్టత (Clarity): ఏమి తెలుసుకోవాలనుకుంటున్నామో తేటతెల్లంగా ఉండాలి. ఆ). కొలవగలగడం (Measurability): గమనించగలిగే, విశ్లేషించగలిగే సమాచారం ఉండాలి. ఇ) సాధ్యత్వం (Feasibility): ఇవ్వబడిన కాల పరిమితి, వనరులు, పరిధిలో సాధించదగిన లక్ష్యం కావాలి. ఈ) ప్రయోజనకత్వం (Relevance): పరిశోధన సమస్యకు సంబంధించినదిగా ఉండాలి.

సాహిత్య పరిశోధనలో "ఆధునిక తెలుగు కవిత్వంలో బహుజన దృక్కోణాన్ని విశ్లేషించడం." తన లక్ష్యంగా చెప్పొచ్చు. ఏమి తెలుసుకోవాలి అన్నదే పరిశోధన సమస్య (Research Problem). దాన్ని తెలుసుకోవడానికి ఎలా ముందుకెళ్లాలి అన్న దానికిగల దిశ పరిశోధన లక్ష్యం (Research Objective) అవుతుంది.

**11. పరిశోధనలో పరిధి, ఊహా పరికల్పనల పాత్ర ఏమిటి?**

పరిశోధనలో పరిధి (Scope), ఊహా పరికల్పనలు (Hypotheses) రెండూ కీలక పాత్ర వహించే అంశాలు. ఇవి శోధనను సరైన దిశలో నడిపించేందుకు అవసరమైన బలమైన పునాది వంటివి.

పరిశోధన పరిధి (Scope of the Research) అనేది పరిశోధకుడు పరిశీలించబోయే అంశాల పరిమితిని, కాలాన్ని, ప్రాంతాన్ని, పరిశోధన చేసే పరిమిత విషయాలను ముందుగానే స్పష్టంగా సూచిస్తుంది. అంతేకాదు, పరిశోధన పరిమితులను కూడా స్పష్టంగా నిర్వచిస్తుంది. తన పరిశోధనలో గమనించదగిన అంశాలపై దృష్టిని కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. పరిశోధన వ్యాసం/థీసిస్ వ్యాప్తిని నియంత్రిస్తుంది. తన పరిశోధన మరింత విస్తృతంగా కాకుండా కేంద్రీకృతంగా పయనించేటట్లు సహాయపడుతుంది. పరిశోధన గమ్యం స్పష్టంగా ఉండేందుకు దోహదపడుతుంది. ఉదాహరణ: "ఈ పరిశోధన 2000 నుండి 2020 మధ్య వెలువడిన తెలంగాణ ప్రాంతానికి చెందిన దళిత కవుల కవిత్వాన్ని మాత్రమే విశ్లేషిస్తుంది." అని చెప్పడం ద్వారా తన పరిశోధన పరిధి స్పష్టంగా తెలియజేసినట్లు అవుతుంది. ఉన్న పరిశోధన వేగవంతంగా పూర్తికావడమే కాకుండా సమగ్రంగా రావడానికి అవకాశం కల్గిస్తుంది.

ఊహా పరికల్పనలు (Hypotheses) అనేది పరిశోధకుడు ముందుగా ఊహించిన, పరీక్షించదగిన తాత్త్విక ప్రతిపాదన. ఇది పరీక్షించదగినట్లు ఉండాలి. దీనివల్ల పరిశోధనకు ఒక దిశను సూచిస్తుంది. పరిశీలనకు, డేటా సేకరణకు ఒక ఆధారం ఇస్తుంది. తాత్త్వికంగా సాధ్యమైన సంబంధాలను పరీక్షించగల అవకాశం కలిగిస్తుంది. పరిశోధన ఫలితాల విశ్లేషణకు పునాది వేస్తుంది. ఉదాహరణకు "తెలుగు సాహిత్యంలో ఆధునికత అనేది సామాజిక, రాజకీయ పరిణామాలతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుంది." అని తన ఊహాపరికల్పనను ముందుగానే చెప్పవచ్చు. ఈ రెండూ కలిసి పరిశోధనకు సరిహద్దులను వివిధ దిశలను నిర్దేశిస్తాయి.

**12. ఊహ పరికల్పనలను ముందుగా వివరించే విషయంలో తెలుగు సాహిత్య పరిశోధన గ్రంథాల పరిస్థితి ఎలా ఉంది?**

తెలుగు సాహిత్య పరిశోధనలలో ఊహాపరికల్పనను పరిగణనలోకి తీసుకుని సిద్ధాంత గ్రంథాలను పరిశీలిస్తే, అతికొద్ది సంఖ్యలోనే ఉంటున్నాయి. దీనిమీద చాలామందికి అవగాహనే ఉండట్లేదు. దీనికి కారణం చాలా విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్ మెథడాలజీ (Research Methodology) అనేది ఒక పాఠ్యాంశంగా లేకపోవడం, జీరో చాప్టర్ (Zero Chapter) లేదా పరిశోధన నేపథ్యానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వకుండా సాహిత్య పరిశోధన సిద్ధాంత గ్రంథాలు తయారైపోతున్నాయి. దీనివల్ల చాలామంది పరిశోధనలకు లక్ష్యం, ఆశయాలు పరిధి, ఊహా పరికల్పన, ఒక మెథడాలజీ వంటివి ఉండట్లేదు.

**13. పరిశోధన విధానాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవడానికి తెలుగులో ఎలాంటి కృషి జరగట్లేదని అంటారా?**

జరగట్లేదని కాదు కానీ, అది నిర్బంధంగా జరగాలి. పరిశోధన విధానాన్ని అధ్యయనం చేసే బోధనా సిబ్బంది

ఉండాలి. ప్రతి విశ్వవిద్యాలయం ఇంచుమించు పరిశోధనలు, విధానాలపై సదస్సులు నిర్వహిస్తుంది. కానీ, మరలా ఆ విశ్వవిద్యాలయం ఆ సదస్సులో సమర్పించిన పత్రాలను గ్రంథరూపంలో ఎంతమంది తీసుకొస్తున్నారు? తీసుకొచ్చిన వాటిని ప్రజలకు అందుబాటులో పెట్టగలుగుతున్నారా? సాధారణంగా అటువంటి సదస్సులన్నీ పరిశోధన వికాసాలను తెలుసుకునేటట్లే అత్యధికంగా కొనసాగాయి. అంటే విధానానికంటే విషయానికి అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చాయి.

మన తెలుగువాళ్ళు మొదటి నుండీ తమకంటూ కొన్ని ప్రత్యేక పద్ధతులతో పరిశోధనలు కొనసాగించారు. ఒకరిద్దరు ముఖ్యంగా భాషాశాస్త్రం పరిశోధనల్లోను, పాశ్చాత్య, ఆధునిక పరిశోధన విధానాలు తెలిసినవారు శైలీపత్రాలను (Style Sheet) అనుసరించారు. పాశ్చాత్య సాహిత్య పద్ధతులు విశ్వవ్యాప్తంకావడానికి శాస్త్ర, సాంకేతికరంగాల్లో వచ్చిన మార్పులవల్ల తెలుగు పరిశోధన రంగంలో కూడా మౌలికమైన మార్పులు కనిపిస్తున్నాయి. మన తొలితరం పరిశోధనలలో పరిశోధన విధానం కంటే పరిశోధన అన్వేషణకి ప్రాధాన్యం ఇచ్చారు. కానీ, దాన్ని వివరించే విధానంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. ఆ పద్ధతులే కొనసాగితే భావచౌర్యం పెరిగిపోతుంది. ఎవరి అభిప్రాయాలు ఏమిటో స్పష్టంగా తెలియదు.

అందువల్ల కొత్తగా ప్రవేశించిన అధ్యాపకులు తమ విశ్వవిద్యాలయాలలో కొంతమంది తొలితరంవారు పరిశోధనకు శాస్త్రీయ మార్గం చూపించిన వాటిని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆచార్య గంధం అప్పారావు, ఆచార్య ఆర్ వి ఎస్ సుందరం, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, హెచ్.ఎస్. బ్రహ్మానంద, ఆచార్య కులశేఖర రావు, కుసుమారెడ్డి, డా.ఎస్. జయ ప్రకాష్, ఆచార్య పులికొండ సుబ్బాచారి, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మొదలైనవాళ్ళు సాహిత్య పరిశోధనలను శాస్త్రీయంగా చేయడానికి కొన్ని పద్ధతులను వివరించే గ్రంథాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆచార్య నిత్యానందరావుగారు విశ్వ విద్యాలయంలో తెలుగు పరిశోధనలో కూడా పరిశోధన విధానం, పరిశోధన తీరుతెన్నులను అవగాహన చేసుకోవడానికి అనేక అంశాలను ఆ గ్రంథంలో చేర్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎన్. గోపి, డా. వాసిలి వసంత కుమార్, ఆచార్య నసుమాస స్వామి గార్ల ఆధ్వర్యంలో కొన్ని పరిశోధన పత్రికలు వెలువడ్డాయి. కాకతీయ విశ్వవిద్యాలయంలో శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో కూడా పరిశోధన విధానాన్ని తెలుసుకోవడానికి కొన్ని సంచికలు వెలువడ్డాయి. అభ్యుదయ పరిశోధనల మీద ఒక ప్రత్యేక సంచిక వేసింది. యువ భారతి ఒక రజతోత్సవ సంచికను తీసుకువచ్చింది.

వీటితో పాటు మరికొన్ని ఆంగ్ల గ్రంథాలను ఆధారంగా చేసుకుని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోను, ఆచార్య చింతకింది కాశీం పరిశోధక బృందం ఉస్మానియా యూనివర్సిటీలోను, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య విస్తాలి శంకర్ రావు ఆధ్వర్యంలో మద్రాస్ విశ్వవిద్యాలయం వారు, ఆచార్య రామనాథం నాయుడు ఆధ్వర్యంలో కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూర్ లోను తెలుగు పరిశోధనలలో పరిశోధన విధానానికి సంబంధించిన కొన్ని ప్రత్యేక తరగతులను ఉపన్యాసాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, తెలుగు శాఖవారు, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ లాంగ్వేజ్ డిపార్ట్మెంట్ తదితర కొన్ని సంస్థలు పరిశోధన విధానాన్ని నేర్పడానికి కొన్ని శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. దీని ఫలితంగా ప్రస్తుతం వస్తున్న తెలుగు పరిశోధన గ్రంథాలలో పరిశోధకులు తమ పరిశోధన నేపథ్యం, పరిశోధన విధానం, పరిశోధన లక్ష్యాలు, ఆశయాలు, పరిధి, ఊహాపరికల్పన వంటి అంశాలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఇంకా మరింత స్పష్టత రావలసిన అవసరం ఉంది. పరిశోధన విధానం అనేది శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులు, ఆధునిక జీవితంలో వస్తున్న సంక్లిష్ట పరిస్థితులను శాస్త్రీయంగా అందించడానికి ఎప్పటికప్పుడు అప్డేట్ కావలసిన అవసరం ఉంటుంది.

**14. పరిశోధనకు రూపం(పుటల పరంగా) ఉండాలి అనే నియమం ఉంటుందా? పరిశోధనకు అసలు రూపం ముఖ్యమా, సారం ముఖ్యమా?**

పరిశోధనకు రూపం (పుటల పరంగా) లేదా పరిమాణం విషయంలో సాధారణంగా ఖచ్చితమైన నియమం

అనేది సందర్భాన్నిబట్టి మారుతుంది. ఆయా విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, జర్నల్స్, లేదా గ్రాంట్ సంస్థలు తమ నిర్దిష్ట మార్గదర్శకాలను అనుసరించి పరిశోధన పత్ర పరిమాణం (పుటలు, పదాల సంఖ్య) లేదా రూపం (ఫార్మాట్) గురించి నియమాలు విధించవచ్చు. ఉదాహరణకు: ఒక పీహెచ్డీ థీసిస్కు 100–300 పుటలు లేదా అంతకంటే ఎక్కువ ఉండవచ్చు. సంస్థ మార్గదర్శకాల ఆధారంగా జర్నల్ ఆర్టికల్స్ సాధారణంగా 10–30 పుటల మధ్య లేదా 3,000–8,000 పదాల మధ్య ఉండాలని నిర్దేశిస్తాయి. కాన్ఫరెన్స్ పేపర్లు లేదా షార్ట్ కమ్యూనికేషన్స్కు 4–10 పుటలు లేదా 1,500–3,000 పదాలు అని పరిమితి ఉండవచ్చు.

స్పష్టత సంస్థాగత లక్షణంగా గుర్తించాలి. పరిశోధన పత్రం ఒక నిర్దిష్ట నిర్మాణం (పరిచయం, సాహిత్య సమీక్ష, పద్ధతి, ఫలితాలు, చర్చ, ముగింపు)ను కలిగి ఉండాలి. ఈ రూపం పాఠకులకు సమాచారాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. జర్నల్స్ లేదా కాన్ఫరెన్స్లు నిర్దిష్ట పరిమాణం, ఫార్మాట్ను డిమాండ్ చేస్తాయి, ఎందుకంటే ఇది వారి ప్రచురణ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది. పరిశోధన పత్రం చాలా పొడవుగా ఉంటే, పాఠకులు దానిని పూర్తిగా చదవడానికి సమయం కేటాయించకపోవచ్చు. అదే సమయంలో, చాలా చిన్నగా ఉంటే, అవసరమైన వివరాలు లోపించవచ్చు.

ఒక సమర్థవంతమైన రూపం (ఫార్మాట్, సైటేషన్స్, రిఫరెన్స్లు) పరిశోధన విశ్వసనీయతను, వృత్తిపరమైన స్వభావాన్ని పెంచుతుంది. పరిశోధన సారం దాని కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, జ్ఞానానికి జోడించే విలువలో ఉంటుంది. ఒక పరిశోధన పత్రం ఎంత చక్కగా రూపొందించినా, దాని సారం బలహీనంగా ఉంటే దాని ప్రభావం తక్కువగా ఉంటుంది. పరిశోధన ఒక నిర్దిష్ట ప్రశ్న లేదా సమస్యను పరిష్కరించాలి. ఈ సమస్యను స్పష్టంగా గుర్తించి, దానికి సమర్థవంతమైన జవాబును అందించడం సారం యొక్క లక్ష్యం.

సాధారణంగా పరిశోధన సారం దాని డేటా విశ్లేషణ, ఆధారాల బలంపై ఆధారపడి ఉంటుంది. ఇవి లేని పరిశోధన ఖాళీగా ఉంటుంది. సారం బలంగా ఉంటే, అది ఆ రంగంలో కొత్త చర్చలను రేకెత్తించవచ్చు, విధానాలను ప్రభావితం చేయవచ్చు లేదా ఆచరణాత్మక పరిష్కారాలను అందించవచ్చు. చివరికి, సారం ఎక్కువ ముఖ్యమైనది. ఒక పరిశోధన పత్రం చిన్నదైనా లేదా నిర్మాణంలో స్వల్ప లోపాలు ఉన్నా, దాని సారం బలంగా ఉంటే అది గుర్తింపు పొందుతుంది. ఉదాహరణకు, చరిత్రలో కొన్ని మహత్తరమైన శాస్త్రీయ పత్రాలు (ఐన్స్టీన్ యొక్క రిలేటివిటీ పేపర్ వంటివి) చిన్నవి అయినప్పటికీ, వాటి సారంవల్ల గొప్ప ప్రభావం చూపాయి. అయితే, రూపం సారాన్ని సమర్థవంతంగా అందించడంలో కీలకంగా పనిచేస్తుంది. సారం ఎంత గొప్పగా ఉన్నా, అది అస్తవ్యస్తంగా లేదా అస్పష్టంగా అందించబడితే, పాఠకులు దానిని అర్థం చేసుకోలేరు లేదా దాని విలువను తక్కువగా అంచనా వేయవచ్చు. అకడమిక్ సందర్భంలో, రూపం (ఫార్మాట్, పుటలు, సైటేషన్స్) తప్పనిసరిగా అనుసరించాల్సిన నియమాలు కావచ్చు, ఎందుకంటే ఇవి పరిశోధన విశ్వసనీయతను నిర్ధారిస్తాయి. కానీ సృజనాత్మక లేదా స్వతంత్ర పరిశోధనలో, రూపం కంటే సారం ఎక్కువ ప్రాధాన్యత పొందవచ్చు.

పరిశోధనకు రూపం (పుటల పరంగా) అనేది సంస్థాగత మార్గదర్శకాలు లేదా ప్రచురణ అవసరాల ఆధారంగా నిర్ణయించబడుతుంది, కానీ సారం ఎల్లప్పుడూ పరిశోధన ఆత్మ. రూపం సారాన్ని సమర్థవంతంగా అందించడానికి ఒక సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల, రెండూ ముఖ్యమైనవి అయినప్పటికీ, సారం లేని రూపం ఖాళీగా ఉంటుంది, కానీ రూపం లేని సారం తన పూర్తి సామర్థ్యాన్ని చేరుకోలేకపోవచ్చు. పరిశోధకుడు సందర్భాన్ని బట్టి రెండింటి మధ్య సమతుల్యతను సాధించాలి.

**15. విశ్వవిద్యాలయాలలో ఎం.ఫిల్ డిగ్రీని తొలగించిన తర్వాత విద్యార్థులకు పరిశోధన విధానం, పద్ధతులపై అవగాహన ఎలా కలిగిస్తున్నారు?**

భారతీయ విశ్వవిద్యాలయాల్లో ఇటీవల ఎం.ఫిల్ అవసరం లేదని చెప్పారు. అయితే, దానికి ప్రత్యామ్నాయంగా ప్రాజెక్టులు పెట్టుకోవచ్చని కూడా సూచించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో ఈ నూతన విధానాలు రాకముందునుండే ఎం.ఏ. స్థాయిలో పరిశోధన/సిద్ధాంత

గ్రంథ రచనానైపుణ్యాలను అవగాహన కలిగించే విధంగా Techniques of Writing a Dissertation అనే ఒక కోర్సు పెట్టాం. ఇలాంటి కోర్సులు పెట్టుకోవడంవల్ల ఎం.ఏ. స్థాయిలోనే విద్యార్థులకు పరిశోధన పట్ల ఒక అవగాహన కలిగించవచ్చు.

**16. ఎం.ఏ.చివరి సెమిస్టర్ లో ప్రవేశపెట్టిన 'ప్రాజెక్ట్' పేపర్ వల్ల అంత తక్కువ సమయంలో పరిశోధనకు కావాల్సిన మెళకువలు అందుతున్నాయా?**

విశ్వవిద్యాలయాల్లో కూడా సెమిస్టర్ సిస్టం అందుబాటులోకి వచ్చేసింది. ఆరు నెలల్లో ఎంతో నేర్చుకోవచ్చు. అందుకని ఒక సెమిస్టర్ లో థియరీ పూర్తిగా ఉంటుంది. మరొక సెమిస్టర్ లో డిజర్టేషన్ రైటింగ్ ఉండేలా మరలా మార్పులు చేసాం. ఈ కోర్సు చదివిన తర్వాత చాలామంది ఎంతో ఉత్సాహంగా పరిశోధన పత్రాలు రాయడం, చదవడం చేస్తున్నారు. కేవలం పీహెచ్డీ పరిశోధన చేయడానికి మాత్రమే కాకుండా, పీజీ తర్వాత కొన్ని అనివార్య కారణాలవలన పరిశోధన కొనసాగించలేకపోవచ్చు. వారు తమ ఉద్యోగం చేసుకుంటూనే అభిరుచి మేరకు పరిశోధన చర్చలలో పాల్గొనవచ్చు. ఇంటి దగ్గర ఉంటూ కూడా పరిశోధన చేయడానికి, పరిశోధనలలో భాగస్వామ్యం కావడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుంది.

**17. నేటి సాంకేతిక అభివృద్ధిని సాహిత్య పరిశోధనకు ఎలా అన్వయించుకోవాలి?**

సాంకేతికత అందరికీ అందుబాటులో రావడం మంచిదే కదా. ఒకప్పుడు విద్యాభ్యాసం కొందరికి మాత్రమే అందుబాటులో ఉండేది. దానివల్ల వాళ్ళు చెప్పిందే వేదం. నిజంగా ఆసక్తి ఉండి, సామర్థ్యం ఉండి, నేర్చుకోవాలనుకొనే కొన్ని వర్గాలకు ఆ విద్యావకాశాలు అందుబాటులో ఉండేవి కాదు. సాధ్యమైనంతవరకు ఇప్పుడు అందరూ చదువుకోడానికి విజ్ఞాన వాకిళ్ళను తెరిచారు. ప్రజాస్వామిక దేశాలలో ఇది సాధ్యమవుతుంది. అయినప్పటికీ కార్పోరేటు, ఇంటర్నేషనల్, కాన్వెంట్ ప్రభుత్వ పాఠశాల అనే విభాగాలు విజ్ఞానాన్ని దూరం చేసే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాస్త్ర సాంకేతిక రంగం అందరికీ అందుబాటులో రావడం మంచిదే. అయితే దాన్ని అందుకోవడంలో మరలా నైపుణ్యం కావాలి. కృత్రిమ మేధ (Artificial Intelligence) ప్రపంచాన్ని ఇప్పటికే శాసించటం మొదలుపెట్టింది. దీన్ని కూడా శాసించగలిగే స్థాయికి మనం చేరుకోవాలి. దీన్ని మనకి అనుగుణంగా మలుచుకోవాలి. విద్య, వైద్య రంగాలు అతలాకుతలం అయ్యే పరిస్థితి ఉంది. ముఖ్యంగా బోధనారంగంలో నిరంతరం అధ్యయనం చేయడం, కొత్తగా ఆలోచించటం, ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం చేయకపోతే కృత్రిమ మేధ ముందు అటువంటి వాళ్ళు ఎందుకూ పనికి రాకుండా పోయే అవకాశం ఉంది. అందువల్ల రీసెర్చ్ మెథడాలజీలో ఇవన్నీ అధ్యయనాంశాలు కావాలి. ఇప్పటికే రీసెర్చ్ మెథడాలజీని బోధించేవాళ్ళు అప్డేటెడ్ స్టైల్ షీట్లు, ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ని ఉపయోగించమని చెప్తున్నాం.

**18. ప్యూర్ సైన్స్ (ప్రయోగశాలల్లో), సోషల్ సైన్స్, హ్యూమానిటిస్ వంటి పరిశోధనల్లో తేడాలను మనం ఎలా అర్థం చేసుకోవాలి?**

ప్యూర్ సైన్స్ సార్వత్రిక నియమాలను కనుగొనడంపై దృష్టి పెడుతుంది, అయితే సోషల్ సైన్స్ మానవ సంక్లిష్టతను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. హ్యూమానిటీస్ మానవ అనుభవాలను లోతుగా వివరిస్తుంది. ఈ మూడూ పరస్పరం పూరకంగా ఉంటాయి. ఉదాహరణకు, సాంకేతిక ఆవిష్కరణలు (ప్యూర్ సైన్స్) సామాజిక ప్రభావాలను (సోషల్ సైన్స్) సాంస్కృతిక అంశాలను (హ్యూమానిటీస్) పరిశీలిస్తే విషయం మనకి బోధపడుతుంది.

ప్యూర్ సైన్స్ (Pure Sciences) లక్ష్యం ప్రకృతి యొక్క భౌతిక, జీవ దృగ్విషయాలను అర్థంచేసుకోవడం, సిద్ధాంతాలు నియమాలను రూపొందించడం జరుగుతుంది. ఉదా: ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ. వీటి పరిశోధనలు ప్రధానంగా ప్రయోగశాలల్లో వివిధ పద్ధతుల్లో జరుగుతుంటాయి. గణిత గణనలు, పరిశీలనల ఆధారంగా సమాచారాన్ని సేకరిస్తుంటారు. ఉదాహరణకు, ఒక రసాయన ప్రతిచర్య యొక్క ఫలితాలను పరీక్షించడాన్ని చెప్పుకోవచ్చు. పరిమాణాత్మకం (Quantitative) పద్ధతులను ఉపయోగిస్తుంటారు. సార్వత్రిక సత్యాలను కనుగొనడంపై దృష్టిపెడతారు.

సోషల్ సైన్స్ (Social Sciences) పరిశోధనల్లో మానవ సమాజం, ప్రవర్తన, సంస్థలను అధ్యయనం చేయడం (ఉదా. సైకాలజీ, సోషియాలజీ, ఎకనామిక్స్). సర్వేలు,

ఇంటర్వ్యూలు, కేస్ స్టడీలు, గణాంక విశ్లేషణలు, కొన్నిసార్లు ప్రయోగాత్మక పద్ధతులను ఉపయోగిస్తారు. ఉదాహరణకు, ఒక సమాజంలో ఆర్థిక అసమానతల ప్రభావాన్ని అధ్యయనం చేయడం దీనిలో ఉంటుంది.

హ్యూమానిటీస్ (Humanities)లో మానవ సంస్కృతి, చరిత్ర, తత్వశాస్త్రం, సాహిత్యం, కళలను అర్థంచేసుకోవడం విశ్లేషించే పద్ధతి ఉంటుంది. విమర్శనాత్మక విశ్లేషణ, వ్యాఖ్యానం, చారిత్రక పరిశోధన, ఆలంకారిక పద్ధతులతో గుణాత్మక అధ్యయనం చేస్తుంది. ఉదాహరణకు, ఒక సాహిత్య రచనలోని ఇతివృత్తాలను విశ్లేషించడం గానీ, ఛందస్సు, అలంకారం, శిల్ప వైవిధ్యం ..ఇలా కొనసాగుతుంది. ఫలితాలు తరచూ వివాదాస్పదంగా లేదా బహువిధంగా వ్యాఖ్యానించబడతాయి.

**19. పరిశోధనలో శాస్త్రీయమైన పద్ధతి అంటారు కదా అది అన్ని పరిశోధనల్లోనూ ఒకేలా ఉంటుందా?**

శాస్త్రీయ పద్ధతి అనేది పరిశోధనలో వ్యవస్థీకృత తార్కిక విధానం. ఇది సమస్యను గుర్తించడం, ఊహాపరికల్పన రూపొందించడం, ప్రయోగాలు లేదా పరిశీలనల ద్వారా సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, సిద్ధాంతాన్ని సమన్వయం చేయడం, నూతన సిద్ధాంతాలను రూపొందించడం వంటి దశలను కలిగి ఉంటుంది. అయితే, ఈ పద్ధతి అన్ని పరిశోధనల్లో ఒకేలా ఉండదు. పరిశోధన రంగాన్ని బట్టి దాని అధ్యయన లక్ష్యాల ఆధారంగా అన్వయం మారుతుంది.

**20. సాహిత్య పరిశోధనలో సాహిత్య పరిశోధనలు పద్ధతి అంటే ఏమిటి?**

శాస్త్రీయ పద్ధతి యొక్క ప్రాథమిక సూత్రాలు (సమస్య గుర్తించడం, డేటా సేకరణ, విశ్లేషణ, తీర్మానం) అన్నిరంగాల్లో ఉన్నప్పటికీ, దాని అన్వయించే శాస్త్రాన్ని బట్టి మారుతుంది. సాహిత్య ప్రక్రియలను విమర్శనాత్మకంగా, సైద్ధాంతికంగా, సందర్భాన్ని ఆధారం చేసుకుని విశ్లేషించడానికి ఉపయోగించే గుణాత్మక, వివరణాత్మక విధానాలను పాటించడమే శాస్త్రీయ పద్ధతి.

రచనలోని భాష, చిహ్నాలు, అలంకారాలు, నిర్మాణాన్ని లోతుగా పరిశీలించడానికి ఆలంకారిక/గ్రంథ పరిష్కరణ పరిశోధన పద్ధతిని పాటించడం శాస్త్రీయ పద్ధతి అవుతుంది. సాహిత్య సిద్ధాంతాలను పరిశోధన చేసేటప్పుడు ఆ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని విశ్లేషించాలి. ఉదాహరణకు, ధ్వని, ఔచిత్యం, Marxism, Formalism, Structuralism, Postcolonialism, Psychoanalysis ఆధారంగా విశ్లేషణ.

రెండు లేదా అంతకంటే ఎక్కువ రచనలను లేదా రచయితలను పోల్చేటప్పుడు తులనాత్మక అధ్యయన పద్ధతిని పాటించాలి. రచన చారిత్రక సందర్భం లేదా సాంస్కృతిక ప్రభావాన్ని అన్వేషించడానికి చారిత్రక అధ్యయన పద్ధతిని ఉపయోగించాలి. రచయిత జీవితం, రచన మధ్య సంబంధాన్ని పరిశీలించడానికి కవి జీవిత కావ్య సమన్వయ పరిశోధన పద్ధతి ఇలా మనం పరిశోధన చేసే అంశాన్ని బట్టి ఆ పద్ధతిని ఎంపిక చేసుకోవడమే శాస్త్రీయమైన విధానం.

ప్యూర్ సైన్స్‌లో పరిమాణాత్మకంగా, ప్రయోగాత్మకంగా కనిపిస్తుంది. అయితే సాహిత్య పరిశోధన పద్ధతి గుణాత్మక, విషయాత్మక, వివరణాత్మకంగా ఉంటుంది. సాహిత్య పరిశోధనలో పరికల్పనలు స్పష్టంగా రూపొందించబడవు అన్వేషణాత్మక ప్రశ్నలు రేకెత్తుతుంటాయి. జీవిత అనుభవాలు, అనుభూతులలో తేడాలు ఉన్నట్లే ఫలితాలు కూడా సార్వత్రిక సత్యాల కంటే బహువిధ వ్యాఖ్యానాలపై ఆధారపడతాయి.

**ఓపిగ్గా అనేక ప్రశ్నలకు మీ అభిప్రాయాలను, విశ్లేషణాత్మక సమాధానాలను అందించినందుకు కృతజ్ఞతలు సర్.**

నా అభిప్రాయాలను ఈ పత్రిక ద్వారా విద్యార్థులతో పంచుకోవడానికి అవకాశం కలిగించినందుకు పత్రిక యాజమాన్యానికి, మీకు నా హృదయ పూర్వకమైన ధన్యవాదాలు.

★ ఇంటర్వ్యూవర్: అసిస్టెంట్ ప్రొఫెసర్, పిజి కళాశాల, ఓయు T

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

సాహిత్య
పరిశోధన

# తెలంగాణ ప్రాచీన ఇనుము, ఉక్కు పరిశ్రమ సంబంధిత గ్రామనామాలు-ఒక పరిశీలన

- డా. బూర్ల చంద్రశేఖర్

**వ్యాస సంక్షిప్తి:**

దేశీభాష పదాలు మనకు ఇప్పటికీ ఊళ్ళ పేర్లలో ఎక్కువగా కనబడుతాయి. ఆయా పేర్లలో ఇక్కడి వృత్తులు, ఆర్థిక నేపథ్యం, వనరుల సమృద్ధి మనకు కనబడుతుంది. ఆయా గ్రామనామాలను అధ్యయనం చేస్తే చాలా విషయాలు మనం తెలుసుకుంటాం. ఉదాహరణకు ఈ వ్యాసంలో నేను తెలంగాణాలోని ఇనుము, ఉక్కు సంబంధిత వృత్తిపని, పరిశ్రమలకు సంబంధించిన పదాలను ఎన్నుకొని గ్రామనామాలను తులనాత్మకంగా విశ్లేషిస్తూ భాషాకోణంలో వివరించాను. ముఖ్యంగా గ్రామనామాలలో వ్యాకరణ సంబంధిత మార్పులను బాలవ్యాకరణ సూత్రాలతో అన్వయిస్తూ, ధ్వని, అర్థపరిణామాలతో పాటుగా కమ్మరి పని సంస్కృతి గ్రామనామాలను ఎలా ప్రభావితం చేసిందో తెలిపాను. అలాగే ఆయా గ్రామనామాలు ఏర్పడిన తీరు చెబుతూనే దానికి ప్రామాణికంగా ఆయా గ్రామాల్లో ఇప్పటికీ కనిపించే ఆనవాళ్ళకు సంబంధించిన విషయవిశ్లేషణ చేసాను.

**కీలక పదాలు :**

దేశీభాష మూలాలు, గ్రామనామాలు, వృత్తిపరికారాల పదాలు, భాషాకోణం, చిట్టెం, వెలుగు, కల్లు, రాయి, కొలిమి, బద్ది, లోహం, ఇనుము, ఉక్కు, కమ్మరి, కోణం, పావు, వృర్థం, వట్టెం

**0. పరిచయం:**

భాష అంటే భావాన్ని వ్యక్తీకరించేది. (Language is to express an Idea) నేడు మనం ఉపయోగిస్తున్న భాష తెలుగే, నన్నయ కంటే ముందు, నన్నయ కాలంలో ఉపయోగించిన భాష కూడా తెలుగే కాని ఆ భాషకీ ఇప్పుడు మనం ఉపయోగిస్తున్న భాషకి చాలా తేడా కనిపిస్తుంది. ఏ భాషలోనైనా దేశకాలాదుల్ని బట్టి ధ్వని, అర్థపరిణామాలు చోటు చేసుకుంటాయి. ఇలా ఒక భాష ఎంత మార్పుకి లోనైనా దాని మూల నియమాల్లో మాత్రం మార్పురాదు. ఉదాహరణకు నన్నయ కాలపు తెలుగులో ఎక్కువగా సంస్కృత పదాలున్నాయి. నేటి తెలుగులో ఆంగ్లపదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్ని భాషల ప్రభావాలు పడ్డా కూడా తెలుగు భాష తన ప్రాంతీయతను, దేశీయతను కోల్పోలేదనే చెప్పాలి.

ఇక్కడ దేశీ భాష అంటే సహజమైన, స్వచ్ఛమైన మూల తెలుగు భాష అనే అర్థంలో వాడుతున్నాను. సులభంగా చెప్పాలంటే ఆయా ప్రాంతానికి ఏ భాష అయితే ఉంటుందో ఆ భాష దేశీ భాష లేదా ప్రాంతీయ భాష అనవచ్చు. సంస్కృతం లేదా అన్య భాషల పదాల సంపర్కం చెందక ముందుండేదే మూల దేశీ భాష. ఏ భాషలోనైనా దేశీపదాలు నేటికి మనం కొన్ని అంశాలలో చూడవచ్చు. కాని వాటికి అర్థాలు మాత్రం దొరకడం కొద్దిగా కష్టమౌతుంది.. ఎందుకంటే ఆయా పదాలను అందించే సాంస్కృతిక ప్రసరణలో ఆటంకాలు ఏర్పడ్డాయి. నిఘంటువుల్లోకి కూడా చాలా పదాలు ఎక్కలేదు. వాటి అర్థాలు తెలుసుకోవాలంటే వివిధ రకాల, రంగాల చారిత్రక నేపథ్యాలను మనం పరిశోధించాల్సి ఉంటుంది. ఉదాహరణకి ఈ క్రింది విషయాల్లో మూలదేశీ భాష మనకు దొరికి అవకాశం ఉంది.

1. ఊళ్ళ పేర్లలలో (గ్రామనామాలు) 2. ఇంటి పేర్లలో 3. శాసనాలలో 4. కైఫీయత్ లలో(పాత రికార్డ్స్) 5. జాతీయాలలో 6. సామెతలలో 7. వృత్తి కులాల పనుల పరికరాల పేర్లలో ఇన్ని రకాల విషయాలలో మనం తెలుగు దేశీ పదాలను కనుగొనగలుగుతాం. పైన చెప్పిన అన్నిటిలో ముఖ్యంగా వృత్తిపనులకు సంబందించిన నామాల్లో, ఊళ్ళపేర్లలో దేశీపదాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఎందుకంటే గ్రామీణ వ్యవస్థలో వివిధ రకాల వృత్తులకు సంబంధించిన వారు సామూహిక జీవనం కొనసాగిస్తారు. వారు ఒకరికొకరు సహాయకంగా జీవించాల్సిని అవసరం వారికి అనివార్యం. కాబట్టి వాడు చేసే పనులను బట్టి ఊరి పేర్లు, ఇంటి పేర్లు ఏర్పడతాయి. అలాగే ఆయా గ్రామాల్లో ఏ వృత్తి అయితే అధికంగా ఉంటుందో వృత్తి సామాగ్రికి సంబంధించిన పేర్లు గ్రామాల పేర్లుగా మారిపోతాయి. పనులకు ఊరి పేర్లకు దగ్గరి సంబంధం ఉంటుంది కనుక ఊరి పేరు మార్చడం అనేది సామూహిక

నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుంది. అందుకే గ్రామ నామాలు అంత సులభంగా మార్పులకు గురికావు. ఆ ఊరి పేర్లను బట్టే అక్కడి ప్రజల సాంస్కృతిక జీవిన వికాసాన్ని, ఆ ప్రాంతపు చరిత్రను అధ్యయనం చేయవచ్చు. ఇక్కడ నేను తెలంగాణలో (నాటి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్) ఉన్న కొన్ని ప్రాచీన ఇనుము, ఉక్కు పరిశ్రమకు సంబంధిత గ్రామ నామాలను పరిశీలిస్తాను. ముఖ్యంగా ఈ పరిశ్రమకు మూలాధారమైన కమ్మరి వృత్తికి సంబంధించిన పేర్లను భాషాంశాల కోణంలో విశ్లేషిస్తాను.

ఊళ్ళ పేర్లలో ఆయా ప్రాంతంలోని వృత్తులు, భౌగోళికవనరులు, ఆధ్యాత్మిక విషయాలు, సామాజిక సంస్కృతి మొదలగునవి ప్రతిబింబిస్తాయి. ప్రాచీన కాలంలో తెలంగాణ ప్రాంతంలో లోహపరిశ్రమ ఎక్కువగా అభివృద్ధి చెందింది. ఆ పరిశ్రమకు సంబంధించిన ఆనవాళ్ళు ఇప్పటికి కుప్పలు కుప్పలుగా ఈ ప్రాంతంలో దొరుకుతున్నాయి. ఆ పరిశ్రమకు సంబంధించిన గ్రామ నామాలు ఈ ప్రాంతంలో మనం విరివిగా చూడవచ్చు. ఈ అంశంపై డా.ఎస్. జైకిషన్ గారు 2010 లో విస్తృతంగా పర్యటించి పరిశోధించి పుస్తకం వెలువరించారు. (జైకిషన్, ఎస్. 2010, పుట.27)

■ ఊరు అనే పదానికి ఆల (ప్రాంతం) పల్లి, ఊర్, పూర్, ఆరం, పేట్, గూడెం, పట్నం, తుర్తి మొ. పేర్లు పర్యాయ పదాలుగా కనబడుతున్నాయి. ఈ పదాలు దాదాపుగా అన్ని ప్రాచీన ఊళ్ళ పేర్లలో కనబడుతున్నాయి. ఇటువంటి ప్రాచీనమైన పదాలను, పదబంధాలను శాస్త్రీయంగా విశ్లేషించాలంటే మనకు ఇప్పుడున్న వ్యాకరణాలు, భాషాశాస్త్ర సూత్రాలేకాక కొత్తవి నిర్మించుకోవాల్సి కూడా ఉంటుంది.

## 1. చిట్టెం అనే పదానికి సంబంధించిన పేర్లు

చిట్టెం అనే పదానికి వృథా. వ్యర్థం అనే అర్థాలున్నాయి. "చిట్టెము– slag or residue of smelted iron (జైకిషన్, ఎస్. 2010, పుట.106) "కొలిమిలో ఇనుము కాలగా మిగిలిన పనికి రాని బొగ్గు, ఇనుము మిశ్రమం" (నాగయ్య, జి. 1991, పుట.80) ఈ పదంతో వ్యవహరించబడే గ్రామాలు చాలానే ఉన్నాయి. చిట్యాల అనే పదం పేరున్న గ్రామాలు విరివిగా ఉన్నాయి. ఇనుము, ఉక్కు తయారు చేసేటప్పుడు ఎంతో వృథా అయిన పదార్థం బయటకు వస్తుంది. ఆ పదార్థాన్ని చిట్టెం అంటాం. అలాంటి చిట్టాన్ని దూరంగా ఒకచోట పారబోసేవారు. రానురాను చిట్టెపు కుప్పల మీదనే ఇండ్లు, గ్రామాలు నిర్మించబడినాయి. ఇప్పటికీ ఇలా నిర్మితమైన గ్రామాల్లో తవ్వినప్పుడు చిట్టెపు కుప్పలు బయటపడుతున్నాయి.

చిట్యాల అనే గ్రామ నామ పదాన్ని విడదీస్తే చిట్టెము ం ఆల అవుతుంది. "కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు" (బాల. సంధి. 32) అనే సూత్రం ప్రకారం పుంపులు ఆదేశంగా వచ్చి చిట్టెపు ఆల అనే రూపం ఏర్పడుతుంది. ఈ రెండు పదాల మధ్య సంధి జరిగి చిట్టెప్యాల అవుతుంది. రానురాను ప్రజల నోళ్ళలో అరిగిపోయి, ధ్వని పరిణామం చెంది ఇప్పుడు చిట్యాలగా మిగిలింది. అలాగే చిట్టము ఊరు పై రూప సాధన లాగానే పుంపులు ఆదేశంగా వచ్చి చిట్టెపు ఊరు > చిట్టెపూరు > చిట్టాపూర్ అయింది. అలాగే చిట్యాల పల్లిలో ఊరు అనే అర్థం వచ్చే పదం పల్లి అనేది వచ్చి చిట్యాల పల్లి అయింది. ఇక్కడ ఊరు అనే అర్థం వచ్చే ఆల, పల్లి రెండూ పదాలు చేరడం విశేషం.

## 2. వెలుగు అనే పదానికి సంబంధించిన పేర్లు.

ఇనుము, ఉక్కును కరిగించాలంటే కొన్ని వందల సెంటిగ్రేట్ల వద్ద ముడిపదార్థాన్ని మరిగించాలి. ఎడతెరపిలేకుండా కొలిమిని రగిలించాల్సుంటుంది. అలాంటప్పుడు పరిసరప్రాంతాలలో రాత్రింబవళ్ళు వేడి, వెలుతురు వ్యాపిస్తుంది. వాటికి దగ్గర్లో ఏర్పడిన గ్రామాలకు వేడి, వెలుతురు, అగ్నికి సంబంధించిన పేర్లు కనబడతాయి.

ఉదా: వెలుగుమట్ల అనే గ్రామనామం విశ్లేషిస్తే అది వెలుగు ఉండే మడులు కలిగిన ప్రాంతం. మడులు మట్లగా నాదత్వం గలిగిన మూర్ధన్యాక్షరం, శ్వాసత్వం గలిగిన మూర్ధన్యాక్షరంగా మారిపోయింది. సామాన్యంగా పరుషాక్షరాలు సరళాలుగా మారిపోతాయి కాని ఇక్కడ వ్యతిరేకమైన మార్పును మనం చూడవచ్చు. అలాగే వెలుగుంఊరు ''కర్మధారయంబులందుత్తునకచ్చు పరంబగునపుడు టుగాగమంబగు" (బాల.సంధి.28) అనే సూత్రంచే టుగాగమం వచ్చి వెలుగుటూరు మారుతుంది. వెలుగు ఆనే పదం "అచ్చికంబులం బదమధ్యంబుల నలదరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు" (బాల. ప్రకీర్ణక 17) అనే సూత్రంతో సంశ్లేషం చెంది వెల్గ గా మారి వెల్గటూరుగా ప్రస్తుతం పిలువబడుతుంది. వెలుగు ఊరు ఇంకోరకంగా అంటే వైకల్పికంగా "షష్టీసమాసమునం దుకాబుకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు" (బాల.సంధి.34) అనే సూత్రంచే నుగాగమం, సంశ్లేషం చెంది వెల్గనూర్ గా మారినట్లు

మనకి తెలుస్తుంది. వెలుగు ఊరుల వెల్లుల్లగా మారింది. ఊరులు పదం ''బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన డ, ల, ర, ల కలఘు లకారంబు బహుళంబుగా నగు." (బాల. ఆచ్ఛిక. 13) అనే సూత్రంతో ఊళ్ళుగా మారింది. వెలుగు ఊళ్ళు గుకారం లోపించి వెల్లుల్లగా స్థిరపడింది.

నిరంతరం అరకుండా ఉండే కుండ (కొలిమి) ఆర్న కొండగా మారింది. దీన్నే ఇంకోరకంగా విశ్లేషిస్తే అరుణ కొండగా కూడా చెప్పవచ్చు. ఈ ప్రాంతపు చుట్టుపక్కల ఎక్కడా కూడా కొండలాంటి ప్రదేశం ఇప్పుడు లేదు. కనుక కుండ అనేది కొండగా ఊరి పేరులో మారిందని చెప్పాలి.

శక అంటే వేడి అని అర్థం. సెగ శకగా మారి ఉండవచ్చు. శక బాగా ఉండే గుట్ట/కల్లు(రాయి) కలిగిన ప్రాంతం శకల్లగా ఏర్పడింది.

అగ్గిచేత ఉండే మడులు అగ్గిమల్లగా మారింది. మడులు అనే పదం ''బహువచనం పరంబగునపుడు డలటరలయుత్వంబునకు లోపంబు బహుళంగానగు" (బాల. ఆచ్ఛిక. 12) అనే సూత్రంచే మడ్లు అవుతుంది. "బహువచన శ్లిష్టంబులయి అద్విరుక్తంబులయినడకారలకారంబు లకలఘులకారంబు నిత్యంబుగనగు (బాల. ఆచ్ఛిక. 14) అనే సూత్రం మళ్ళు అవుతుంది.

వెలుగు ఎక్కువగా ఉండే కొండ వెలుగు కొండ. విభిన్న ములైన కంఠ్యాలు పక్కపక్కనే ఉండటం వలన ఒక వర్ణానికి లోపం జరిగి, సంశ్లేషం చెంది వెల్గొండగా మారింది. వెలుగు పేట ''అన్యంబులకు నపిాతమిక్కార్యంబులు కొండొకచోగానంబడియెడి" (బాల, సంధి. 39) అనే సూత్రంచే ప్రాతాది సంధి జరిగి వేంపేటగా మారింది. కొరవి అంటే అగ్గి కొరివిపల్లి, కొరండ్లపల్లెగా పదాలలో మార్పులు జరిగే అవకాశం ఉంది. ఇలా వెలుగు మీద వచ్చినవే ఇంకొన్ని పేర్లు కొరవట్లు (ఇత్వ సంధి) వెలిచాలా, వెల్లాపూరం, ఎలగందులా, ఎల్కతుర్తి (పదాది వకార లోపం ఈ ధ్వనిపరిణామం ఎక్కువగా కరీంనగర్ ప్రాంతంలో జరుగుతుంది) మొదలినవి.

### 3. కల్లు, రాయి పదానికి సంబంధించిన పేర్లు

ఇనుము, ఉక్కు పరిశ్రమకు ముఖ్యంగా కావలసింది ముడిసరుకు, ముడి ఖనిజం ఇది భౌగోళికంగా ఎక్కడ ఎక్కువగా దొరుకుతుంటే ఆ ప్రదేశంలోనే ఈ పరిశ్రమ ఏర్పడుతుంది. ఎక్కువగా కొండలు, గుట్టల పక్కన కొలువులు నిర్మించబడతాయి. ఈ వృత్తిలో ఇంటిల్లిపాది పనిచేయాల్సి ఉంటుంది. కొలిమి దగ్గరనే కుటుంబం మొత్తం జీవనం కొనసాగుతుంది. రానురాను అక్కడే ఒక కుగ్రామం ఏర్పడుతుంది. అది తరువాత గ్రామంగా మారిపోతుంది. అక్కడ ఉన్న కొండనో, గుట్టనో, రాయినో గుర్తుగా పెట్టుకొని గ్రామనామంగా అక్కడి ప్రజలు వ్యవహరిస్తారు. ఆలా వచ్చిన పేర్లే రాయిగుంటా. రాయికల్ (కల్, కల్లు అంటే రాయి, బండ అని అర్థం) కల్లు అనే పదం మీద వచ్చిన పేర్లు కల్లెడ, కల్లెడ అంటే మెత్తని రాయి అని అర్థం. (జైకిషన్, ఎస్. 2010, పుట. 106). కల్లెడ పూర్వరూపం ఎడగల్ ఇది వర్ణవ్యత్యయంగా పదవ్యత్యయం జరిగి కల్లు ఎడ అవుతుంది. తరువాత "ఉత్తునకచ్చు పరంబగునప్పుడు సంధియగు" (బాల సంధి. 1) అనే సూత్రంచే సంధి జరిగి కల్లెడగా మారింది. ఇలాంటి వర్ణ, పదవ్యత్యయం జరగడం ద్రావిడ భాషలలో సహజం.

చలిగల్ అనే గ్రామనామం "ఇటితి వర్ణంబులు వక్ష్యమానంబు లౌపవిభక్తికంబులు" (బాల ఆచ్ఛిక. 28) అనే సూత్రంచే చలిగంటి అయింది.

ఇరుకు కల్ భిన్నములైన కంఠ్యాలు పక్కపక్కనే ఉండటం వలన ఒక వర్ణానికి లోపం జరిగి ఇరుకుల్ల అనే రూపం ఏర్పడింది. ఇరు అంటే రెండు ఆని అర్థం.

కల్లూరు (ఉత్వసంధి) గుడికల్, పట్కల్, పోతుగల్ మొ. పైన చెప్పిన పేర్లలో కల్లెడ అనే పేరు చాలా గ్రామాలకు ఉంది. ఎదురుగట్ల, సిరికొండ (ఈ ఊరులో ఇనుప ఖనిజం కలిగిన పెద్దగుట్ట ఉంది) నల్గొండ, నల్లగొండ, నగునూరు మెట్టపల్లి, కొండపూర్ మొ. ఇలా ముడిసరుకు దొరికే కొండల, గుట్టల ప్రదేశాన్నిబట్టి కూడా ఊర్ల పేర్లు ఉన్నాయి.

### 4. వృథా అనే అర్థానికి సంబంధించిన పేర్లు.

వట్టెంపేట్ పదంలో ఉండే వట్టెం అంటే ఎండు, వ్యర్థం. పొల్లు అనే అర్థాలున్నాయి. చిట్టెంనే వట్టెం అని కూడా పిలుస్తారు. వ్యర్థ పదార్థం మళ్ళీ దేనికి పనికిరాదు కనుక అది చాలా ఉన్న ప్రదేశాన్ని వట్టెంపేట అని అంటారు. అలాగే పెంచుకలపేట, బొల్లారం. చొప్పదండి మొ. పేర్లు ఈ అర్థంలోనే వచ్చాయి. చొప్ప అంటే వ్యర్థం, దండి అంటే ఎక్కువ అని అర్థం. వ్యర్థం ఎక్కువగా ఉన్న ప్రదేశం అని దీనిని బట్టి తెలుస్తుంది.

### 5. ఇనుము, ఉక్కు పదాల సంబంధిత పేర్లు.

ఇనుప ఖనిజాన్ని కరిగించినప్పుడు ఇనుము, ఉక్కు ముద్దలుగా బయటకు వస్తుంది. ముద్దపల్లిలోని ముద్ద అంటే

ఉక్కు లేదా ఇనుపముద్ద అని అర్థం తీసుకోవాలి. అటువంటి ముద్దలు ఎక్కువగా ఉత్పత్తి ఐన గ్రామం కనుక ముద్దపల్లి అని పేరు వచ్చింది.

ఉప్పుమడుగు > ఉక్కుమడుగు ఇలా ధ్వనిపరిణామం జరిగి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఇనుము, ఉక్కుతయారి అవశేషాలు విరివిగా దొరుకుతున్నాయి. ఇనుము ఊరు ఇందూరుగా, ఇనుముపల్లి ము వర్ణానికి అనుస్వారం వచ్చి ఇనుంపల్లిగా మారింది. ఇనుము తుర్తి > ఇనుగుర్తి, ఇనుము తుర్తి > ఇందుర్తిగా మొ. విధంగా ముడిసరుకు మీదనే పేర్లు ఏర్పడినవి.

## 6.మట్టి పావులకు సంధించిన పేర్లు

కోణాపూర్, కోణరావుపేట, చిప్పర్తి వీటిలో కనిపించే కోణం, చిప్ప మొ. పదాలు ఇనుము ఉక్కు తయారీలో ఉపయోగించే కోణంపావులు. చిప్పపావులు, మట్టి పావుల పేర్లను బట్టి వచ్చాయి. మట్టితో చిప్పలాగా, పావులాగా తయారుచేసిన ఆకారాల్లో ముడి ఖనిజాన్ని నింపి మరిగించే వారు కాబట్టి అవి ఎక్కువగా కనిపించే ప్రాంతానికి ఆయా పేర్లు వచ్చాయి. కోణం ప్రదేశపు మూల రెండు రేఖలు కలిగినది. వక్రత కలిగినది అని అర్థాలు నిఘంటువులో కనిపిస్తున్నవి. కోనసముద్రం అనే గ్రామం నుండే డెమస్కస్ వరకు ఉక్కు ముద్దలు వెళ్ళాయని చారిత్రకంగా తెలుస్తుంది. (జైకిషన్, ఎస్. 2010, పుట.29, 57) ఉక్కు సముద్రంగా నాడు ఉన్నటువంటి కోనసముద్రం నేడు కోణసముందర్ గా పేరు మార్పు చెందింది.

## 7. కుమ్మరి పనీ చేసేవారికి సంబంధించిన పేర్లు.

కమ్మి అంటే లోహపు తీగ, ఆ లోహపు తీగను తీసేవారు కనుకనే కమ్మరి వారు అని పేరు వచ్చింది. “ అరి వర్ణకంబు మతుబర్థంబునంజాలాదులకగు” (బాల. తద్ధిత.17) అనే సూత్రంచే కమ్మి అనే పదంపై అరి ఆనే తద్ధిత ప్రత్యయం చేరి కమ్మరి అనే పదం ఏర్పడింది. ఈ పరిశ్రమకి మూలాధారం కమ్మరివారు. కనుక ఈ పేరుతో చాలా గ్రామాలున్నాయి.

కమ్మునూర్, (నుగాగమం) కమ్మరిపేట, కమ్మరిపల్లి, కమ్మరిగుంట, కమ్ముళ్ళు (కమ్మ ఊళ్ళు) మొ అలాగే కమ్మర్కాన్ పేట అనేది “కాకత్తియవర్ణకంబులు వుంస్త్రస్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదులకగు (బాల, తద్ధిత.11 అనే సూత్రంచే కమ్మరికాదుంపేట > కమ్మరి కానింపేట > కమ్మర్ కాని పేటగ కమ్మర్కాని పేట > కమ్మర్కాన్ పేట అవుతుంది.

## 8. కొలిమికి సంబంధించిన పేర్లు.

కాఁచు = వేడిమి చేయు అని అర్థం. (మహదేవశాస్త్రి, కోరాడ. 2003, పుట.79) క్రాఁగు, కాఁక మొ. పదాలు పై అర్థాన్నే ఇస్తాయి. ఖనిజం కరగాలంటే కొలిమిలో కాల్చాలి. ఇలా కొలిమి, కాల్చడం అనే పదాలతో ఊళ్ళ పేర్లు చాలా ఉన్నాయి. కొలిమి అంటే కమ్మరి లోహాదులను కాల్చే నిప్పుగుంట అని నిఘంటువు అర్థం.

ఉదా: కొలిమికుంట, కొలిమిపల్లి, కొలిమిపేట, కొడిమ్యాల, మొ. కొడిమి ఆల ఇవి రెండు తెలుగు పదాలే అయినా “ఇకోయణచి” అనే సూత్రంచే యణాదేశం అనే సంస్కృత సంధి నియమం వర్తించి కొడిమ్యాల అనే గ్రామనామం ఏర్పడింది. ఇది దుష్టసంధే అయినా బాలవ్యాకరణంలో కొన్ని చోట్ల ఇటువంటి సంధి రూపాలు కన్పిస్తున్నాయి. ఉదా. ఏమి ఆది ఏమ్యాది, పదు ఆది పద్వాది. మొ.

కొలిమ్యాల కొడిమ్యాల మారింది. ఇక్కద లడల మధ్య వినిమయ జరిగింది. ఇలా ఇప్పటికీ మారిన రూపం, మారని రూపం రెండూ నేడు వాడుకలో ఉన్నవి. రలడలకు ప్రాచీన రూపాలలో ఆభేదం జరుగుతుందని, రేప లకారంగా, ళకారంగా, డకారంగా కూడా మారుతుందని మనకు శాసనాల ద్వారా తెలుస్తుంది.

శాసనాలలో చోఱ > చోర చోళ చోడ చారిత్రకంగా ఇలా మార్పు జరిగింది. అలాగే పైన చెప్పిన విధంగా కొలిమి, కొడిమిగా మారింది.

ఇక కాఁచుకు సంబంధించిన పదాలు కాచుపల్లి, కాచారం, కాసారం, కాచాపురం, కానంపల్లి, కాట్నపల్లి మొ, ఇందులో కాఁచు ఆరం “ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు” (బాల.సంధి.1) అనే సూత్రంచే సంధి జరిగి కాచారం ఏర్పడింది. కాచారంలోని చకారం సకారంగా మారి కాసారం అయింది. (కచటతపలు గసడదవలుగా మారినట్టు) కాఁచుపల్లె కానంపల్లెగా మారింది.

అలాగే బట్టపల్లి, పెంబట్ల అనే గ్రామనామాల్లో ఉన్న బట్ట అనే పదం మనకు కనిపిస్తున్నా అది బట్టి అని పదం. ఇది కూడా కమ్మరి కొలిమికి సంబంధించిన పదమే. బట్టిపల్లి బట్టపల్లిగా, పెద్దబట్టి పెనుబట్టిగా పెంబట్లగా ప్రాతాది, ద్రుతసంధి కార్యాలు జరిగి మార్పు చెందిన రూపాలు. కొల్వాయి, కొలనూరు అనే పదాలు కూడా కొలిమికి సంబంధించినవే. కొల్వాయి లోని వాయి అనే పదానికి పాత్రల అడుగుభాగం

కొట్టడానికి వాడే పరికరం అనే అర్థం పదకోశంలో ఉంది. వాయిధార అంటే అచ్చులో, కరిగిన లోహాన్ని పోసేందుకు మట్టి అచ్చులపై పెట్టిన రంధ్రం అనే అర్థముంది. (నాగయ్య, జి. 1991, పుట.219) ఇనుము, ఉక్కును తగిన సైజులో, లేదా అనుకున్న మూసలో రావాలంటే దాకలి పైన కొడతారు. బహుశః దాయి అంటే దాకలి లేదా దాగలి అయి ఉంటుంది. కొలిమింవాయి కొల్వాయిగా మ వర్ణలోపం జరిగి, సంశ్లేషం చెందింది.

బద్దెనపల్లి బద్దెపల్లి అనే గ్రామనామాలలో ఉన్న బద్ది అనే పదం ఒక గుంటలాంటిది అనే అర్థాన్ని తెలియజేస్తుంది. గోళీలాలలో చిన్న లొంద, గుంటలాంటి దానిని బద్ది అని అంటారు. కాబట్టి కొలిమి ఉన్న ప్రాంతంలో ఒక గుంటలాంటి ప్రదేశం ఏర్పడుతుంది కాబట్టి ఆ ప్రదేశానికి ఆ పేరు వచ్చే అవకాశం ఉంది. బద్దిపల్లి > బద్దెనపల్లిగా మారింది.

ఇలాగే ఇంకా కొన్ని గ్రామాలు దొనూరు. దొంతాపూర్, ఆరెపల్లి, గుల్లకోట మొ. పేర్లు ఈ పరిశ్రమకి సంబంధించినవే ఉన్నాయి.

ఈ విధంగా ఊళ్ళ పేర్లలో ఉక్కు తయారీకి సంబంధించిన నామాలు కనబడుతాయి. ఇంకా పరిశోధనలు చేస్తే ఇంకా ఎక్కువగా సమాచారం మనకు తెలిసే అవకాశముంది. కొన్ని సార్లు చరిత్రను పునర్నిర్మించడానికి సాహిత్య పరంగా, భాషాపరంగా చేసే విశ్లేషణలు చాలా ఉపయోగపడతాయి. ఆ విధంగానే ఇక్కడి పరిశ్రమకి సంబంధించిన చరిత్రను తెలుసుకోడానికి సాహిత్య, భాషాపరంగా మనం పరిశోధించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. తద్వారా ఆయా గ్రామాలయొక్క సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక విషయాలను విస్తృతంగా బయటకు తీయవచ్చు.

**పాదసూచికలు:**

1. జైకిషన్, ఎస్. తెలంగాణాలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రాచీన చారిత్రిక ఆనవాల్లు. 2010. డాక్రి, హైదరాబాద్. పుటలు. 27, 57. 106.

2. నాగయ్య, జి. మాండలికవృత్తిపదకోశం. లోహకార వృత్తి. 1991. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్. పుటలు. 80. 219

3. మహదేవశాస్త్రి, కోరాడ. తెలుగు దేశ్యవ్యుత్పత్తి నిఘంటువు. 2003. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. పుట79

**ఆధార గ్రంథాలు:**


1. జైకిషన్, ఎస్. తెలంగాణాలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రాచీన చారిత్రిక ఆనవాల్లు. 2010. డాక్రి, హైదరాబాద్.

2. నరసింహారెడ్డి, పి. చిన్నయసూరి బాలవ్యాకరణం శ్రీ ప్రభావ్యాఖ్య. 2011. తెలుగు అకాడమి, హైదరాబాద్.

3. నాగయ్య, జి. మాండలికవృత్తిపదకోశం. లోహకార వృత్తి. 1991. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

4. మహదేవశాస్త్రి, కోరాడ. తెలుగు దేశ్యవ్యుత్పత్తి నిఘంటువు. 2003. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.



★ *సహాయాచార్యులు, తెలుగు, శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వ), కరీంనగర్*



**రచయితలకు సూచనలు:**

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

సాహిత్య పరిశోధన

# పాలనలో అవినీతిని ప్రశ్నించిన పద్యకవి

**పి. రాజీవ్ కుమార్**

**పరిచయం:**

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ తన తపాలా బంట్రోతు కవితలో "ఉత్త పోస్టుమాన్ మీద ఊహలు రానేరావు"అని చమత్కరించాడు. శ్రీశ్రీ గారు ఏకంగా అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ వంటివి కూడా కవిత్వానికి అర్హమైనవి అని తేల్చి చెప్పాడు. కానీ ప్రజల జీవితాలను శాసిస్తున్న రాజ్య పాలనా వ్యవస్థలో అవినీతి మీద అగ్గిపుల్ల మీద వచ్చినంత సాహిత్యం అయినా వచ్చిందా? అనే అనుమానం కలగక మానదు. ఉత్త అవినీతి మీద ఊహలు రాలేదేమో. మెజారిటీ కవులు అయినా కొందరు కవులు మాత్రం పాలనలో అవినీతిని ఎండగట్టిన వారు ఉన్నారు. అలాంటి వారి సాహిత్యాన్ని సేకరించి అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అవినీతిని వ్యతిరేకత గురించి ఆలోచించడం అంటే మంచి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను కోరుకోవడం అని అర్థం. సుపరిపాలన (Good Governance) దిశగా, అధికార దుర్వినియోగం లేని పరిపాలనను అన్ని ప్రజాస్వామ్య దేశాల పౌరులు కోరుకుంటున్నారు. సుపరిపాలనకు అవినీతి గొడ్డలిపెట్టుగా మారింది. అవినీతికి వ్యతిరేకంగా కవిత్వం రాయడం వలన అవినీతి పోతుందా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం కానీ, ప్రజలలో పౌరసత్వ భావన, రాజకీయ, పాలనాపరమైన చైతన్యాన్ని పెంపొందించుకోవడానికి ఇలాంటి కవిత్వం ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. 500 కవితలు ఉన్న కవితా సంపుటులు తిరగేస్తే దానిలో ఒకటో ఆరో అవినీతి వ్యతిరేక కవిత కవితలు దొరకడం మృగ్యం. అలాంటి సందర్భంలో అవినీతి అనే పేరుతో ఒక లఘు గ్రంథాన్ని రాసిన కవి గురించి, దానిలోని విశేషాల గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

**కీలక పదాలు:** అవినీతి, అధికార దుర్వినియోగం, అవినీతి వ్యతిరేక కవిత్వం, అవినీతి వ్యతిరేక సాహిత్యం, పిడపర్తి ఎజ్రాకవి.

పిడపర్తి ఎజ్రాకవి :

పిడపర్తి ఎజ్రా గారు గుంటూరు జిల్లా, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొల్లిపర గ్రామానికి చెందినవాడు. తల్లిదండ్రులు శ్రీమతి పున్నమ్మ, జక్రయ్య. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి తెనాలిలోని బోసునగర్ లో నివాసం ఏర్పరచుకున్నారు. ఇతనికి మధురకవి అని బిరుదు కూడా ఉన్నది. ఆటవెలదుల్లో ఇతను రాసిన ధూమపారం అనే కావ్యం ప్రసిద్ధి చెందింది. సాంఘిక దురాచారాలను ఎత్తిచూపుతూ ఎన్నో పద్యాలలో రాశాడు. అవినీతి పేరుతో ఏకంగా ఒక పద్యకావ్యాన్నే రాశాడు. వీరి కవిత్వం సరళంగా ఉండడం వలన చదవాలనిపించే విధంగా ఉంటుంది.

క. మిగులుగ కాగితము కదల
తగిన బరువు మోపకున్న తరలకయున్నే?
తగు మోతాదులో బరువును
వగవక మోపిన పనులిక పరువము జెందున్

(ఎజ్రా, పిడపర్తి. అవినీతి . 1994: 07)

ఇది అందరికీ అనుభవంలో ఉన్న విషయమే. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇచ్చినప్పుడు, సాధారణంగా ఆలస్యంగా%-%జరిగే పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఫైళ్లను ముందుగా ప్రాసెస్ చేయడం, ఇతరుల కంటే ప్రాధాన్యత ఇవ్వడం, అవసరమైన అధికారుల సంతకాలు త్వరగా పొందడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. అంతేకాక, కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్ల లోపాలను కూడా లంచం ద్వారా "సెటిల్" చేస్తారు. ఇలా లంచం వల్ల అధికార యంత్రాంగం మామూలుగా పాటించే విధానాలను పక్కనపెట్టి, ఆర్థిక ప్రయోజనం కోసం వ్యక్తిగతంగా స్పందించడం ద్వారా, పని త్వరగా పూర్తయ్యేలా చేస్తారు. అయితే ఇది చట్టవ్యతిరేకమై, అవినీతిని ప్రోత్సహించే చర్య. కవి అదే విషయాన్ని కవితాత్మకంగా తెలియజేస్తున్నాడు.

క. లంచము ముట్టని శాఖల
నించుకయైన కనజాల మెచ్చోటైనన్
ఎంచరు మంచిచెడుగులను
ముంచగ జూచెదరు తుదకు ముష్కరజాతుల్

(ఎజ్రా, పిడపర్తి, అవినీతి . 1994: 08)

ఈ రోజుల్లో లంచం లేని శాఖలే లేవు అనడం అతిశయోక్తి కాదు. ఏ శాఖలోనైనా చిన్న పని చేయించు కోవాలన్నా, మన హక్కుగా పొందాల్సిన సేవలకైనా ఎక్కువ సమయాన్ని తీసుకోకుండా పూర్తిచేయించాలంటే లంచం ఇవ్వక తప్పడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ , రెవెన్యూ, మున్సిపాలిటీ , రిజిస్ట్రేషన్, ఆరోగ్య శాఖలన్నీ ఈ దురాచారంలో భాగమయ్యాయి. కొందరు ఉద్యోగులు లంచం లేకుండా పని చేయడానికి కూడా సిద్ధంగా లేరు. ఇది అల్లకల్లోలమైన పరిస్థితికి దారితీస్తోంది. ప్రజల విశ్వాసం తగ్గుతోంది. అందుకే 'లంచం ముట్టని శాఖలే లేవు' అన్న మాట నిజంగా అనిపిస్తోంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజలు, ప్రభుత్వాలు కలిసి పని చేయాలి.

క. మంచిగ 'టెండరు' పాడిన
వంచకుడెన్నో దగాగ పనులన్ చేయున్
మంచిగ చేయరు పనులను
కొంచెపుటింజి నియరులిక కోట్లు గడింపన్

(ఎఱ్ఱా ,పిడపర్తి, అవినీతి .1994:09)

పై పద్యం ఇంజినీరింగ్ శాఖలో ఉండే అవినీతిని తెలియజేస్తుంది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన చాలా మంది ఇంజినీర్లను చూస్తుంటాం. ఇటీవల అనగా మార్చి – 2025 లో కర్ణాటకలోని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన టి.డి. నంజుండప్పపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు నమోదయ్యాయి. 2025 మార్చిలో లోకాయుక్త అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాలు, సంబంధిత ప్రాంతాల్లో దాడులు నిర్వహించగా, సుమారు ?8.46 కోట్ల విలువైన అసమాన ఆస్తులు బయటపడ్డాయి. మార్కెట్ విలువ ప్రకారం వీటి విలువ ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది. ఆయన వద్ద తొమ్మిది స్థలాలు, మూడు ఇళ్లు, వ్యవసాయ భూములు, నగదు, బంగారం, వెండి, విలాస వాహనాలు లభించాయి. ఈ ఆస్తుల విలువ ఆయన ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఉండటంతో, అవి అక్రమంగా సంపాదించబడ్డవని అనుమానం వ్యక్తమవుతోంది.

చాలా సందర్భాలలో ప్రభుత్వ ఇంజనీర్లు తమ పదవిని దుర్వినియోగం చేసి, లంచాలు తీసుకుంటూ పబ్లిక్ వర్క్‌ను నాసిరకంగా చేస్తుంటారు. వారు సరైన టెండర్లు ఇవ్వకుండా, తెలిసిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగిస్తూ, కమీషన్ల కోసం నాణ్యతపై రాజీ పడతారు. వాడాల్సిన మెటీరియల్స్‌ను తక్కువ ధరలో, తక్కువ నాణ్యత గలవిగా మార్చివేస్తారు. అవసరమైన పర్యవేక్షణ లేకుండా పనులు జరుగుతాయి. రోడ్లు వేయడం, భవనాలు నిర్మించడం, డ్రైనేజ్ వ్యవస్థలు నిర్మించడం వంటి పనులు నిర్లక్ష్యంగా, తాత్కాలికంగా చేయబడతాయి. పనులు పూర్తైన కొద్ది రోజుల్లోనే లోపాలు బయటపడతాయి. మరమ్మతుల పేరుతో మళ్లీ కొత్తగా బడ్జెట్ కోరుతారు. దీనివల్ల ప్రజాధనాన్ని వృథా చేస్తూ, ప్రజలకు నష్టం కలిగించడంతో పాటు, ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తారు. ఇటువంటి అవినీతి వలన నిర్మాణాల్లో స్థిరత్వం ఉండదు, భవిష్యత్తులో ప్రమాదాలు జరుగుతాయి.

క. అందరు పంచుకొనంగను
వందలొ నాలుగవవంతు పనులే జరుగున్
కొందరు నీతిగ నుందురు
కొందరు పెదదారులందు కోట్లు గడింతు

(ఎఱ్ఱా, పిడపర్తి. అవినీతి. 1994: 09)

1985లో, అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ గారు ఒక ప్రసంగంలో ప్రభుత్వ పథకాల అమలులో అవినీతిని ప్రస్తావిస్తూ "సర్కారు ఖర్చు చేస్తున్న ఒక్క రూపాయిలో, కేవలం 15 పైసలే లబ్ధిదారుడి వరకు చేరుతున్నాయి"అని అన్నాడు. ఈ వ్యాఖ్య ద్వారా ఆయన పాలనా వ్యవస్థలో ఉన్న ఆశ్రిత పక్షపాతం, మధ్యవర్తిత్వం, అవినీతి ప్రమాదాలను ఎత్తి చూపారు.

ఈ వ్యాఖ్య తరువాత రాజకీయ రంగంలో, న్యాయవ్యవస్థలో, పాలనా సంస్కరణల చర్చల్లో కీలకమైన ప్రస్తావనగా నిలిచింది. ఉదాహరణకు, 2017లో సుప్రీంకోర్టు ఒక తీర్పులో ఈ వ్యాఖ్యను ప్రస్తావిస్తూ, సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగా అందకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 2019లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ వ్యాఖ్యను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల అవినీతిపై విమర్శలు చేశారు. ఆయన వివరించగా, ప్రస్తుత ప్రభుత్వం డిజిటల్ వ్యవస్థలు ద్వారా నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పుకొచ్చాడు.

అధికారుల్లో అందరూ అవినీతిపరులు అనుకోవడం సరైన భావన కాదు. చివరి రెండు పదాలలో కవి అదే విషయాన్ని చెప్తున్నాడు. సమాజాన్ని మంచి దిశగా నడిపించాలనే ధ్యేయంతో నిజాయితీగా పని చేస్తున్న అధికారుల సంఖ్య కూడా చాలా ఉంది. తమ విధులకు న్యాయం చేస్తూ, ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న వారు ఉన్నారు. వారు ఒత్తిడులకు లోనవకుండా, ధైర్యంగా అవినీతిని ఎదుర్కొంటున్నారు. అలాంటి నిజాయితీ గల అధికారులను గుర్తించటం, ప్రోత్సహించటం మన బాధ్యత.

క. విలువగు సొమ్మును దోచెడి
బలిసిన కులజునకు శిక్షపడుటే సున్నా :

అలుసుగ కనబడు వానికి
పలురీతుల శిక్షవేసి బాధింతు రిలన్
(ఎఱ్ఱా, పిడపర్తి. అవినీతి. 1994: 09)

2018వ సంవత్సరంలో కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లాలో ఆహారం కోసం 200 దొంగలించాడనే నెపంతో ఒక గిరిజన యువకుడిని 50 మంది వరకు వెంబడించి కొట్టి చంపిన వార్త మనకింకా గుర్తుంది. అవినీతికి పాల్పడిన చిన్న ఉద్యోగులైన అటెండర్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ లాంటి వాళ్లను ఏసీబీ వాళ్లు రెడ్ హాండెడ్‌గా పట్టుకొని సస్పెండ్ చేసి, శిక్షలు వేస్తూ ఉండటం పేపర్లో చూస్తూ ఉంటాం. విజయ్ మాల్యా లాంటివారు వేల కోట్ల రూపాయలు బ్యాంకులకు వేగవేసి విదేశాలకు పారిపోయారు. వారికి గాని, బ్యాంకు అధికారులకు గాని శిక్షలు వేయలేకపోయారు. ఇలాంటివారు ఇంకా ఎంతోమంది ఉన్నారు. ముఖ్యమంత్రిలు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ లాంటి పెద్ద పదవుల్లో ఉన్నవారికి దాదాపు అరుదని చెప్పుకోవాలి. అదే భావాన్ని కవి తెలియజేస్తున్నాడు

**ముగింపు:**

1994 లో వెలువరించిన ఈ గ్రంథంలో 60పుటలు ఉన్నాయి. సరుకులలో, తిను బండారాలలో జరిగే కల్తీ వ్యవస్థ గురించి, పోలీసులు ప్రజలపై చూపించే పెత్తనం గురించి, ఆధిపత్య కుల స్వభావం గురించి, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ఇలా ఎన్నో ప్రజాస్వామ్య సంస్కరణలు ఆశిస్తూ చేసిన కవితలు ఉన్నాయి. దీనిలో మొత్తం కంద పద్యాలు ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే అవినీతిని కంద పద్యాలతో కడిగిపారేశారు అని చెప్పుకోవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. ఎఱ్ఱా, పిడపర్తి. అవినీతి. 1994.
2. తిలక్, బాలగంగాధర్. అమృతం కురిసిన రాత్రి. 2016.
3. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. రెండో సంపుటం. 1985.
4. నారాయణ రావు, వెల్చేరు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. 1982.
5. రంగనాథాచార్యులు, కె. కె. (సం). ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్నధోరణులు. 1982
6. archives.org
7. timesofindia.com
8. theindianexpress.com
9. Wikipedia.com



రచయిత : ఓయూ (తెలుగు శాఖ) పరిశోధక విద్యార్థి


కవిత

# హరిత హైదరాబాదు


-విను


*అర్ధరాత్రి*
*పచ్చదనపు చీరలోనున్న అడవితల్లి*
*బుల్డోజర్ దాడిలో వివస్త్రగా విలపిస్తుంది*
*తల్లిఒడిలో పడుకున్న*
*జాతీయ రాష్ట్ర చిహ్నాల గుండె పగిలింది*

*సరస్సులోని నీళ్లు*
*సమరానికి సలసల కాగుతున్నది*
*పరిశ్రమల వ్యర్థాలు వద్దేవద్దని!*

*గూడు చెదిరిన పిచ్చుకలు*
*నిరసన గీతాలనందుకున్నవి*
*సాఫ్ట్‌వేర్ రేడియేషన్ల సమాధులొద్దని*

*గుట్టల్లోని రాతిశిలలు*
*గుంపుకూడి నిప్పుని రాజేస్తున్నవి*
*కూల్చేటోడి ఆలోచనల్ని పీల్చేయాలని!*

*పోరులో పుట్టిన జ్ఞాన కేంద్రం*
*ప్రజాస్వామిక ప్రశ్నల్నే ప్రసవిస్తుంది*
*ఆత్మరక్షణ జెండాల్ని ఎగరేస్తుంది*

*కంచ గచ్చిబౌలి చుట్టూ*
*ప్రతిఘటన పిడికిళ్ల కంచె కడుదాం*
*రేపటితరం ఊపిరికై*
*హరిత హైదరాబాదును ఆవిష్కరిద్దాము*

T

విమర్శ

# మహాత్మా జ్యోతిబాఫూలే స్ఫూర్తి 'ధిక్కార'

డా. సంగి రమేష్

మహారాష్ట్ర నేలపై 19వ శతాబ్దంలో ఓ విప్లవ జ్వాల ప్రజ్వరిల్లింది. ఆ జ్వాల పేరు జ్యోతిబా ఫూలే. (11-04-1827-28-11-1890) ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక శకం. అణగారిన వర్గాల ఆశాకిరణం, స్త్రీ విద్యోద్ధరణకు ఆద్యుడు, కుల వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ధీరుడు. ఆయన జీవితం ఒక నిరంతర పోరాటం, ఒక అలుపెరగని ప్రయాణం. సమాజంలో వెలుగు నింపడానికి చేసిన ప్రయత్నం. జ్యోతిబా జీవితం సాధారణమైనది కాదు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అన్యాయాలు ఆయనను చిన్ననాటి నుంచే కలచివేశాయి. చదువుకునే అవకాశం లేని వారిని చూసి ఆయన హృదయం ద్రవించింది. ముఖ్యంగా స్త్రీలు విద్యకు దూరంగా ఉండటం ఆయనను తీవ్రంగా బాధించింది. ఆ రోజుల్లో స్త్రీలను కేవలం ఇంటి పనులకే పరిమితం చేసే సంప్రదాయం బలంగా ఉండేది. విద్య వారికి అనవసరం అనే భావన సమాజంలో వేళ్లూనుకుని పోయింది. ఈ దుస్థితిని మార్చాలని ఫూలే దృఢంగా నిశ్చయించుకున్నారు. ఆయన సంకల్పానికి ఆయన భార్య సావిత్రిబాయి ఫూలే అండగా నిలిచారు. అప్పటి సమాజం నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైనా, వారిద్దరూ వెనకడుగు వేయలేదు. సావిత్రిబాయి స్వయంగా చదువుకొని, ఇతర మహిళలకు విద్యాబుద్ధులు నేర్పడానికి సిద్ధమయ్యారు.

1848లో పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించడం ఒక చారిత్రాత్మక ఘట్టం. ఆ రోజుల్లో ఇది ఊహించని విషయం. ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా, ఫూలే, సావిత్రిబాయి తమ ప్రయత్నాలను కొనసాగించారు. వారి నిబద్ధత, పట్టుదల ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. జ్యోతిబా కేవలం విద్యా రంగంలోనే కాకుండా, సమాజంలోని ఇతర రుగ్మతలపై కూడా పోరాడారు. కుల వ్యవస్థలోని వివక్షను ఆయన తీవ్రంగా ఖండించారు. అంటరానితనం పేరుతో మనుషులను మనుషులుగా చూడకపోవడాన్ని ఆయన సహించ లేకపోయారు. అందరూ సమానమే, మానవత్వం ఒక్కటే అని ఆయన గట్టిగా నమ్మారు. ఈ నమ్మకంతోనే ఆయన 'సత్యశోధక సమాజం' అనే సంస్థను స్థాపించారు. ఈ సమాజం ద్వారా ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించారు. రైతుల పట్ల జ్యోతిబాకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. వారి కష్టాలను ఆయన స్వయంగా చూశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు పడుతున్న బాధలను ఆయన ఎలుగెత్తి చాటారు. వారి హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారు.

జ్యోతిబా ఫూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త మాత్రమే కాదు, ఒక గొప్ప ఆలోచనాపరుడు కూడా. ఆయన తన రచనల ద్వారా సమాజంలోని లోతులను స్పృశించారు. 'గులాంగిరి', 'శేత్కార్యచా అసూడ్' వంటి ఆయన రచనలు అప్పటి సమాజంలోని చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చాయి. ఆయన వాడిన భాష సూటిగా, ప్రజలకు అర్థమయ్యేలా ఉండేది. ఆయన మాటల్లోని నిజాయితీ, ఆయన ఆచరణలోని నిబద్ధత ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. జ్యోతిబా ఫూలే చూపిన బాట నేటికీ మనకు మార్గదర్శకంగా ఉంది. ఆయన ఆశయాలు ఇంకా పూర్తిగా నెరవేరకపోయినా, ఆయన వేసిన పునాదులు మాత్రం బలమైనవి. సమానత్వం, విద్య, మానవత్వం అనే ఆయన సందేశం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఆయన జీవితం మనందరికీ ఒక స్ఫూర్తి. అణగారిన వర్గాల కోసం, స్త్రీల కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ మరువలేనిది. జ్యోతిబా ఫూలే నిజంగానే సమాజానికి ఒక వెలుగు దివ్వె. ఆయనను స్మరించుకోవడం, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత. నాగర్

కర్నూలులోని 'నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక సంస్థ' ఈ బాధ్యతను తన భుజానికెత్తుకుంది. వనపట్ల సుబ్బయ్య, డా॥ సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో 'ధిక్కార' (2024) మహాత్మా ఫూలే స్ఫూర్తి కవిత్వ సంకలనాన్ని వెలువరించింది. బహుశా భారతీయ భాషల్లోని ఏ భాషలో కూడా ఇప్పటిదాకా జ్యోతిబా ఫూలే పైనా ఇలా ఒక కవిత్వ


సంకలనం వెలువడలేదు. ఇది తెలుగు భాషకు, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక సంస్థకు దక్కిన గొప్ప గౌరవం. ముందుమాటలో డా॥ సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నట్లు "బహుజనోద్యమానికి బాసటగా నిలిచేందుకు తెస్తున్న కవితా సంకలనం ఈ పుస్తకం. ఈ సంకలనంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులున్నారు. తెలుగు పాఠకులకు పూలే స్ఫూర్తిని, సామాజిక ఆచరణ, బ్రాహ్మణాధిపత్య నిరసన, బహుజన విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే సాహసం, ఆ దంపతుల పోరాటం అన్నీ కలగలిసి బహుజనోద్యమానికి బాసటగా నిలిచే కవిత్వం ఇందులో చోటుచేసుకుంది." (పుట. 36)

"మూలవాసుల మూలసుక్క
బహుజన జీవితాల తూర్పురేఖ
బానిస భావాల ముక్తి ప్రదాత
నిత్యం రగరగ పొడుస్తున్న పొద్దు
......................................
బ్రహ్మజముల్ల ముల్లపొదల నుండి
శూద్ర అతిశూద్ర లేతాకు రెమ్మలను
కాపాడే
సంస్కరణల విప్లవ సుతారితనం
విరబూసిన మానవహక్కుల
ఇంద్రధనుస్సు"

(పుటలు. 68,69)

'విప్లవ సుతారి' అనే ఈ కవితలో అన్నవరం దేవేందర్ మొత్తం జ్యోతిబాపూలే జీవితాన్ని గాఢంగా కవిత్వీకరించాడు. బహుజనుల జీవితాల్లో విద్యాదీపం వెలిగించిన సావిత్రిబాయి పూలేను కూడా తలుచుకున్నాడు. యుగాలుగా బ్రాహ్మణులు చేసిన అన్యాయాలను, దోపిడీని పూలే బట్టబయలు చేసిన విధానాన్ని అక్షరీకరించాడు. విగ్రహారాధన మాయల మీద, వేదాలు పవిత్రమనే ప్రచారాల మీద, పురోహితులు వల్లించే తూతూ మంత్రాల మీదా పరిశోధన చేసి వాటి గుట్టును రట్టు చేసిన పూలే తిరుగుబాటును అన్నవరం తన కవితలో పొదిగి చూపాడు.

"సామాజిక దొంతరల్ని
కదిలించి అదిలించి
సంస్కరణల రణౌషధం దట్టించి
ముక్కి మూలుగుతున్న మనుస్మృతుల




లోగుట్టు విడమరిచినవాడు
గులాంగిరీ మూలాల
మర్మం బహిర్గతం చేసి లోకం కళ్లముందు
అగ్ని పరీక్షకు నిలిపి నిర్భీతితో
తొలి అడుగు వేసిన సామాజిక విప్లవకారుడు"

(పుట. 79)

డా॥ దామెర రాములు రాసిన 'ప్రతి వసంతం మోసుకొస్తుంది మహాత్మా పూలే జయంతి' అనే ఈ కవిత పూలే, సావిత్రిబాయిల కార్యాచరణ గురించి పూర్తిగా విశ్లేషించిన కవిత. సూర్యమండల జ్వాలలాగా పూలే దంపతులు అందించే స్ఫూర్తి నిరంతరం మానవజాతిని చైతన్య పరుస్తూనే ఉంటుందని చెప్తూ మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళినర్పించడం కనిపిస్తుంది కవితలో.

"ఇప్పుడు
ఛండాలుడి చేతికి రాజ్యం

బహుజనుడే పాలకుడు

రాజ్యాంగం బహుజన ప్రవచనం

.....................................

ఉదయానికి ముందు ఎరుపెక్కిన

తూరుపులా

ప్రసవానికి ముందు తల్లి పెట్టిన

పెనుకేకలా

అదుగో ప్రయాణం

అదిగో మహాయానం

అదిగో...

అదిగో...

నీలి... నీలి... ఉదయం

నీది నాది ఆ ఉదయం" (పుట. 86)

ఇప్పుడు బహుజనులు 'నాలుగో కన్ను' తెరిచారని ఇక రాజ్యాదికారం వారిదేనని చెప్తాడు జూలూరు గౌరీశంకర్ ఈ కవితలో. పూలే అందించిన చైతన్యాన్ని అందిపుచ్చుకొని బహుజన సమూహాలు ఇప్పుడు రాజ్యాధికారానికి చేరువలో ఉన్నాయని, రాబోయే రోజులన్నీ బహుజనులవేనని అభయమిస్తాడు కవి.

"అక్షరమొక్కటె ఆయుధమై రక్షణనిస్తుందని

శూద్రులకు పాఠశాలవై వెలిసిన

అపార సాహస జ్ఞానఖడ్గమా

ఇప్పుడు

చిత్ర వర్ణాలు వింత విషాలు చిమ్ముతున్నయి

మనుధర్మం మనిషిని అంతం చేసి

విశృంఖల హింసా సముద్రమై విస్తరిస్తున్నది

స్వార్థం జడలు విప్పి నాలుకలు చాపుతున్నది

మా వాటా మాకు దక్కడానికి

చట్ట సభల మెట్లెక్కడానికి

తండ్రీ నీవే మాకు అంతిమ శరణం" (పుట. 91)

జ్వలిత రాసిన 'జ్ఞానఖడ్గమా' అనే ఈ కవితలో పూలే పోరాటాన్ని అనేక ఉపమానాలతో కీర్తించడం కనిపిస్తుంది. ప్రశ్నల అంకురమా! సంస్కార కరదీపమా! జ్ఞానహస్తమా! జ్ఞానఖడ్గమా! అని పూలే నడిచిన దారినంతా అక్షరాల్లోనికి ఒంపిన కవిత ఇది. మనుధర్మం మహిళను బానిసగా చూపిన తీరు, మూఢాంధకార పెనుచీకటిలో సంస్కరణ దీపాలు వెలిగించిన విధానం, చదువొక్కటే బహుజనులకు, స్త్రీలకు రక్షణగా నిలుస్తుందని చెప్పిన పద్ధతి, చివరాఖరికి బహుజన రాజ్యాధికారం కోసం పూలే చూపిన దారే శరణ్యమంటారు కవయిత్రి.

"రంగు రంగుల ఇంద్రధనుస్సే వంగిపోవుట సత్యము

నింగిలోని నిగనిగలకు నీలిరంగే నిత్యము

బడుగులకు బలహీనులకు ఆరాధ్య దైవం నీవురా...

మార్పు కోరిన సూర్యుడా ఇక తూర్పు దిక్కే మాదిరా..."

(పుట. 102)

'మనుషులందరూ ఒక్కటేనని చాటిన ఓ మహాత్మా.. జ్యోతిబాఫూలే.. జోహారు... జోహారు... మా జాతికే మీరూ.... దీపమైనారూ.... మా బడుగులకు మీరు... బాపువైనారు...' అంటూ జయరాజు పాడిన ఈ 'సమత' గేయం ఫూలే బహుజనులను ఎలా సాయుధులుగా మలిచాడో వివరించింది. ఆధిపత్య వర్గాలు చూపిన వివక్షను ప్రశ్నించింది. ఆఖరికి అన్ని రంగుల జెండాలు సమసిపోయి నీలి రంగు జెండా ఒక్కటే రెపరెపలాడుతుందని బహుజన రాజ్యాధికారాన్ని కలగన్న పాట ఇది.

"బహుజన మూలవాసులే

ఈ దేశ రాజులని

దప్పు భుజానేసుకొని

సీలు గుర్రం దరువేసిండు

పురాణాల పొట్టలు విప్పి

కట్టు కథలపై పూసిన చేదు పూతను

లంద నీళ్లతో కడిగిండు" (పుట. 105)

శూద్రులను ఉన్నతీకరించడానికి, బహుజనుల జీవితాల్లో వెలుగును నింపడానికి పూలే చేసిన పోరాట ఆచరణనంతా పూసగుచ్చినట్టు చాటిన కవిత గుడిపెల్లి నిరంజన్ రాసిన 'కొత్త సూర్యుడు'. వర్ణ వ్యవస్థ గుట్టు విప్పిన సత్యశోధకుడు పూలే. ప్రతి ఇంట్లో సూర్యుడై పొడిచాడు. వివక్షత మీద సమ్మెట దెబ్బలు వేసినవాడు. యజ్ఞయాగాలపైన అగ్నిపర్వతమై పేలినవాడు. బ్రాహ్మణుల జంధ్యపు పోగుల మీద పేదవాడి చెర్నాకోలై చెలరేగినవాడు. బానిస

భారతదేశాన్ని అంతం చేసి బడుగుల భారతదేశంకై ఉదయిస్తున్న కొత్త సూర్యుడు ఫూలే అని అభివర్ణించారు కవి.

"ఇసుక కుప్పల్లా కూలిపోయిన
బహుజన బతుకులను
నిటారుగా నిలబెట్టిన నిట్టాడు
.................................
సకల జీవుల సహృదయ ప్రవాహం
మనిషిని మనిషిగా చూసిన నిజమైన సామాజికుడు
పశుత్వాన్ని ఎదిరించిన ప్రేమమూర్తి
నవ సమాజ సమసమాజ నిర్మాణమూర్తి" (పుట. 350)

వనపట్ల సుబ్బయ్య రాసిన 'దారిదీపం' అనే ఈ చివరి కవితలో ఫూలే జీవితమంతా కవిత్వీకరింపబడింది. ఆయన ప్రతి చర్యా అక్షరమై నిలిచింది. ఆయన బహుజనుల జీవితాల్లో వెదజల్లిన పరిమళం, అరుణోదయం, సమతోదయం, వసంతోదయం, నీలి విప్లవం అన్నీ స్మరణకు తెచ్చిన కవిత ఇది. ఈ ఒక్క కవిత మొత్తం ఫూలే జీవితానుభవన్నంతా లోతుగా ప్రదర్శించింది.

మూడు యాభైలు దాటిన ఈ కవితా సంకలనంలోని కవితల్లో దేన్ని ముట్టుకున్నా మహాత్మా జ్యోతిబా ఫూలే జీవితాన్ని, మార్గాన్ని, పోరాటాన్ని, ఆయన అందించిన స్ఫూర్తిని లావాలాంటి చైతన్యంతో మన ఒంట్లోకి దింపుతుంది. "ఇప్పుడు పుట్టబోయే ప్రతి శిశువుకీ ఫూలే గురించి చెప్పాలి" అంటాడు ప్రసాదమూర్తి. "నిన్ను చూసి, చేరి, చదివి, అవగతం చేసుకున్నాక, మాట ప్రశ్నతో మెరిసిపోతుంది" అంటాడు జూకంటి జగన్నాథం. "నిద్రావస్థలో ఉన్న మా తెలివిడి మీద నువు చిలకరించిన చైతన్యపు తడినెపుడూ ఆరనివ్వం" అని హామీ ఇస్తాడు చెమన్. "నీ మార్గం నీ బోధన ఇకపై నవ భారతానికి శిరోధార్యం" అంటాడు కోట్ల వెంకటేశ్వరరెడ్డి. "చీకటి బతుకుల్లో అక్షర బీజాలు విత్తి, వెలుగు నింపిన జ్ఞానమూర్తి" అంటాడు తప్పెట ఓదయ్య. "నీ లాంటి 'జ్యోతి' మళ్లీ వెలగాలి. పులిలాంటి పూవులు మళ్లీ వికసించాలి" అంటాడు డా. వెల్దండి శ్రీధర్. "భారతీయ ఎడారి బతుకుల్లో పూలు పూయించిన ఫూలే అతడు" అంటాడు తైదల అంజయ్య. "బహుజన బాంధవుడా.. నీవు ఇడ్సిన విల్లులం.. నీ దారిలో వారసులం" అంటాడు కె.వి. లక్ష్మీనరసింహ. "తండ్రీ! నీ వల్లనే చరిత్ర మూలం కదులుతున్నది. పురాణ సారం మారుతున్నది. బహుజన రాజ్యం సిద్ధిస్తున్నది" అంటాడు బూర్ల వెంకటేశ్వర్లు. "ఎవరైనా ఎవరైనా ఎవరైనా భీమ్ రాగంలో ఫూలే పాట పాడుకుంటూ.. దారిని నీలిజెండా చేసి ఆకాశం నిండా ఎగరేస్తూ... ఎవరైనా ఈ దారెమ్మట నడిచొస్తే బాగుండు" అంటాడు పల్లిపట్టు నాగరాజు.

మహాత్మా జ్యోతిబా ఫూలే అందించిన స్ఫూర్తి మీద వెలువరించిన ఈ 'ధిక్కార' కవితా సంకలనం ఒక సాహిత్య సంపద మాత్రమే కాదు. ఇందులోని కవులు ఫూలే యొక్క పోరాటాన్ని మన కళ్ల ముందు ఉంచారు. కుల వివక్ష, స్త్రీల అణచివేత, అజ్ఞానం వంటి సామాజిక రుగ్మతలపై ఆయన పోరాటాన్ని కవిత్వంగా మలిచారు. ఈ కవితల్లోని సూటిదనం, నిజాయితీ పాఠకులను నేరుగా తాకుతాయి. అప్పటి సమాజంలోని అన్యాయాలను, దురాచారాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తాయి. ఈ సంకలనం జ్యోతిబా ఫూలేలోని బహుజన కోణాన్ని, శూద్ర హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. ఆయన కేవలం ఒక సంఘ సంస్కర్తగానే కాకుండా, లోతైన మానవతా దృక్పథం కలిగిన సామాజిక తత్త్వవేత్తగా దర్శనమిస్తారు.

ఈ కవితా సంకలనం వర్తమాన సమాజానికి కూడా ఒక ముఖ్యమైన సందేశాన్నిస్తుంది. నేటికీ సమాజంలో పూర్తిగా తొలగిపోని అసమానతలు, వివక్షల పట్ల ఇది మనల్ని జాగృతం చేస్తుంది. జ్యోతిబా ఫూలే ఆనాడే ఎలుగెత్తిన సమస్యలు నేటికీ మనల్ని వెంటాడుతూనే ఉన్నాయి. కాబట్టి, ఈ కవితలు మనకు ఒక హెచ్చరికగా, ఒక ప్రేరణగా నిలుస్తాయి. మరింత సమానత్వం, న్యాయం కోసం పోరాడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి.

ఈ కవితా సంకలనం ఒక అమూల్యమైన వారసత్వం. ఇది కేవలం ఒక వ్యక్తి భావాలను కాదు, ఒక యుగపు ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. ఈ కవితలు చదవడం ద్వారా మనం జ్యోతిబా ఫూలే పోరాటస్ఫూర్తిని అర్థంచేసుకోవడమే కాకుండా, ఒక మెరుగైన సమాజం కోసం, బహుజన రాజ్యాధికారం కోసం మనవంతు కృషి చేయడానికి కూడా ప్రేరణ పొందుతాం.

★ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం

విమర్శ

# బాలసాహిత్యం కథలు, గేయాల్లో అనివార్య చర్చనీయాంశాలు

డా. దుగ్గి గాయత్రి

బాల్యమనేది జీవితానికి పునాది వంటిది. ఒక భవంతికి పునాది ఎంత గట్టిగా ఉంటుందో ఆ భవనం నాలుగు కాలాల/ తరాల పాటు నిలిచి ఉండి కొన్ని తరాల వరకు నివాసాన్ని కల్పిస్తుంది. అది ఎన్నో అమూల్యమైన జ్ఞాపకాలకు సజీవసాక్ష్యంగా నిలుస్తుంది. నేటి బాలలే రేపటి పౌరులు కనుక భవిష్యత్ భారతావని పురోగతి అంతా వారి చేతిలోనే ఉంటుంది. అందుకుగాను పిల్లల్లో ప్రేమ, ఆత్మీయత, అనుబంధం, మానవత్వం, ఐక్యత, ఆధ్యాత్మికత, నైతికత, సత్ప్రవర్తన, ఆశయసాధన, దేశభక్తి ఆలోచనాశక్తి, వివేచనా శక్తి, సృజనాత్మకత ఇలాంటి ఎన్నో గుణాలను, విలువలను చిన్నప్పటి నుంచే నేర్పించటం ద్వారా మంచి సమాజాన్ని నిర్మించగలం. బాలల మానసిక, శారీరక వికాసమే వారి భవితకు పునాది. ఇంతటి గొప్ప సమాజ నిర్మాణానికి ఉమ్మడి కుటుంబాలు పునాదులు వేసేవి. కానీ ఇప్పుడన్ని వ్యష్టి కుటుంబాలు కావడంతో పిల్లలకు బాల్యంలో అందాల్సిన విజ్ఞాన, విలువల విషయాలు తెలియటం లేదనే చెప్పాలి. క్రమశిక్షణ, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కథల రూపంలోనో, గేయాలు పాడించడం ద్వారానో తెలిపేవారు. ఇప్పుడు మారిన పరిస్థితులలో ఆ లోటును కేవలం బాలసాహిత్యం మాత్రమే తీర్చగలదు.

పిల్లలకు పై విలువలు తెలుపడానికి, పిల్లలు ఎలాంటి సంఘర్షణకు లోనుకాకుండా తాము నేర్చుకుంటున్నామనే భావనతో కాకుండా ఆడుతూ, పాడుతూ నేర్చుకోవాలి. ఈ క్రమంలో వారి ఇంటి భాషను అంటే వారు మాట్లాడే బాలభాషను ఉపయోగిస్తూ రచనలు విరివిగా రావాలి. ఇక్కడ బాలభాష అంటే మరేదో కాదు. వీరు సులభంగా అర్థంచేసుకునే విధంగా చిన్న చిన్న మాటలతో కఠినమైన పదజాలం, వారిలో కంగారు పుట్టించే శైలి లేకుండా సాహిత్యం రాయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఇలా చెప్పడంలో ఉన్న ఆంతర్యం ఏమిటంటే, బాల సాహిత్యవేత్తలెందరో మేం చాలా సులభంగా పిల్లలకు అర్థమయ్యే రీతిలోనే రాస్తున్నాం అని చెబుతున్నారు. కానీ, అనగనగా వంటి కథలలో వచ్చి 'యుండెను. చూచెదము, వెళ్ళెదము, వచ్చెదము' వంటి పాతకాలం వ్యవహారంలో ఉన్న పదాలనే వాడుతున్నారు. ఇలా గ్రాంథిక భాషా పదాలను ఉపయోగించి రాయడం అంతగా హర్షించదగిన విషయం కాదని గ్రహించాలి. గిడుగు రామ్మూర్తి గ్రాంథిక భాషకు కాకుండా వ్యవహారభాషకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆనాడే తెలియచేసారు. పిల్లలకు భాషా నైపుణ్యాలనేవి ఇళ్ళు, సమాజం, మిత్రులు, పాఠశాల, నేటికాలంలో మీడియా ద్వారా పెంపొందుతాయి. కాబట్టి పిల్లల్లో కలిగే భాషపరమైన మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అందుకు తగిన మార్పులతో బాలసాహిత్యం వచ్చేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

బాలలకు ఎక్కువగా ఇష్టమయ్యేవి ఏవంటే గేయాలు, కథలు. వీటి ద్వారా తాము నేర్చుకున్నామనే ధ్యాస లేకుండానే ఇష్టంగా అన్ని నేర్చుకుంటారు. పిల్లలు అమ్మ జోలపాట నుండే ప్రాథమికంగా ఎన్నో విషయాలను నేర్చుకుంటారు. "చందమామ రావే జాబిల్లి రావే" గేయం ద్వారా ఖగోళ విషయాలను, ప్రయాణ సాధనాలను, పువ్వులను, లోహాలను పరిచయం చేయవచ్చు. "జో అచ్యుతానంద ముకుందా–జో జో ముకుందా", "తారంగం తారంగం" వంటి గేయాల ద్వారా ఆధ్యాత్మిక విషయాలను, "చుక్ చుక్ రైలు వచ్చింది' గేయం ద్వారా ఎలా క్రమశిక్షణ పాటించాలి. క్రమశిక్షణ చెడిపోతే అక్కడంతా గందరగోళం ఏర్పడుతుందని, ఆగినంక ఎక్కడం ద్వారా ఎలాంటి సమస్యలు ఉండవని," ఏనుగు ఏనుగు నల్లన" అనే గేయం ద్వారా ఏనుగును పరిచయం చేస్తూ రాముని గురించి తెల్పటం చేయవచ్చు. ఇలా ఎన్నో జంతువులకు, శాస్త్ర సాంకేతిక విషయాలను, ఆధ్యాత్మిక విషయాలను ప్రయాణ సాధనాలను, ప్రవర్తనకు సంబంధించిన ఎన్నో విషయాలను పిల్లలకు సులభంగా తెలుపవచ్చు.

"నాగలి తీసుక రావాలె ఎద్దులు కట్టుక పోవాలె" గేయం ద్వారా వ్యవసాయ పనులు, దేశం వ్యవసాయరంగంపై ఆధారపడిన తీరును, రైతు కృషిని తద్వార అన్నం పరబ్రహ్మ స్వరూపమని తెలియచేస్తూ వృథాని అరికట్టవచ్చు.

"కొత్తకుండతేవాలి//వెన్న మీగడలు వేయాలి//నెయ్యి కాచి పెట్టాలె పాప అన్నం తినాలి" అనేటువంటి గేయం ద్వారా ఆహార, ఆరోగ్య విషయాలు తెలియచేయవచ్చు." ఆకలికి అన్నం పెట్టాలి // అందరు కలిమిగ ఉండాలి" వంటి గేయం ద్వారా మానవ సంబంధాలను పిల్లలకు సులభంగా తెలుపవచ్చు. "అమ్మకు దండం పెట్టాలి// నాన్నకు దండం పెట్టాలి // గురువుకు దండం పెట్టాలి అతిథికి దండం పెట్టాలి" వంటి చిన్న, చిన్న గేయాల ద్వారా కుటుంబ, సమాజ విలువలు తెలుపవచ్చు. "వానా వానా వల్లప్ప // తిరుగు తిరుగు

తిమ్మప్ప"వంటి గేయాల ద్వారా ప్రకృతికి సంబంధించిన విషయాలు, "పండుగ వచ్చింది// ఆనందం తెచ్చింది// కొత్త బట్టలు తెచ్చారు//పిండి వంటలు చేసారు" వంటి గేయాల ద్వారా మన సంస్కృతీ సాంప్రదాయాలను తెలియచేయవచ్చు. కథ, గేయం, రెండు వేర్వేరు ప్రక్రియలైనప్పటికీ గేయాలలో కథాత్మక కథనం ఉండటాన్ని చూస్తాం. "కాకికి దాహం వేసింది//కడప అడుగులో నీరుంది// గులక రాళ్ళను తెచ్చింది//కడప లోపల వేసింది// నీరు పైపైకి వచ్చింది//కాకి దాహం తీరింది" వంటి బాల గేయాలలో కథాత్మక ధోరణి కనిపిస్తుంది. ఇలా గేయం, కథ రెండూ బాలలకిష్టమైనవే అయినప్పటికీ నేటి తరం బాలలు కొత్తదనాన్ని కోరుతున్నారు. పై కథాగేయం లోని కాకి కడవలో స్ట్రా వేసి నీళ్ళను తాగవచ్చు కదా అనే ప్రశ్నలను సందిస్తున్నారు. మరి నేటి బాలసాహితీవేత్తలు తమ రచనలలో కొత్తదనాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకతను గుర్తెరగాలి.

మారుతున్న ఆలోచనలు, పరిస్థితులకనుగుణంగా అంటే శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులను, సామాజిక మార్పులను, జీవన విధానంలో ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ, చైతన్యం తీసుకువచ్చే విధంగా బాలసాహిత్యం విరివిగా రావాలి. ఈనాటి కాలంలో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా చరవాణిని ఎక్కువగా ఉపయోగిస్తున్న కారణంగా ఎన్నో కుటుంబ సంబంధ, మానవీయ విలువలను కోల్పోతున్నాం. ఉదాహరణకు- అన్నం తినిపించేటప్పుడు, పడుకోబెట్టేటప్పుడు, ఆడుకునేటప్పుడు ఇలా ఎన్నో సందర్భాలలో చరవాణిని ఉపయోగించడం ద్వారా ఆత్మీయతలు కరువైపోతున్నాయి.

ఇలా కాకుండా అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య, అమ్మలు కథలు చెప్తూ, గేయాలు పాడించడం ద్వారా ఆత్మీయతలోని ఆనందాన్ని పంచవచ్చు. వాత్సల్యం, ప్రేమ వంటి విలువలను మొక్క ప్రాయం నుండే పెంపొందించవచ్చు.

పిల్లల్లో మానసిక వికాసాన్ని, చైతన్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించడంలో కథల పాత్ర ఎంతో ఉందని చెప్పవచ్చు. పిల్లలను నిద్రపుచ్చే క్రమంలో అమ్మ, బామ్మలు కథ చెప్తుండగా ఊ... కొడుతూ నిద్రపోయేవారు. రాజుల కథలు చెప్పటం ద్వారా అద్భుత, చారిత్రక రసాలను చవిచూసేవారు. హాస్య కథల ద్వారా మానసికోల్లాసాన్ని పొందేవారు. అనగనగా కథలు అప్పటి బాలలను, ఎంతో ఆకట్టుకునేవి కానీ నేటితరం పిల్లలకు అవి రుచించటం లేదనే విషయాన్ని బాలసాహిత్య వేత్తలు తెలుసుకుని అందుకు తగిన మార్పులను ఆహ్వానించడంఅనేది ఆలోచించాల్సిన విషయం. పాత తరహాలో కథలు రాయడం కాకుండా ఆలోచనాత్మకంగా రాయడం చైతన్యాత్మకంగా కథలు సాగటం ద్వారా పిల్లల్లో సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడం సాధ్యమవుతుంది. ఒకప్పటి కథలలో ఎక్కువగా జంతువులు పాత్రలుగా మాట్లాడుతున్నట్లుగా కథలు చాలా వచ్చాయి. ఉదా:-పంచతంత్ర కథలు వీటిని అప్పటి తరం ఆదరించినంతగా నేటిపిల్లలు ఆదరించటం లేదని చెప్పుకోవాలి. ఎందుకంటే ఇప్పుడున్న కార్టూన్లు, వివిధ పిల్లల ఛానల్స్ వాటి స్థాయిని కొంతవరకు తగ్గించాయని చెప్పవచ్చు.

ఉదాహరణకు "ఏడు చేపలకథ" ఆనాటికి చెల్లింది కానీ ఆ కథనే ఈ కాలానికి పనికి వచ్చే విధంగా రాజుకు ఏడుగురు కొడుకులు ఉన్నారు. ఆ రాజు తన కొడుకులకు నర్సరీ నుండి ఏడు మొక్కలను తెప్పించి పెంచమంటారు. ఆరుగురు కొడుకుల మొక్కలు కొంతకాలం తరువాత పెరుగుతాయి కానీ ఏడవ కొడుకు మొక్క మాత్రం పెరుగదు. ఎందుకని కారణం తెలుసుకోగా పెద్దవారు ఆరుగురు తమ మొక్కలకున్న ప్లాస్టిక్ కవర్ తీసి నేలలో నాటుతారు. వాటి వేర్లు నేలలో బలంగా నాటుకొని ఏపుగా పెరుగుతాయి. ఏడవవాడేమో మొక్కకు ఉన్న కవరును తీయకుండానే నాటడం ద్వారా ఆ మొక్కకున్న వేర్లు నేలలో పాతుకుపోనందున ఆ మొక్కలో పెరుగుదల ఉండదు. ఇలా కథను నేటి కాలానికనుగుణంగా మార్చి చెప్పడం ద్వారా నేటి సమస్య పట్ల చైతన్యం, పరిష్కారం రెండింటిని పిల్లలకు తెలుపవచ్చు. బాలల్లో ఇటువంటి ఎన్నో కథల ద్వారా చారిత్రక, వ్యక్తిత్వ, మానసిక వికాసాలను పెంపొందించవచ్చు.

ప్రస్తుత సమాజంలో పిల్లల మార్కులు, ర్యాంకులకే తల్లిదండ్రులు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో బాలసాహిత్యంలో కూడా పాఠ్యపుస్తకాలకు అనుబంధ సాహిత్యసృజన అనేది ఎక్కువగా జరగాల్సిన ఆవశ్యకత ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. ఇంకా శాస్త్ర, సాంకేతిక, ఖగోళ, పరిశోధన, సామాజిక రంగాలలో వస్తున్న అంశాలు ఇతివృత్తంగా రచనలు విరివిగా రావాలి.

ఒక దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే జాతినిర్మాణం కూడా ఎంతో ఉన్నతంగా ఉండాలి అందకు బాలసాహిత్యం ఇతోధికంగా తోడ్పడుతుందని చెప్పవచ్చు. మొక్కై వంగనిదే మానై వంగదు అన్న చందాన బాల సాహిత్యం విరివిగా రావాలి. అందుకు అర్థవంతమైన గేయాలు, కథలు ఇతర ప్రక్రియల రావాలి. పిల్లలే రచనలు చేసే విధంగా ప్రోత్సహిస్తూ, తప్పు ఒప్పుల ప్రసక్తి లేకుండా పిల్లల మనోభావాలను గౌరవిస్తూ వారి పొరపాట్లను సున్నితంగా తెలియచేస్తూ, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలి. పెద్దలు తమ భావాలను పిలలపై బలవంతంగా రుద్దకుండా పిల్లల స్వేచ్ఛను కాపాడుతూ వారి ఆలోచనలకు విలువనివ్వాలి. నవసమాజ నిర్మాణం కోసం స్త్రీలను, తల్లిదండ్రులను, గురువులను, అతిథులను గౌరవించడం, కుటుంబ సంబంధ, మానవీయ, నైతిక విలువలు, కష్టపడేతత్వం ఇంకా ఎన్నో విలువలను పెంచుతూ, భవిష్యత్ తరాలను ప్రభావితపరిచే రచనలు రావాలని ఆశిద్దాం. వీటికి తోడు బాల గ్రంథాలయాలను స్థాపించి పిల్లలను చదవడానికి ప్రోత్సహిస్తూ బాలల్లో బాలసాహిత్యం చదవడం వారి దినచర్యలో ఒక భాగం కావాలని కోరుకుందాం.

# సమాజ ప్రతిబింబాలు-వార్తా పత్రికలు

డా.ఎల్.నాగేశ్వరరావు

**ఉపోద్ఘాతం**

భూమి సూర్యుని నుండి రాలిపడిన ఒక ఉల్కాపాతం. ఇది కొన్ని కోటాను కోట్ల సంవత్సరాల తర్వాత విస్ఫోటనం చెంది లోయలు, కొండలు, నదులు, పర్వతాలు, సముద్రాలు, ఖండఖండాలుగా, భిన్న రకాల ఆకారాలుగా మారిందని భూశాస్త్రవేత్తల అభిప్రాయం. ఇలాంటి ఈ భూగోళం మీద జీవరాశి ఆవిర్భావం జరిగింది. ప్రాథమికంగా ఈ భూమి మీద ఆదిగా మానవ నాగరికత ప్రారంభమైంది. ఆదిమానవుడు మొట్టమొదట మృగప్రాయుడుగా ఉన్నాడు. పరిణామ క్రమంలో అతని బుద్ధి వికసించినాక జట్టు పద్ధతిని అవలంబించాడు. ఆ తర్వాత స్థిర నివాసం, జంతువుల వేట, మచ్చిక, వ్యవసాయం... ఇలా అనేక క్రమ పరిణామంగా మానవ సమాజం అభివృద్ధి చెందింది.

సమాజం అభివృద్ధి చెందేకొద్ది ఎన్నో మార్పులు సంభవించాయి. ఆదిమానవుడి నుండి అంతరిక్షం వరకు ఎన్నో పరిణామాలు జరిగాయి, జరుగుతున్నాయి. ఇలాంటి సమాజానికి ప్రాచీన కాలం నుండి నేటి వరకు 'వార్తలు' జన జీవనానికి రకరకాలుగా ఉపయోగపడుతున్నాయి. ఆదిమ కాలంలో పావురాల ద్వారా వార్తలను అంటే, లేఖలను రాసి, వాటి కాళ్ళకు కట్టి పంపించేవారు. తర్వాత గూఢాచారుల ద్వారా పంపేవారు. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పుల వల్ల వార్తలు క్షణంలో చేరుతున్నాయి. అవి రకరకాల మాధ్యమాల ద్వారా అందించబడుతున్నాయి. అందులో వార్తా పత్రికలు ఒకటి.

**వార్తా పత్రికలు**

ఆధునిక ప్రపంచానికి వార్తలను చేరవేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. అందులో వార్తలను ప్రచారం చేసే సాధనాల్లో పత్రికలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. ఈ విశ్వ ప్రపంచంలో నాలుగు దిక్కుల నుండి అన్ని దేశాల నుండి, మారుమూల ప్రదేశాల నుండి వార్తలను సేకరించి, ప్రచురించి విశ్వమానవాళికి ప్రతి విషయాన్ని తెలియ జేస్తున్నాయి. దీనినే మనం 'న్యూస్' అని వ్యవహరిస్తున్నాం. తెలుగులో వార్త అని అంటున్నాం. ఎన్=నార్త్, ఇ=ఈస్ట్, డబ్ల్యు=వెస్ట్, ఎస్=సౌత్ అని ఈ నలు దిక్కుల నుండి వార్తలను సేకరించి ప్రపంచానికి సమాచారం ఇవ్వడం వార్తా పత్రికల ప్రధాన బాధ్యత. కావునా సమాజానికి ప్రతిబింబాలుగా వార్తా పత్రికలు ఉపయోగపడుతున్నాయి.

వార్తంటే ఈ విశ్వంలో నివసించే ప్రాణులన్నింటిలోనూ తెలుసుకోవాలనే తపన మనిషిలో ఎక్కువగా ఉంటుంది. సమాజంలో రకరకాల సంఘటనలు జరుగుతుంటాయి. వ్యక్తులు రకరకాలుగా ఉంటారు. ఎవరు ఏవిధంగా, ఎన్ని రకాలుగా చెప్పినా ప్రజలకు అవసరమైన, స్పష్టమైన, కచ్చితమైన తాజా సమాచారమే వార్త అవుతుంది. ఆదిమ కాలం నుండి అంతరిక్షం దాకా ఈ సమాజంలో ఎన్నో పరిణామాలు, సంఘటనలు చోటు చేసుకున్నాయి. చరిత్రకు అందని కాలం నుండి మనిషి తన ఉనికిని, అనుభవాలను భవిష్యత్తు తరాల వారికి తెలియజేయాలనే సంకల్పంతో వార్తలను సేకరిస్తున్నారు, రాస్తున్నారు, ప్రచురిస్తున్నారు, ప్రజలకు అందిస్తున్నారు.

ప్రాచీన కాలంలో మనిషి ఒక విషయాన్ని ఇతరులకు తెలియజేయాలంటే వార్తా పత్రికలు, ప్రసార సాధనాలు లేవు. ఆదిమానవుడు శిలపైనా, గోడలపైనా రాతి స్తంభాలపైనా, స్థూపాలపైనా సమాచారాన్ని ప్రజలకు నివేదించేవారు. కొంత కాలానికి భాష అభివృద్ధిచెందాక తాళపత్రాలపైనా, రాగిరేకులపైనా, తోలు, కాగితాలపైనా రాతలతో సమాచారాన్ని అందించేవారు. అచ్చు యంత్రం కనుగొన్న తర్వాత ముద్రణ రూపంలో వార్తలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి చేరవేసేవారు. ఆధునిక కాలంలో సాంకేతిక విప్లవంతో వచ్చిన మార్పుల వల్ల వార్తలను పత్రికా సంస్థలు టెలిప్రింటర్ల స్థానంలో కంప్యూటర్లు, ఫోటోలకు బ్లాకు వేసే పద్ధతికి భిన్నంగా స్కానింగ్ పరికరాలు, టెలి కమ్యూనికేషన్ల వ్యవస్థ అభివృద్ధి చెందడంతో కాలం, దూరం బాగా తగ్గిపోయింది. ఎలక్ట్రానిక్ మీడియాతో వార్తలను రకరకాల పద్ధతుల ద్వారా సేకరించి ముద్రించి, భద్రపరిచి అందిస్తున్నారు. సెల్‌ఫోన్‌లలో వాట్సప్, ఇ-మెయిల్, మేసేజ్‌ల రూపంలో ఇంటర్‌నెట్‌ల ద్వారా క్షణంలో వార్తలను అందిస్తున్నారు. ప్రపంచంలో నలు దిక్కుల నుండి వచ్చే

తాజా సమాచారమే వార్తగా చెప్పుకోవాలి. అందుకే నార్ల వేంకటేశ్వరరావుగారు ఇలా అంటారు–

**"వార్తయందు జగము వర్తిల్లుచున్నది**
**యదియు లేని నాడ యఖిల జనులు**
**నందకార మగ్నులగుదురు**
**గావున వార్త నిర్వహింప వలయు బతికి"**

**వార్త పత్రికల పుట్టుక**

మొట్టమొదటి వార్తా పత్రికలు యూరఫ్ ఖండంలో నున్న 'లెనిస్' నగరంలో 16వ శతాబ్దంలో మొదలుపెట్టారు. ఇది మన భారతదేశంలో ఈస్ట్ ఇండియా అనే కంపెని పేరుతో వచ్చిన బ్రిటిషువారు 1893వ సంవత్సరంలో ప్రారంభించారు. వంగ రాష్ట్రంలో క్రైస్తవ మత ప్రచారం కొరక ఈ పత్రికలను స్థాపించారు. ఆ తర్వాత కౌముది మొదలైన పత్రికలను స్థాపించారు. తెలుగులో శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు 'కృష్ణా పత్రిక'ను స్థాపించారు. దేశోద్ధారకులైన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు 'ఆంధ్రపత్రిక'ను ప్రారంభించారు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు, చిలకమర్తి లక్ష్మీరంజనం గారు మొదలైనవారు వివిధ తెలుగు పత్రికలను స్థాపించారు.

**పత్రికల్లో రకాలు**

వార్తా పత్రికల్లో అనేక రకాలున్నాయి. ప్రజల యొక్క అవసరాలను బట్టి విషయాలను దృష్టింలో ఉంచుకొని పత్రికనలు స్థాపించారు అవి (1) దిన పత్రికలు (2) వార పత్రికలు (3) పక్ష పత్రికలు (4) మాస పత్రికలు (5) త్రై మాసిక పత్రికలు మొదలైన రకాలుగా విభజించారు. ఈ సమాజంలో పత్రికలకు నాల్గవ స్థానం గలదు. అందుకే పత్రికలు 'ఫోర్త్ ఎస్టేట్' అంటారు. అంటే ఈ వ్యవస్థ సక్రమంగా నడవాలంటే నాల్గవ అంశం తప్పనిసరి. (1) శాసన నిర్మాణ శాఖ (2) కార్య నిర్వహణ శాఖ (3) న్యాయ శాఖ (4) పత్రికా రంగం. వార్తా పత్రికలను ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక విషయాలను బట్టి వివిధ రకాలుగా కూడా విభజించారు.

**వార్తా పత్రికల నిర్వహణ**

పత్రికలను నడపడం ఎంతో వ్యయప్రయాసలతో కూడినది. పత్రిక సక్రమంగా నడిచి ప్రజల ముందుకు వెళ్ళాలంటే అధికారులుగా, సంపాదకులుగా, పత్రికా విలేకరులు, పత్రికలను ప్రజలకు చేరవేసే ఏజెంట్లు మొదలైనవారు ఉంటారు. వార్తలను కూర్చేవారు టెలిప్రింటర్స్ ద్వారా వార్తలను పత్రికా కార్యాలయాలకు చేర్చుతారు. వార్తా పత్రికల్లో సీరియల్స్‌గా నవలలు, గేయాలు, కవిత్వం, కథలు మొదలైన విషయాలు ప్రచురిస్తారు.

సమాజంలో సమాచార విప్లవం అన్ని రంగాలలో కొత్త పోకడలను సంతరించుకుంటుంది. పత్రికల సంఖ్య నానాటికి పెరుగుతున్నది. పాత్రికేయుల సంఖ్య మరింత పెరుగుతున్నది. పత్రిక రచనలో ఓనమాలు తెలియకపోయినా ఆసక్తితో, అవసరం కొరకు కొంతమంది మంచి జర్నలిస్టులుగా ఎదుగుతున్నారు. పత్రికల సంఖ్య పెరగడం వల్ల జిల్లా అనుబంధాలు తప్పని సరికావడంతో గ్రామీణ విలేకరుల వ్యవస్థ పుట్టుకొచ్చింది. అన్ని పత్రికలకు న్యూస్ కంట్రిబ్యూటర్లు, పార్ట్ టైం రిపోర్టర్లు ఉంటున్నారు.

**వార్తా పత్రికల వల్ల ప్రయోజనాలు**

వార్తా పత్రికల వలన మానవజాతికి, సమాజానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వీటితోపాటు నష్టాలు కూడా ఉన్నాయి. పత్రికలను చదువుట వలన ప్రతిరోజు మనిషి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, వ్యాపార విషయాలను సులువుగా తెలుసుకుటాడు. చదువు వల్ల ప్రపంచ జ్ఞానం అబ్బుతుంది. మానవులకు విశాల దృక్పథం అలవడుతుంది. రచయితలు తమ రచనలను మెరుగుపరచుకుంటారు. పరిశ్రమల్లో చాలామంది కార్మికులకు, విద్యావంతులకు ఉద్యోగ ఉపాధి కలుగుతుంది. వ్యాపారస్తులకు వ్యాపార విషయాలు తెలుస్తాయి. వార్తా పత్రికల ద్వారా వ్యాపర, ఉద్యోగ, వివాహ సంబంధ విషయాలు ప్రకటనల ద్వారా తెలునుకోవడానికి వీలుపడుతుంది.

**వార్తా పత్రికల కర్తవ్యం**

మనం ప్రతిరోజు వివిధ దిన పత్రికల్లో వార్తలను చదువుతాం. టీవీ, రేడియో, ఇంటర్నెట్‌ల ద్వారా వార్తలను వింటాం, చర్చిస్తాం, చూస్తాం, విశ్లేషిస్తాం, అభిమానిస్తాం, తిరస్కరిస్తాం, ఆశ్చర్యపోతాం, సంతోషిస్తాం, బాధపడతాం, దుఃఖిస్తాం. కాని వార్తా పత్రికలు వార్తలను ఎలా సేకరిస్తాయి, ఎలా నిర్మాణం చేస్తాయి మొదలైన విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేయం. వార్తలను విలేకరులు ఎట్లా సేకరిస్తారు? ఎలా రాస్తారు? ఎట్లా ప్రచురిస్తారు? వార్తా సేకరణలో వారు పడే పాట్లను మనం తెలుసుకోం. వార్తా అంటే మనిషికి కుక్క కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తే వార్త అవుతుంది. వార్తా పత్రికలు లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా పని చేయాలి. కాని నేడు అవి రాజకీయ పార్టీలకు అనుబంధంగా పని చేస్తున్నాయి. లాభాల కొరకు పని చేస్తున్నాయి. పత్రిక సంస్థల వారు తమ పలుకుబడులను

ఉపయోగించి ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా అబద్దపు వార్తలను పత్రికల ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాజకీయ పక్షం వహించిన పత్రికలు నేడు పని చేస్తున్నాయి. మానవజాతి నాగరికత, సంస్కారం, స్వార్థ ప్రయోజనాలకు తావు లేకుండా పని చేసినప్పుడే అవి ప్రజలకు చేరువ అవుతాయి. సమాజశ్రేయస్సు కొరకు పత్రికలు పని చేయాలి.

**వార్తా పత్రికల్లో భాష**

ప్రధానంగా తెలుగు దిన పత్రికల్లో భాషా ప్రయోగాలు రకరకాలుగా ఉంటున్నాయి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, విశాలాంధ్ర, ప్రజాశక్తి, వార్త, నమస్తే తెలంగాణ, సాక్షి, నవ తెలంగాణ మొదలైన దిన పత్రికల్లో భాష రకరకాలుగా, ప్రాంతాలవారిగా, మాండలికాలను ప్రయోగించి రాస్తున్నాయి. మాండలికాల్లో ప్రధానంగా ఉత్తరాంధ్ర మాండలకం, కోస్తాంధ్ర మాండలికం, రాయలసీమ మాండలికం, తెలంగాణ మాండలికాల్లో వార్తలు ప్రచురిస్తున్నారు. సందర్భానికి అనుగుణంగా తెలుగు జాతీయాలు, నుడికారాలు, పొడుపు కథలు మొదలైనవాటిని ఉపయోగిస్తున్నారు.

తెలుగు భాష పుట్టి పెరిగి క్రమంగా స్థిరపడిన విధానం, మారుతున్న వర్తమాన విషయాలను గమనిస్తే అది ఏవిధంగా ప్రజల వరకు చేరుతుందో తెలుస్తుంది. సంస్కృత పదాలకు విభక్తులను చేర్చి భారతాన్ని తెలుగులోకి అనువాదం చేసిన నన్నయ ప్రయత్నాన్ని చాలామంది తెలుగువారు అనుసరించారు. సంస్కృత భూయిష్టమైన తెలుగు కావ్యభాషగా మారింది. అచ్చ తెలుగు పదాలు అలాగే ఉండిపోయాయి. నాడు పండితులే పాఠకులుగా, రచయితలుగా ఉన్నారు. ఈ స్థితి వందల యేండ్లు కొనసాగింది. ఒక్కొక్కసారి అన్వయ కాఠిన్యమో, భాషా కాఠిన్యమో ఎదురైనప్పుడు టీకా తాత్పర్య సహితంగా కావ్యాన్ని చెప్పడం జరిగేది. ఇది నాడు పత్రికలు ఈ సంఘటనను ఎదుర్కొని నేడు వ్యవహారిక భాషా పదాలను వాడుతున్నాయి. గ్రాంథికవాదం నుండి వ్యవహారిక వాదం వైపు వార్తలను సేకరించి ప్రజలకు అర్థమయ్యే విధంగా వార్తలను ప్రజల భాషలోనే రాస్తున్నాయి.

దేశీయ, పండిత, పామర రంజకంగా వార్తలను ప్రచురిస్తున్నాయి. అచ్చ తెలుగుకు కావ్య భాషా గౌరవాన్ని కల్పించాయి పత్రికలు. దేశి పద్ధతిలో రచన చేసినవారు పాల్కురికి సోమన, పోతన, నన్నెచోడుడు మొదలైనవారు ఈ స్థితికి కారణభూతులని చెప్పక తప్పదు. సామాన్య పాఠకుడికి మరింత దగ్గరయ్యే పనిని పత్రికలు చేసాయి. క్రింది స్థాయి పాఠకలోకం కోసం విశ్లేషణాత్మక వ్యాఖ్యలు అవసరమయ్యే విధంగా పత్రికలు భాషా ప్రయోగాలు చేసాయి, చేస్తున్నాయి. అట్లా భాషను మరింత సరళీకరణం చేసి ప్రతి స్థాయి వారికి అర్థమయ్యే విధంగా వార్తా రచనలు ఉంటున్నాయి. మారుతున్న నేటి కాలంలో భాష కూడా సాంఘికంగా, సామాజికంగా ఎదిగి నోటి భాష, పత్రికా భాషగా మారి ప్రామాణిక భాషగా జన వ్యవహార భాషగా మారింది.

**ముగింపు**

సభ్య సమాజానికి వార్తా పత్రికలు ప్రతిబింబాలుగా, దర్పణంగా ఉపయోగపడుతున్నాయి. ఇంట్లోనే కూర్చొని ప్రపంచాన్ని చూసే భాగ్యం అంటూ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జరుగుతున్నది. పత్రికలకు, వార్తలకు ఉన్న శక్తిని నార్ల వేంకటేశ్వరరావు వార్తా పత్రికల శక్తిని ఇలా చెప్పారు.

> **"పత్రికొక్కటున్న పదివేల సైన్యము**
> **పత్రికొక్కటున్న మిత్రుకోటి**
> **ప్రజలకు రక్ష లేదు పత్రిక లేనిచో**
> **పత్రికే నియంత పక్కలో బల్లెము**
> **పత్రికే ప్రజాళజ పట్టుగొమ్మ,**
> **ప్రభుత్వ వక్రమౌను పత్రిక లేనిచో"**

అని చమత్కరించారు. అంటే పత్రికలు సమాజానికి మంత్రదండంగా ఉపయోగపడుతాయి.

**ఉపయుక్త గ్రంథాలు**


(1) గోవిందరాజు, చక్రధర్. "జర్నలిస్ట్‌ల కోసం". మీడియా హౌజ్ పబ్లికేషన్స్, హైద్రాబాద్, 1997.

(2) గోవిందరాజు, చక్రధర్. "ప్రచారం పొందడం ఎలా?". మీడియా హౌజ్ పబ్లికేషన్స్, హైద్రాబాద్, 1999.

(3) చెన్నయ్య, జె. "పత్రికలు-ప్రసార మాధ్యమాలు". హైద్రాబాద్, 2010.

(4) చెన్నయ్య, జె. "వ్యాసమాలిక". తెలుగు విద్యార్థి ప్రచురణలు, హైద్రాబాద్, 2011.

(5) బెందాళం, క్రిష్ణారావు. "వార్తలు ఎలా రాయాలి?" ఋషి పబ్లికేషన్స్, విజయవాడ, 2006.

(6) రామచంద్రమూర్తి, కె. కట్టా శేఖర్ రెడ్డి. "వార్తల వెనుక కథ". న్యూ మీడియా కమ్యూనికేషన్స్, హైద్రాబాద్, 2007.


T

పుస్తక
పరిచయం

# ద్రావిడ స్వరం - వీరనాగు శతకం

**విప్లవ్ కుమార్**

శూద్రులు చదివితే కళ్లలో సూదులు పొడిచి, వింటే చెవుల్లో సీసం పోసి, శాస్త్రం మాట్లాడితే నాలుకలు కోసి, జ్ఞానం తమ జాతికి మాత్రమే సొంతమని, మేమే జ్ఞానవంతులమని, పండితులమని ప్రకటించుకున్నారు బ్రాహ్మణులు. వారి పాండిత్య రక్షణకు మనుధర్మ శాస్త్రాన్ని రచించి ప్రచారంలో పెట్టుకున్నారు. తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి, కొనసాగించడానికి ఆ శాస్త్రం మార్గదర్శకత్వంలో ఎన్నో దారుణాలకు తెగబడి శూద్రులకు విద్య లేకుండా, పండితులను కానివ్వకుండా అడ్డుపడ్డారు. అలా ఉత్పత్తి పాండిత్యం అభివృద్ధి కాకుండా, ఉట్టిగనే తిని కూర్చొనే పాండిత్యం అభివృద్ధి చేశారు. అలా జ్ఞాన నియంతృత్వం చేయడం వల్లనే తాత, ముత్తాతల కాలం నుండి కమలం వికసించినట్టు పద్యాలు రాయగలిగారు.

చిన్నారి పొన్నారి చిరుతకూకటి నుండే కావ్యాలు, శతకాలు రాయగలిగారు. పక్కన ఉండే ప్రకృతీ సామాన్యులను పరుగెత్తకూడదని ఆంక్షలు విధించి, తాము ఒక్కరు మాత్రమే పరుగెత్తి విజయులమని, ఆట ఆడకుండానే, 'గెలిచామని' ప్రకటించుకున్నారు, విజ్ఞులమని, పండితులమని చరిత్ర నిండా రాసుకున్నారు. తేరగా బతికేందుకు రాజుల ఆశ్రయానికి పాకులాడారు. కాబట్టి వారికి ఉత్పత్తితో, శ్రమతో, సెమటతో సంబంధం లేకుండా చేసుకున్నారు. దాంతో శృంగార కావ్యాలకు, రాజుల, రాజాస్థానాల పొగడ్తలకు పరిమితమయ్యే శతకాలు, కావ్యాలు రాస్తూ, పండితులమని డాంబికాలకు పోతూ పబ్బం గడుపుకున్నారు. అందుకే వారిని "సామాజిక స్పృహ లేని శతకాలు, పద్య కావ్యాలు రాసి, రసహీనమైన చమత్కారాలతో కొంతమంది కవులు కవితా తత్వాన్ని వెగటు పుట్టించారు" అంటాడు కోయి కోటేశ్వరరావు. (కోటేశ్వరరావు, కోయి. వీరనాగు. 2025:8) ప్రపంచ విప్లవాల ప్రభావం వలన, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, అంబేడ్కర్‌ల జీవితం, మహోన్నతమైన త్యాగం వలనే ఇట్లా అనగలిగే పరిస్థితి వచ్చింది. వారి వెలుగు దారుల్లోనే ఈ దేశంలో శూద్రులందరికి చదువుకునే అవకాశం వచ్చింది. ఒకనాడు బడిలోకి అడుగుపెట్టనీయని దుస్థితి నుండి ఇవాళ బడి లోపలికి వెళ్లి చదువుకునే పరిస్థితి వచ్చింది. దానికి కొనసాగింపుగా బడిలోకి వెళ్లిన ఈ ఉత్పత్తి, శ్రామిక కులాల్లోని ప్రతి మొదటి తరం సాహిత్య సృజనకు పూనుకున్నది. ఆ పరంపరలో వచ్చిందే పాలమూరులోని బుద్దారం గ్రామవాసి, చిక్కొండ్ర రవి రాసిన పద్య కావ్యం "వీరనాగు" సామాజిక శతకం.

మూతులకు మాస్కులు, చేతులకు సెల్ ఫోన్లు, కండ్లకు అద్దాలు, చెవులకు హియర్ బడ్స్, వీపున ల్యాప్ టాప్‌లు, సంకలో ట్యాబ్‌లు మొలిచిన ఇంతటి ఆధునిక కాలంలో, వచన కవితకు వయస్సు మీదబడిన రోజుల్లో పద్యం రాశాడు చిక్కొండ్ర రవి. ఈ కాలంలో పద్యం రాయడం ఒకింత ఆశ్చర్యంగాను, మరింత సవాల్ గాను అనిపిస్తుంది. అది కూడా ఒకటి కాదు రెండు కాదు వందకు పైగా పద్యాలు రాశాడు. అంటే శతకం అన్నమాట. అయితే ఇక్కడ ఈ పద్యాలు రాసే సోకు బ్రాహ్మణులది. వారు నూట ఎనిమిది పద్యాలు రాసి శతకం అని వెలువరించేవారు. దానికి భిన్నంగా, ధిక్కారంగా బ్రాహ్మణ శతక సంప్రదాయాన్ని తుక్కు చేస్తూ నూట ఏడు పద్యాలతో వచ్చిన శతకం ఈ "వీరనాగు."

చాతి లెక్కలు చెబుతూ, చరిత్రను లిఖించుకుంటున్న భారతదేశ కులమానం ప్రకారం కురుమ కులంలో పుట్టిన రవి అడవిలో గొర్రెల కాస్తూ, నూనూగు మీసాల నూత్న యవ్వనంలో నుడివిన శతకం ఇది. "ప్రక్రియ ఏదైనా అక్షరం అంతస్సారం మానవ మహేతిహాసాన్ని గానం చేయడమే" అంటాడు శిఖామణి. అట్లా ప్రజా చైతన్యానికి ప్రేరణగా, సామాజిక సంవేదనల చిత్రణగా వచ్చినదే ఈ "వీరనాగు." దీని ఉప శీర్షిక పేరు సామాజిక శతకం. ఉత్పత్తి కులాల నుంచి వచ్చినవాడు వాడవడం వల్లనే సమాజం గురించి, సామాజిక చలనాల గురించి, మానవజాతిని పట్టి పీడిస్తున్న మలినాల గురించి గురిపెట్టి రాశాడు. అస్తిత్వ యుగ పుత్రుడిగా రవి తన నాగజాతి మూలాల గురించి ఆలోచిస్తున్నందునే కావ్యానికి వీరనాగు అని పేరు పెట్టాడు. సహజంగా శతక సాంప్రదాయంలో కవులు మకుటాన్ని తమ పేర్ల మీద మలుచుకోవడం మనం ఎక్కువగా చూశాం. కానీ రవి మాత్రం అలా చేయకుండా "సారమెరిగి సాగు వీరనాగు" అనే మకుటంతో ఈ దేశ మూలవాసుల వాణి, బాణి వినిపించబూనుకున్నాడు. అలాగే నల్లమల లోయల్లో, పరిసర ప్రాంతాల్లో, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని

శూద్రులు వీర నాగమ్మ పండుగ జరుపుతారు. ఆ నేపథ్యం నుండే రవి పాలమూరు స్థానిక అస్తిత్వాన్ని, దేశీయ బహుజన భావజాలాన్ని తన మకుటం ద్వారా చాటి చెబుతున్నాడు. 14 వ శతాబ్దంలో వేమన మకుటంలో విశ్వదాభిరామ వినురవేమా అంటూ తను చెప్పేది వినమని చెబితే, రవి ఈ కాలం వాడు కనుక సారమెరిగి సాగు వీరనాగు అంటూ, వినడమే కాదు విన్నదాంట్లో, కన్నదాంట్లో సారం పసిగట్టమంటున్నాడు. అలా సారం కలిగిన విషయం కోసం నడవమంటున్నాడు.

కావ్యారంభంలోనే "ఎలకోటి పబ్బుతి" అంటూ తన కురుమ డిక్షన్ తో ప్రారంభించాడు. "ఎలకోటికే" అంటే ఏడేడు కోట్ల దేవతలకు సమానమైన అని అర్థం. పబ్బుతి అంటే నిండు హృదయంతో, ఇష్ట పూర్తిగా చేసే కృతజ్ఞతా నమస్కారం అని అర్థం. మందను మలుపుకుంటూ, మన్యం పోతూ కాలానుగుణంగా సంచారం చేసే తన జాతికి ప్రత్యేకమైన భాష, డిక్షన్ ఉంటుందని ప్రకటిస్తున్నట్టుంది రవి కృతజ్ఞతలు తెలియజేసిన భాష, పద్ధతి.

ఆటలాడుకునే వయస్సులోనే రవి, వేమన రాసిన ఆటవెలది ఛందస్సును ఆయుధంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక విషయాలపై అక్షర క్షిపణులను ఎక్కుపెడుతున్నాడు. రవి వ్యాపకం కోసమో, పేరు కోసమో కవిత్వం రాయడం లేదు. మిక్కిలి సామాజిక బాధ్యతతో రచనలు చేస్తున్నాడు. తన జాతి మానసిక విముక్తికి అతి చిన్న వయసులోనే భావజాల యుద్ధరంగంలోకి అడుగుపెట్టాడనేది వీరనాగు చదువుతున్నపుడు మనకు అర్థమవుతుంది. "మోక్ష మార్గమంటు మొక్కుతూ తాగిన/ తీర్థజలము తోన తీరునేది/ స్వేద జలము తీర్చు వేదనలన్నియు/ సారమెరిగి సాగు వీరనాగు" ఈ పద్యంలో ఉత్పత్తి శ్రమలో భాగం పంచుకోకుండా పండిత వర్గమని చెప్పుకుంటూ, మాటలు, మంత్రాలు చెప్పుకుంటూ పనిదొంగ కులాలు చల్లే తీర్థ జలంతో ఏ లాభం, అభివృద్ధి ఉండదని, ఆకలి, బాధలు తీరవని అన్నాడు. కేవలం ఉత్పత్తి కులాలు కష్టం చేస్తూ, స్వేద జలం వెదజల్లడం వల్లనే ప్రపంచం బతుకుతుందని విప్పి చెబుతున్నాడు. "పొద్దుకన్న ముందు సద్ది నెత్తినబెట్టి/పొలము గట్ల మీద పొద్దులయ్యే/బడుగు పడతి కంటే బాహుబలెవరింక" అంటూ పొద్దున్నే లేస్తే పొలంలో పని చేసే శ్రామిక మహిళలే నిజమైన బాహుబలురని తీర్మానిస్తున్నాడు. ఆ మహిళలను మించిన శక్తివంతులు లేరని మాతృస్వామిక వ్యవస్థకు జైకొడుతున్నాడు. "అడవి చెట్లకున్న ఆదివాసాకుల/ తెంపుకుంటు ప్రభుత తెర్లు చేసి" నల్లమల ప్రాంత అడవి బిడ్డగా రవి అడవిని అర్థం చేసుకున్నాడు. అందుకే అడవి చెట్లకు చెంచులు, కోయలు, గోండుల్లాంటి ఆదివాసులే ఆకులని భావిస్తున్నాడు. ఆకులు సూర్యరశ్మిని ఆహారంగా గ్రహించి చెట్టుని బతికించినట్టు, గిరిజనులు ఆకులవలె అడవిని కాపాడేవారని, ఆదివాసులు లేకుంటే అడవి ఉండదని అంటున్నాడు. అలాంటి ఆదివాసులను ప్రభుత్వమే చంపి, మైనింగ్ కోసం కార్పొరేట్ కంపెనీలకు అడవిని ధారాదత్తం చేయడాన్ని చూసి రవి నిరసిస్తున్నాడు. "కొంతమంది చెంత కొండంత ధనమంత/ కుప్పబోసి యున్న తప్పు గాదా" అని రవి ప్రశ్నిస్తున్నాడు. గుప్పెడు మంది కార్పొరేట్ గుత్తాధిపత్య వ్యక్తుల వద్ద సంపదను కేంద్రీకృతం అయ్యేలా విధానాలను రూపొందించి, దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పే ప్రభుత్వాల నిర్ణయాలను తప్పు కదా అని నిలదీస్తున్నాడు రవి. జాతి సంపద పెరిగింది అని చెప్పాలంటే జన బాహుళ్యం సంపద పెరగాలి తప్ప జనం కడుపులు కొట్టేవారి, జాతి సంపద దోచే వారి ఆస్తులు పెరగడం కాదని ఫోర్బ్స్ జాబితా దారుల గూబ గుయ్యిమనేల పద్యం పాడుతున్నాడు రవి. "దొంగ నీతి చెప్పి దొరలోలె బతికేటి/ అంటు ముట్టుగాళ్ళ అదురగొట్ట/ కలము పట్టుకున్న కర్రెవాడను నేను'' అంటూ తనని తాను ద్రావిడ అస్తిత్వవాదిగా చెప్పుకుంటున్నాడు. అంటరానితనంతో అవమానించే వారిని, కులము కుట్రలతో ఈ నేలను మలినపరిచి అసమానతలు సృష్టించిన బ్రాహ్మణ ఆధిపత్య వాదులని అదరగొట్టడానికే కలం పట్టుకున్నానని చాటింపు వేస్తున్నాడు. పైగా వర్ణం పేరుతో అణచివేయబడిన కర్రె వాడిని, కర్రె వాడల ప్రతినిధిని అని గర్వంగా ప్రకటించుకున్నాడు.

రవి తన మొదటి పుస్తకంలోనే పరిణితి చెందిన పద్యాలు రాశాడు. తనదైన భాషను వాడుతూ మన్ను పువ్వు, ఇండియమ్మ, కరకుసేవ, నిధనులు లాంటి కొత్త పదాలను కూడా సృష్టించాడు. ఈ శతకం పాతకాలం పద్య ప్రక్రియ అయినా రవి ఆధునిక పదాలను సైతం తన పద్యాల్లో అందంగా ఇమిడ్చాడు. ట్రోలింగ్, రీల్స్, పాల్స్, కార్పొరేట్, సెల్ఫీ, ఫోన్ అంటూ ఇలా ఎన్నో ఆంగ్ల పదాలను అర్థవంతంగా అమర్చాడు. తనువు, ముండ్లు, పొయిల కట్టె, బర్రెజెనిగె, తోవ లాంటి ప్రాంతీయ పాదాలకు కొదువలేదు. ఇలా వస్తు, భాషా వైవిధ్యాలతో, ప్రాంతీయ పదబంధాలతో, సమాజ మార్పును కాంక్షిస్తూ, ఆధిపత్యం లేని బహుజన మాతృస్వామిక, మూలవాసి రాజ్యాన్ని ఆకాంక్షిస్తూ ఆవిష్కృతం అయిన ఆధునిక సామాజిక శతకం "వీరనాగు". ఇది చదువుతున్నప్పుడు దేశీ సాహిత్యానికి అద్దం పట్టి కనిపిస్తుంది. ఈ నేల సాంస్కృతిక జీవ ధాతువుల్లో ఒకటైన ఒగ్గు సంస్కృతికి కొనసాగింపుగా, బీరప్ప కూతలా, మల్లన్న డోలు మోతలా వినిపిస్తుంది. చదవండి.

★ రచయిత: పరిశోధక విద్యార్థి T

పుస్తక
పరిచయం

# వ్యాస మకరందం-సమాలోచన

డా. శోభన్‌బాబు బోలుగాని

"ఇంటికి కంటికి వెలుగైన స్త్రీ
తన రాతను తానే మార్చుకోవాలి
ఈ బుద్ధ భూమిలో ఓ సైనికురాలై
నిరంతరం యుద్ధం చేస్తూ
గెలుపు బావుటాను ఎగురవేయాలి "

(యుద్ధం నడుస్తూనే ఉంది.పుట 50 )

అని ఆచార్య శరత్‌జ్యోత్స్నా రాణి గారు ఏ క్షణాన పలికారో కానీ ఈ కవితా పంక్తులు అక్షరాలా వారికి కూడా వర్తిస్తాయి. పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రంలో ఉద్యోగ జీవితం ఆరంభించి , 1991 ఫిబ్రవరిలో హైదరాబాద్ విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి మీద వచ్చి ,2021లో మానవీయ శాస్త్రాల డీన్‌గా పదవీ విరమణ పొందటం నిజంగా గెలుపు బావుటాయే. అధ్యాపకురాలిగా, కవయిత్రిగా, రచయిత్రిగా, విమర్శకురాలిగా, పరిశోధకురాలిగా, పర్యవేక్షకురాలిగా అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తిత్వం వీరిది. ఇంకా చెప్పాలంటే ' మధుర శ్రీనాథ 'గా ప్రసిద్ధి గాంచిన యస్.టి.జ్ఞానానందకవి గారి కవిత్వంలోని మధురిమలను పుణికి పుచ్చుకున్న వారసురాలు. ' భారత భాషా భూషణ్ ' మొదలుకొని 'అమృతలత అవార్డు' (సుమారుగా 30) వరకు వారికి లభించిన అవార్డులు, రివార్డులు వారి సాహిత్య కృషికి నిలువెత్తు నిదర్శనాలు. ఒక విధంగా గెలుపు బావుటాలు. ఇలా చెప్పుకుంటూపోతే వారి కవిత్వంలోని, కథల్లోని, జీవితంలోని విశేషాలెన్నో. ప్రస్తుతానికి వారు రచించిన 'వ్యాస మకరందం'లోని విశేషాలను తెలియచేయటం ఈ వ్యాసరచన ప్రధానోద్దేశ్యం.

ఆచార్య శరత్‌జ్యోత్స్నా రాణి గారి 'వ్యాస మకరందం' అనే వ్యాస సంపుటంలో మొత్తం ఇరవై వ్యాసాలున్నాయి. ఇందులోని అధిక భాగం వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురించబడినవి, ఆయా సదస్సులలో పత్ర సమర్పణ చేయబడినవి కావడం విశేషం. ప్రతీ వ్యాసం దేనికదే ప్రత్యేకతను సంతరించుకుంది. ఇందులో మొదటి వ్యాసం 'కందుకూరి రచనలు – సామాజిక విశ్లేషణ'. తెలుగు సాహిత్యంలో గల సంఘ సంస్కరణకు ఆద్యుడు యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులుగారు. ఆధునిక సాహిత్య చరిత్రలో పంతులు గారి స్థానం విశిష్టమైనది. ఈయనకు పూర్వం ఆయా సాహిత్య ప్రక్రియలున్నప్పటికీ స్థితి ప్రాచుర్యాన్ని కల్పించిన వారే వీరేశలింగం పంతులు గారని వారి సంఘసంస్కరణ దృక్పథాన్ని తెలియచేశారు. సాంఘిక రంగంలో ఆయన వీరావేశంతో విజృంభించిన అతివాది, కవితారంగానికొస్తే కడుపులోని చల్ల కదలకుండా నడచిన మితవాది అని తెలియచేశారు. ఇందులో మనం అటు కవి తత్వాన్ని, ఇటు కవితా తత్వాన్ని గమనించవచ్చు. పంతులు గారు ఏది చేసినా స్త్రీల అభ్యున్నతి కోసమే చేశారని వారి రచనల ఆధారంగా చర్చించారు. వీరి ప్రహసనాలలో హాస్యం కనిపించినా దిగులు కనిపిస్తుంది. సాంఘిక దురాచారాలను ఖండించిన మహానుభావుడని కీర్తించారు. అలాగే పంతులు గారి జీవిత చరిత్ర ఆనాటి సామాజిక స్థితిగతులకు దర్పణం వంటిదని తెలియచేశారు.

తెలుగు వారి ఆధునిక, సామాజిక, సాంస్కృతిక చరిత్రలో గురజాడ స్థానం విశిష్టమైంది. అటువంటి వారిపై రచింపబడిన వ్యాసం 'గురజాడ కవిత్వం – విమర్శా వివేచన'. 20 వ శతాబ్ది చివర బలంగా వచ్చిన స్త్రీవాద సాహిత్య భావాలకు నమూనాలు గురజాడలోనే ఉన్నాయి. దళిత చైతన్యానికి బీజప్రాయాలు గురజాడ కవితల్లో కనిపిస్తాయని తెలియచేశారు. గురజాడ కవిత్వంలో మానవతావాదం కనిపిస్తుంది. కులాన్ని బట్టి కాకుండా మనసును బట్టి మనుషుల్ని గౌరవించడం ధర్మమని గురజాడ భావించారని సోదాహరణంగా వివరించారు. గురజాడ రచించిన 'అరటికాయ బజ్జి మినప్పప్పు సొజ్జి – కలిసిమెలసి తిందాం కథలు వెతలు విందాం' అనే బాలగేయాన్ని గూర్చి

"పసిపిల్లలలో చిన్నప్పటి నుంచి సమైక్యతా భావం పెంపొందాలని గురజాడ కాంక్షించారని తెలుస్తుంది" అని చర్చించడం సముచితంగా ఉంది.

కృష్ణకుమారి కవిత్వంలో వస్తువు సర్వ మానవ శ్రేయస్సును కాంక్షించే అభ్యుదయ భావనలతో పాటు సామాన్య మానవుల్ని, వారి స్థితిగతులను, ఆర్థిక అసమానతల్ని తెలియచేస్తుందని 'నాయని కృష్ణకుమారి – కవితా దృక్పథం' లో వివరించారు. నాయని కృష్ణకుమారి గారి కావ్యాలను పరిశీలిస్తే అందులో ముఖ్యంగా మానవతా ప్రభోధం, సమైక్యత, దేశభక్తి, ప్రకృతి వర్ణన, జ్ఞాపకాలు, వాస్తవిక సమాజ చిత్రణ, విప్లవ నిరసనలు కనిపిస్తాయని కూలంకషంగా చర్చించారు.

'సి.నా.రె జీవితం – వ్యక్తిత్వం' ఇందులోని మరో వ్యాసం. ఒక వ్యక్తి ఎదగడానికి చేసే ప్రయత్నంలో ఎన్నో అవకాశాలు వస్తాయి. కాని ఆయన తన గమ్యం కోసం కొన్ని అవకాశాలను వదులుకున్నారని సోదాహరణంగా చర్చించారు. సి.నా.రె గారి ఉపన్యాసాలు కొత్తదనంతో నిండి ఉంటాయని, ఒకరోజు ఉపన్యాసంలో మాట్లాడిన అంశం మరొక రోజు కనిపించదని పేర్కొనడంలో జ్యోత్స్న గారి సునిశిత పరిశీలనా శక్తిని మనం గమనించవచ్చు. ఆయన రచనల్లో మానవత్వం జాలువారుతుంది, వ్యక్తిత్వ వికాస కవితలు రాశారంటూ వివిధ కోణాల్లో ఈ వ్యాస రచన సాగింది. ఆయన కులాలకు, మతాలకు అతీతమైన మానవతావాది, నిజం చెపాలంటే నా దృష్టిలో అమృత మూర్తి, ఆదర్శ చరిత్ర గల వ్యక్తి అని సి.నా.రె గారి వ్యక్తిత్వాన్ని తెలియచేశారు.

విమర్శకురాలిగా ఆనందరామం గారి కృషిని తెలియచేసే వ్యాసం 'విమర్శకురాలిగా సి.ఆనందరామం'. ఆమె లెక్కకు మించి కథలు, నవలలు రాసి సృజనాత్మక రంగంలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. తెలుగు భాషా సాహిత్యాల అభ్యాసం, ఆచార్యురాలిగా సాహిత్య విమర్శ, చరిత్ర బోధన, తులనాత్మక పరిశీలన దృక్పథం అనేవి ఆనందరామం గారు విమర్శకురాలిగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో దోహదపడ్డాయని తెలియచేశారు.గురజాడ కవితా విమర్శ, కవిత్వ విమర్శ, అభ్యుదయ కవిత్వ విమర్శ, నవలా విమర్శకురాలిగా వంటి ఉప శీర్షికలతో ఈ వ్యాస రచన సాగింది. అమలిన శృంగారం కవిత్వ సిద్ధాంతంగా సమర్థనీయమేమోగానీ నిత్య జీవితంలో అసంభవం, వేయి పడగలు ఆధునికేతిహాసం, చలం స్త్రీని ఏ నవలలోనూ విలాసినిగా కాని కాముకిగా కానీ చిత్రించలేదు వంటి ఆసక్తికర విషయాలు ఇందులో చర్చింపబడినవి.

'కుందుర్తి విమర్శనా దృక్పథం' లో సాహిత్యాన్ని విమర్శించేటపుడు సాహిత్య పరమైన అంశాలే కాక సాహిత్యేతర అంశాలను , సామాజికాంశాలను కూడా కుందుర్తి ఆంజనేయులు పరిశీలించారని తెలియచేశారు. కుందుర్తి ప్రధానంగా ఉద్యమాలపై, కవులపై , వాదాలపై విమర్శ చేశారు. వచన కవిత్వాన్ని సుస్థిరం చేయడానికి వచన కవిత్వంపై లక్షణ చర్చ చేశారు. ఇతడు చేసిన లక్షణ విమర్శ సిద్ధాంత ప్రతిపాదన శాస్త్రీయ మార్గంలో సాగకుండా సూచనా మాత్రంగా సాగినట్లు కన్పిస్తుందని వివరించారు.

'శేషేంద్ర శర్మ వచ్చింది ఓట్ల ఋతువు కావ్యానుశీలనం' మరో మంచి వ్యాసం. శేషేంద్ర శర్మ గారి సూక్ష్మ భావన ఎంత వేడిగా ఉంటుందో భాష అంత ఆకర్షణీయంగా ఉంటుందని తెలియచేశారు. అలాగే శేషేంద్ర శర్మ రాసిన ఏ కవిత అయినా భావయుక్తంగా ఉంటూనే సమాజంలో నివసించే వ్యక్తుల ఆలోచనల్లో కాస్తా మార్పు కోరుకుంటుందని వివిధ ఉదాహరణలతో వివరించారు.

'విమర్శకుడిగా ఎస్.వి. రామారావు' వ్యాసం విమర్శకులపై సాగిన వ్యాస పరంపరలో మరొకటి. ఎస్.వి. రామారావు గారి పేరు వినగానే మనకు వారి సిద్ధాంత గ్రంథం 'తెలుగులో సాహిత్య విమర్శ – అవతరణ వికాసాలు' గుర్తొస్తుంది. ఈ సిద్ధాంత గ్రంథంలో భారతీయ ఆలంకారిక పాశ్చాత్య సాహిత్య విమర్శా సిద్ధాంతాలను మేళవించి సాహిత్య విమర్శను రూపొందించాడు. కవిత్వానికి స్వరూపమున్నట్లు విమర్శకు స్వరూపాన్ని నిర్వచించడం కష్ట సాధ్యం అంటూనే కావ్యావతారికలు, పీఠికలు, టీకలు, వ్యాఖ్యానాలు, గ్రంథ సమీక్షలు, కవుల చరిత్రలు మొదలైన వాటిని విమర్శ స్వరూపాలుగా గుర్తించి వాటిలో ఉన్న విమర్శ స్పర్శను స్పృశించారని ఆ గ్రంథ అధ్యయన ఆవశ్యకతను గుర్తు చేశారు. సమన్వయ దృక్పథం, జాతీయ భావన, సంప్రదాయ గౌరవం, ప్రాచీన ఆధునిక సాహిత్య వివేచన

లోని సమాదరం ఎస్వీఆర్ విమర్శలో కన్పించే అంశాలని చర్చించారు.

దక్షిణాంధ్ర యుగ సాహిత్యంలో ప్రఖ్యాతి పొందిన కవయిత్రి రంగాజమ్మ. విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి. ఇటువంటి ఆమెపై జ్యోత్స్న గారు 'రచయిత్రిగా రంగాజమ్మ – విశిష్టత' అనే వ్యాసాన్ని రాశారు. రంగాజమ్మ ఇంటిపేరును గూర్చి, ఆమె పూర్వీకులను గూర్చి, ఆమె రచనల్లోని విశేషాలను గూర్చి ఇందులో చర్చించారు. లోకోత్తర ప్రతిభాశాలి అయిన కవులకే ఆ రోజుల్లో కనకాభిషేకం జరిగేది. అలాంటి కనకాభిషేకం పొందిన కవయిత్రిగా రంగాజమ్మ తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని ఆమె విశిష్టతను తెలియచేశారు.

'అన్నమయ్య సంకీర్తనలు – సామాజికాంశాలు'లో అన్నమయ్య జీవిత విశేషాలను, రచనలను పరిచయం చేశారు. ప్రజలకు ఇష్టమైన పాటల ప్రక్రియను చేపడుతూ ఆధ్యాత్మిక విప్లవాన్ని తీసుకొచ్చిన గొప్ప కవి, భక్తాగ్రేసరుడు, సంఘ సంస్కర్త మన అన్నమయ్య. అన్నమయ్య కేవలం భక్తి కర్మ మార్గాలను మాత్రమే బోధించలేదు. సమాజంలో ధర్మాన్నీ, మానవత్వాన్నీ స్థాపించడానికి, సాంఘిక చైతన్యం కలిగించడానికి కూడా ఎన్నో కీర్తనలు రాశాడు. తన చుట్టూ ఉన్న వాతావరణంతో పాటు, ప్రజల ఆచార వ్యవహారాలను , ప్రజలలో కనిపిస్తున్న దురాశ దుర్బుద్ధులను వివరించి చైతన్యం తీసుకురావడానికి కృషి చేశాడని అతని సంకీర్తనల్లోని సామాజిక దృష్టిని, చైతన్యాన్ని విశ్లేషించారు.

'ఆధునిక నాటకాలు – స్త్రీవాద దృక్పథం' లో స్త్రీ వ్యక్తిత్వం అస్తిత్వాలకు అండగా నిలిచిన నాటికలతో పాటు, దయనీయ స్థితిని చిత్రించిన నాటకాలు కూడా తెలియచేశారు. గురజాడ–కన్యాశుల్కం; కాళ్ళకూరి–వరవిక్రయం,చింతామణి; రాజమన్నార్–దయ్యాలలంక; కొప్పరపు సుబ్బారావు–ఇనుప తెరలు; అత్తిలి కృష్ణారావు–జోగు జాతర; యం.ప్రకాష్–గారడి మొదలైన నాటకాల్లోని స్త్రీవాద దృక్పథాన్ని ఈ వ్యాసంలో చర్చించారు.

'వానమామలై వరదాచార్యుల అభ్యుదయ నాటికలు–వస్తువు' ఈ సంపుటిలోని మరో వ్యాసం. ఇందులో వరదాచార్యుల వారిచే రచింపబడిన సత్యమేవ జయతే, నాగార్జున సాగరం, రాజ్యశ్రీ, గ్రామ సుధాకర్ అనే నాలుగు నాటికలలోని వస్తువును గూర్చి విపులంగా చర్చించారు. దేశ రక్షణ కర్తవ్యాన్ని, దేశాన్ని రక్షించే వారి పట్ల గౌరవ భావాన్ని ప్రబోధించే నాటిక 'సత్యమేవ జయతే'. తనకు తాను సహాయం చేసుకోలేని వ్యక్తులకు దేవుడు కూడా సహాయం చేయడనేది 'నాగార్జున సాగరం'లోని ప్రధాన ఇతివృత్తం. మద్యం మహమ్మారికి బానిసై ఇంటిని ఒంటిని గుల్ల చేసుకోవడం వల్ల ఎదురయ్యే అవస్థలను వివరించే నాటిక 'రాజ్యశ్రీ'. వర్ణ వ్యవస్థకు తావులేదని, అన్ని వర్గాల వారు చదువుకొని సంస్కర్తలుగా కనిపించడమే 'గ్రామ సుధాకర్'లోని సారాంశం. ఈ విధంగా ఆయా నాటికల్లోని వస్తువుతో పాటు ప్రధాన పాత్రల అభ్యుదయ భావాలను రమణీయంగా చర్చించారు.

'తెలుగు కవిత్వం–మానవతావాదం' లో మానవతావాద స్వరూప స్వభావాలకు సంబంధించిన వివరణ కనిపిస్తుంది. ప్రకృతిలో మానవుడి ఔన్నత్యాన్ని నిలిపేది మానవతావాదం. మనిషిని మనిషిగా పరిగణిస్తూ తన కార్యకలాపాలన్నింటికీ తన పనులే కారణమని విశ్వ సించడం మానవతావాదమని తెలియచేశారు. గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, బోయి భీమన్న,నార్ల, శ్రీశ్రీ, కుందుర్తి, దాశరథి, కాళోజి, సి.నా.రె మొదలైన వారి కవిత్వంలోని మానవతావాదాన్ని ఆవిష్కరించారు.

'తెలుగు కథ–ప్రపంచీకరణ'లో ప్రపంచీకరణ ప్రారంభ దశను చర్చించడం సముచితంగా ఉంది. ప్రపంచీకరణ ఎప్పుడు,ఎలా మొదలైనదో తెలుసుకోవడానికి ఇది సహకరిస్తుంది. కుప్పిలి పద్మ, ఓల్గా, ఆడెపు లక్ష్మీపతి, అశ్వినీకుమార్, సి.వెంకటేష్, శ్యామల,బుర్ర రాములు, కాసుల ప్రతాప రెడ్డి, కాలువ మల్లయ్య మొదలైన కథకులెందరో ప్రపంచీకరణ తీరుతెన్నులను చక్కని కథలుగా మలిచారని ఉదాహరణలతో సహా తెలియచేశారు. ప్రపంచీకరణ నేపథ్యం దాని ఆధిపత్యం వల్ల రైతులు కూలీలుగా మారిపోవడం, శ్రామిక సంస్కృతి కనుమరుగై పోయి కులవృత్తులు విధ్వంసం కావడం కనిపిస్తుంది. కవిత్వం కన్నా కథ బలంగా ప్రపంచీకరణ ఫలితాలను ఆవిష్కరించింద ని చర్చించారు.

'తెలుగు కథల్లో స్త్రీ పాత్ర స్వభావ పరిణామం' పేరుకు తగినట్లు విషయ విస్తృతి గల వ్యాసం. స్త్రీవాద కథలు,

తెలంగాణ కథలు, దళిత కథలు, మైనారిటీ కథలు, కళింగాంధ్ర కథలు, ప్రపంచీకరణ కథలు, గిరిజన కథలు, బహుజన కథలు, రాయలసీమ కథలు మొదలైన ఉప శీర్షికలతో ఆయా కథల్లోని స్త్రీ పాత్రల స్వభావాన్ని విశ్లేషించారు. ఈ విధంగా ప్రాంతాన్ని బట్టి, కాలాన్ని బట్టి,వాదాన్ని బట్టి, స్త్రీ పాత్ర స్వభావ పరిణామాన్ని వివేచించుట వల్ల భావి పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పవచ్చు.

'రచయిత్రుల నవలలు-స్త్రీల సమస్యల విశ్లేషణ' అనే వ్యాసంలో ఇల్లిందల సరస్వతీ దేవి, మాలతీ చందూర్, పి.శ్రీదేవి, తెన్నేటి హేమలత, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, సి.ఆనందరామం, మాదిరెడ్డి సులోచన మొదలైన రచయిత్రుల నవలల్లో గల స్త్రీల సమస్యలను చర్చించారు.

'దళిత కవయిత్రుల కవిత్వం-వస్తు వివేచన' అనే వ్యాసంలో దళిత కవయిత్రుల కవిత్వంలో ఆగ్రహం, ఆవేశం, ధిక్కార నిరసన లతో పాటు మార్పును కోరే తపన కనిపిస్తుందని తెలియచేశారు. మోత్కుపల్లి దమయంతీ దేవి, కొలకలూరి స్వరూపరాణి, జల్లి ఇందిర, జాజుల గౌరి, వజ్ర రాణి, జాలాది విజయకుమారి, చల్లపల్లి స్వరూప, జి.నిర్మల మొదలైన దళిత కవయిత్రులెందరినో పరిచయం చేయడం తో పాటు వారి కవితా ఖండికలను ఉదాహరించారు.

'జ్ఞానానందకవి కథా కావ్యాలు-వస్తువు' లో సురగాలి తిమోతి జ్ఞానానంద కవి గారి ఆమ్రపాలి, దేశబంధు అయ్యదేవర కాళేశ్వర రావు, గోల్కొండ, వివేకానందగానం, తరంగమాల, క్రీస్తు ప్రబంధం, రాజధాని మొదలైన కావ్యాలలోని వస్తువును గూర్చి విశ్లేషించారు. జ్ఞానానంద కవి గారు ఆమ్రపాలి కావ్యాన్ని 48 గంటల్లోనే రచించారట. ఆయన కవిత్వంలో సర్వమత సమదృష్టి, భారతీయ సంస్కృతిపై అభిమానం, మానవతా దృష్టి, భాషాభిమానం, సహృదయత, నవ్య సంప్రదాయంపై గాఢాభిమానం మొదలైనవి కనిపిస్తాయని సోదాహరణంగా వివరించారు.

'తెలుగు వారి జానపద ప్రదర్శన కళలు-సంస్కృతి'లో జానపద కళల్ని, కళా రూపాల్ని ప్రజా సంస్కృతి యొక్క అనుభవాల ప్రతీకలుగా చెప్పవచ్చునని తెలియచేయటంతో పాటు వివిధ జానపద ప్రదర్శన కళలలోని సాంస్కృతిక విలువలను చర్చించారు.

ఈ వ్యాస సంపుటిలోని చివరి వ్యాసం 'నా సాహితీ ప్రస్థానంలో నాన్న'. శరత్ జ్యోత్స్నా రాణి గారు తమ తండ్రి గారైన యస్.టి.జ్ఞానానందకవి గారి జీవితంలోని వివిధ విశేషాలను ఇందులో చర్చించారు. అంతే కాకుండా తన జీవితానికి మార్గ నిర్దేశం ఎలా చేశారో తెలియచేశారు. జ్ఞానానంద కవి గారు సాహిత్య సమాఖ్య, సాహిత్య కళాపీఠం వంటి సంస్థలను నిర్మించారు. ఎంతో మంది యువ కవులకు ప్రోత్సాహాన్నిస్తూ నెలకు ఒకసారి కవి సమ్మేళనాలను, సాహితీ సమావేశాలను ఏర్పాటు చేసి వారిని సత్కరించేవారు. వారి స్ఫూర్తి తో జ్యోత్స్నా రాణి గారు 'జ్యోత్స్నా కళాపీఠం' అనే సాంస్కృతిక సాహితీ సంస్థను 1997 లో స్థాపించారు. ఎంతో మంది కవులను, కళాకారులను సత్కరించారు. ఈ విధంగా ఈ వ్యాసంలో జ్యోత్స్నా రాణి గారి జీవిత విశేషాలు కూడా కనబడతాయి.


'వ్యాస మకరందం' ఆద్యంతం పరిశీలిస్తే నాకు తోచిన అంశాలు మీతో పంచుకుంటున్నాను. ఆధునిక సాహిత్యానికి ఒక దిశా నిర్దేశం చేసిన కందుకూరి, గురజాడ మొదలుకొని వివిధ కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు, విమర్శకులు, కొన్ని ఉద్య మాలను ఎంచుకొని రచయిత్రి ఇందులో వివరించారు. విభిన్న సందర్భాలలో రచయిత్రి సమర్పించిన వ్యాసాల సంపుటియే ఈ గ్రంథం. పాట, పద్యం, కథ,కవిత, నవల, విమర్శ - ప్రక్రియ ఏదైనా నిష్పక్షపాతం వీరి సహజ గుణం. ఈ వ్యాసాలలో అధిక భాగం మానవతా వాదం తొంగి చూసింది అని చెప్పవచ్చు. విమర్శకులపై విమర్శ ఇందులోని మరోకోణం. మహిళాభ్యుదయం, కులమత రాహిత్యాకాంక్ష అనునవి వీరి వ్యాస పరంపరలో అంతర్గతంగా కనిపించును. మొత్తానికి తెలుగు సాహిత్యం మీద చక్కని అవగాహనను పెంపొందించు కొనుటకు ఈ పుస్తకం ఒక కరదీపిక వంటిదని నిస్సందేహంగా చెప్పవచ్చు. చివరగా ఒక్క మాట - ఇక ముందు శరత్ జ్యోత్స్నా రాణి గారు విశ్రాంత ఆచార్యులైతే కావచ్చు కానీ నా మట్టుకు వారు అవిశ్రాంత ఆచార్యులు. వారి రచనా వ్యాసంగానికి పదవీ విరమణ లేదని భావిస్తున్నాను.

★ *రచయిత, అతిథి అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మల్కాజ్‌గిరి*

పరిశోధన
పరిచయం

# శ్రీనాథుని కవితా ప్రస్థానం-సమగ్ర పరిశీలన

డా. వేముల శరణ్య




## 1. పరిశోధన శీర్షిక (Title of the Research)

ప్రాచీన సాహిత్యంలో పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు మొదలైన ప్రక్రియల సాహిత్యం అంతా పద్యరచనలోనే సాగింది. నన్నయ మొదలగు కవుల పేర్ల మీదుగా యుగవిభజన చేసారు. అదే విధంగా 15వ శతాబ్ది కాలాన్ని శ్రీనాథయుగమన్నారు. అనేక కావ్యాలు వెలువడిన కాలం కనుక కావ్యయుగమని కూడా పిలిచారు. ఆ యుగానికి ప్రాతినిధ్యం వహించిన కవి శ్రీనాథుడు. ఎందుకంటే ఆ కాలంలోని ఇతర కవుల కంటే కూడా ఉత్తమ సాహిత్యాన్ని ఆయన అందించాడు. అటువంటి మహాకవి రచనలపై పరిశోధన చేయాలనుకున్నాను. "శ్రీనాథుని కవితా ప్రస్థానం –సమగ్ర పరిశీలన" అనే అంశంపై పిహెచ్.డి పరిశోధన చేసాను. ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆచార్య పిల్లలమర్రి రాములు పర్యవేక్షణలో తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి 2024 లో సమర్పించాను.

## పరిశోధన నేపథ్యం (Background of research)

తెలుగు సాహిత్యంలో అజరామరమైన కవి శ్రీనాథుడు. అతనికి సాహిత్య చరిత్రలోనే ఎప్పటికి కదిలించలేని సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్న శాస్త్రపారంగతుడు. అటువంటి కవి రచనల మీద, కవితా మార్గం మీద ఎన్నో చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. విభిన్న కోణాల్లో పరిశోధనలు జరిగాయి. ఒక్కొక్క కావ్యం మీద విడివిడిగా పరిశోధనలు జరిగాయి. కానీ అన్ని కృతుల మీద చాలా తక్కువగా జరిగాయి. శ్రీనాథుని కవితా మార్గం మీద పండిత లోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అతడు రీతిని పోషించాడు అనీ, రసాన్నే ఎక్కువగా వాడిన రసవాది అనీ, వక్రోక్తిని అతను అనుసరించాడనీ ఇలా రకరకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయి. అసలు శ్రీనాథుడు అనుసరించిన కవితా మార్గం ఏమిటో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భావించాను. ఆ భావనే ఈ పరిశోధన నేపథ్యం.

## పరిశోధన పరిధి (Scope of Research)

'శ్రీనాథుని కవితా మార్గం – సమగ్ర పరిశీలన' అనే నా పరిశోధన అంశానికి గాను శ్రీనాథుని రచనలైన ప్రస్తుత లభ్య కావ్యాలైన 1) శృంగార నైషధం, 2) కాశీఖండం, 3) భీమఖండం, 4) హరవిలాసం, 5) శివరాత్రి మహాత్మ్యం, చాటువులను తీసుకున్నాను. కావ్యాల వాదోపవాద చర్చల వల్ల శ్రీనాథుని కావ్యాలుగా చెప్పబడుతున్నప్పటికి క్రీడాభిరామం, పల్నాటి వీరచరిత్రను నా పరిశోధనకు స్వీకరించలేదు.

## పూర్వ పరిశోధనల సమీక్ష (Review of Literature)

శ్రీనాథుని రచనల మీద అనేక పరిశోధనలు విభిన్న కోణాల్లో జరిగాయి వాటిలో కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1) హరి, కూచిబొట్ల. 1964. శ్రీనాథుని కవితాదృక్పథం. కె. సుబ్బరామయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. మైసూరు విశ్వవిద్యాలయం.

2) రామ్మూర్తి, కె. 1965. శ్రీనాథుని ఆంధ్రీకరణ విధానం – చారిత్రక విశేషాలు. కె.వి.ఆర్. నరసింహగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఆంధ్ర విశ్వవిద్యాలయం.

3) జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1973. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం. ఎస్.వి. జోగారావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఆంధ్ర విశ్వవిద్యాలయం.

4) అనంతరామశాస్త్రి, ఎన్. 1978. శ్రీనాథుని భాష వర్ణనాత్మక విశ్లేషణ. టి.దోణప్పగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి

సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. నాగార్జున విశ్వవిద్యాలయం.

5) శాస్త్రి, కె.డి.యన్. 1986. శ్రీనాథునిపై సంస్కృత కవుల ప్రభావం. బి. రామబ్రహ్మంగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. నాగార్జున విశ్వవిద్యాలయం.

6) విశ్వనాథ, ఎ. 1979. శృంగార నైషధం-శ్రీనాథుని నిదార్శనిక దృష్టి. బి. రామయ్యగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. మైసూరు విశ్వవిద్యాలయం.

## పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక (methodology and conceptual framework)

ఈ పరిశోధన ఆలంకారిక విమర్శనాత్మక దృష్టితో కొనసాగింది. రిసర్చ్ మెథడాలజీ విషయానికి వస్తే గుణాత్మక పరిశోధన పద్ధతి (Qualitative Research Methodology) విభాగంలో చేరుతుంది. శ్రీనాథుని రచనలను సేకరించే క్రమంలో ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాద్ విశ్వవిద్యాలయం) ఆంధ్ర సారస్వత పరిషత్ లైబ్రరీ (హైదరాబాద్) సందర్శించాను. ప్రాచ్యలిఖిత భాండాగారం (హైదరాబాద్), ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పెద్దాపురం లైబ్రరీ (పెద్దాపురం) నుండి సమాచారాన్ని సేకరించాను. పెద్దాపురం లైబ్రరీ నుండి కొన్ని శ్రీనాథుని పుస్తకాలను తెప్పించుకున్నాను. అలాగే హైదరాబాద్‌లో యువభారతి, సంస్కృత సాహిత్య అకాడమీల నుండి సమాచారాన్ని కొంత సేకరించాను. నా పరిశోధనకు సరిపడ పుస్తకాలు హైదరాబాద్‌లోనే లభించాయి కనుక ఇత ప్రాంతాలకు వెళ్ళలేదు. శ్రీనాథుని మీద పరిశోధనలు చేసిన వారిలో జంధ్యాల జయకృష్ణ బాపూజీ గారిని చరవాణి ద్వారా నా సందేహాలను అడిగి తెలుసుకున్నాను. కవి కవితామార్గ సంబంధ విషయాలను వారితో చర్చించాను. ప్రశ్నావళిని వారికి పంపాను. వాటిని అనుబంధంలో చేర్చాను.

## పరిశోధన లక్ష్యం (Research Objectives)

శ్రీనాథ మహాకవి రచనాశైలి ఉత్కృష్టమైంది. చిరస్మరణీయమైంది. తర్వాతి కవులకు అనుసరణమైంది. అటువంటి కవి కవితా ప్రస్థానాన్ని స్పష్టం చేయడం ఈ పరిశోధన లక్ష్యం. కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని శ్రీనాథుడు పాటించాడని చెప్పడానికి 'హరచూడా హరిణాంక వక్రత' పద్యంలోని భావం కుంతకుని వక్రోక్తి జీవితంలోని ఉన్న 'వాగ్వల్ల్యాః పదపల్లవాస్పదతయా యా వక్రతోద్భాసినీ విచ్ఛిత్తిః సరసత్వ సమ్పదుచితా' అనే కారికను పోలి శ్రీనాథుని కవితా మార్గం వక్రోక్తే అని నిరూపించటమే నా పరిశోధన లక్ష్యంగా భావిస్తున్నాను.

## అధ్యాయ విభజన (chapter division)

పరిశోధన గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించి విశ్లేషించాను. అవి :1. శ్రీనాథ కవి పరిచయం-రచనలు, 2. శ్రీనాథుని కవితామార్గం - సైద్ధాంతిక నేపథ్యం, 3.శ్రీనాథుని కవిత్వం -వర్ణవిన్యాస వక్రత, 4.శ్రీనాథుని కవిత్వం-పదవక్రత,5. శ్రీనాథుని కవిత్వం-వాక్యవక్రత, 6. శ్రీనాథుని కవిత్వం-ప్రకరణ, ప్రబంధవక్రతలు.

## పరిశోధన ఫలితాలు (research findings)

ఈ పరిశోధన ద్వారా గుర్తించిన ఫలితాంశాలు ఇలా ఉన్నాయి. 1. శ్రీనాథుని కవితా మార్గంపై వాదోపవాదాలు చర్చితమయ్యాయి. 2. శ్రీనాథుని అసలైన మార్గం ఏమిటని స్పష్టమవుతుంది. 3. శ్రీనాథుని రచనల్లోని ఇతర కవుల మార్గ అనుసరణ అవగతమవుతుంది. 4.శ్రీనాథుని రచనల్లోని శబ్దమాధుర్యం వెల్లడి అవుతుంది. 5. వక్రతా వ్యాపారం ఎలా అనుసరించబడిందో తెలుస్తుంది. 6. కుంతకుని వక్రోక్తి మార్గంలోని రకరకాల వక్రతలు, వాటి అంతర్భేదాలు చెప్పబడ్డాయి. వివరణాత్మకంగా శ్రీనాథుని పద్యాల్లోని వక్రత భేదాలు సమన్వయంతో నిరూపించబడ్డాయి. శ్రీనాథుని కవిత్వంలో కుంతకుని 68 రకాల వక్రతా భేదాలను సమన్వయం చేసి, కుంతకుని మార్గాన్ని శ్రీనాథుడు అనుసరించాడని నిరూపించబడింది.

## భావి పరిశోధకులకు సూచనలు (suggestions for upcoming researchers)

ఏ సాహిత్యమైన ప్రాచీన సాహిత్యం పునాది మీదే మొదలైంది. తెలియని విషయాలు, తెలుసుకోవాల్సినవి ప్రాచీన సాహిత్యంలోఉన్నాయి. ఆధునిక కాలంలో ప్రాచీన సాహిత్యం పై పరిశోధనలు చాలా తగ్గిపోయాయి. ఇప్పటికి వెలికిరాని అంశాలు కూడా ఉన్నాయి. అటువైపుగా కొంతకృషి కొనసాగిస్తే సామాజిక, సాంస్కృతిక, భాష, శిల్ప సంబంధ విషయాలను తెలియజేసినవారు అవుతారు.

**పరిశోధకురాలి వివరాలు:** డా. వేముల శరణ్య, మెట్‌పల్లి మండలం, జగిత్యాల జిల్లా, ఫోన్: 9493613830.

*****

నివేదిక

# తెలుగును కాపాడాల్సిందే

**(తెలుగు భాషా పరిరక్షణ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిభాషణ)**

డా. ఇమ్మడి మహేందర్

ఇంటర్మీడియట్ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగుతో పాటు, సంస్కృతాన్ని ఐచ్ఛిక అంశంగా ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ, తెలుగు భాషా పరిరక్షణ సమితి (TBP JAC) నిర్వహణలో **"మన భాష -మన హక్కు"** అనే పేరుతో ఏప్రిల్27, 2025న రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ప్రొ. సి.కాశీం అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు తెలుగు భాషను ఒకటవ తరగతి నుంచి డిగ్రీ దాకా ప్రథమభాషగా బోధించాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో బోధించే సంస్కృతాన్ని దేవ నాగరి లిపిలోనే పరీక్ష రాసేలా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని తెలుగులో, ఇంగ్లీష్‌లో బోధించడానికి, పరీక్ష రాయడాన్ని చూస్తే భవిష్యత్ లో తెలుగును కూడా ఇంగ్లీష్ లో బోధించమని ఆదేశించేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగును కాపాడటంతో పాటు ఇంటర్మీడియేట్ సంస్కృత వాచకాన్ని, తెలుగు వాచకంతో సమానంగా ప్రామాణికంగా రూపొందించాలని అన్నారు. అలాగే తెలుగు భాష, సాహిత్యాల పరిరక్షణ కోసం దీర్ఘ కాలిక ఉద్యమం చేయాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఒక కమిటి వేయాలని నిర్ణయించారు. తెలుగుకు ఇంగ్లీష్, సంస్కృతాల నుండి తక్షణ నష్టం ఉందని అన్నారు. అలాగే సంస్కృత పాఠ్యాంశాలు తెలుగు పాఠ్యాంశాలతో సమానంగా ఉండాలని అన్నారు. తెలుగు ప్రజలకు తెలుగులోనే సేవలు అందించాలని అన్నారు.

మన భాష మన హక్కు పేరుతో ఉద్యమించడమనేది ఆత్మగౌరవ సమస్య అని అన్నారు. తెలంగాణలో సుమారు పది లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ లో సంస్కృతం చదువుతున్నారని, వీరికి కేవలం విద్యా సంవత్సరం చివరలో ఒక నెల మాత్రమే తూ తూ మాత్రంగా సంస్కృతం బోధిస్తారని ఇది సంస్కృతాన్ని అవమానించడమేనని అన్నారు. వెంటనే తెలుగు అకాడమి డైరెక్టర్‌ను, తెలుగు అధికార భాషా సంఘాన్ని చలనశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలుగు నెల మీద తెలుగు వద్దని అనడం భాషా దండయాత్రతో సమానమని అన్నారు. మాతృభాషలో ఆలోచిస్తే, పరిశోధనలు చేస్తే విజ్ఞానం అభివృద్ధి అవుతుందని అన్నారు. విద్యా వ్యాపారీకరణ పెరిగిన తరువాత సంస్కృతం గోల ఎక్కువైందని తద్వారా తెలుగుకు అపారమైన నష్టం కలుగుతుందని ఈ కుట్రను ప్రజలు, విద్యావేత్తలు గమనించాలని అన్నారు. ఇక ముందు అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఇవ్వాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మేధో సంపన్న దేశాలన్నీ మాతృభాషలోనే విద్యా బోధన చేస్తున్నాయని అన్నారు. పాలనా భాషగా ఏ భాషను అమలు పరుస్తున్నారో దాని వెనుక రాజకీయ దృక్పథం, పాలనా దృక్పథం ఉంటాయని దాన్ని గమనించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.




ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సభ్యులు ప్రొ. కోదండరాం, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి, ప్రొ. గారపాటి ఉమా మహేశ్వర రావు, ప్రొ. పులికొండ సుబ్బాచారి, ప్రొ. బన్న ఐలయ్య, ప్రొ. సిల్మా నాయక్, ప్రొ. లావణ్య, డా. సంగిశెట్టి శ్రీనివాస్, డా. పసునూరి రవీందర్, డా. సంగి రమేష్, డా. వెల్దండి శ్రీధర్, డా. నరహరి, కందుకూరి శ్రీరాములు, డా. ఇమ్మిడి మహేందర్, డా. చంద్రయ్య, మాతృభాష పరిరక్షణ

(తరువాయి 50వ పేజీలో...)

# డ్రైవింగ్

స్నేహలత ఎం.

నాకు చిన్నప్పటి నుంచి సైకిల్ నేర్చుకోవాలని కోరికగా ఉండేది. అప్పట్లో ఆడపిల్లలకు సైకిల్ నేర్చుకునే అవకాశం లేదు. ఇక సైకిల్ కొనిచ్చే వాళ్లు అసలే లేరు. ఇంట్లో ఉండే మగవాళ్ల సైకిల్ ఒకటి రెండుసార్లు ప్రయత్నం చేసాను. కానీ నేర్చుకోవడానికి సహకరించేవారే కాదు. అమ్మాయిలకు సైకిల్ ఇచ్చేవారే లేరు. ఆ సైకిల్ తొక్కుతూ ఏ కాలో, చెయ్యో విరిగితే మిమ్మల్ని ఎవరు చేసుకుంటారంటూ హితబోధ చేసేవాళ్లే ఎక్కువ. నేను ఇంటర్‌లో ఉండగా మా చిన్నమామయ్య(అమ్మ తమ్ముడు)ని బతిమిలాడితే ఒకటి రెండుసార్లు సైకిల్ తొక్కనిచ్చాడు. అదీ కొద్దిసేపే. పెడల్ మీద కాలుపెట్టి సైకిల్‌ను బ్యాలెన్స్ చేసేలోపే 'ఇక చాల్లే. ఏమన్నా దెబ్బలు తగిలితే నన్ను ఇంట్లో తిడతారు' అంటూ అక్కడికే ఆపేసాడు. అలా సైకిల్ నేర్చుకోవాలని మనస్సులో బలంగా ఉన్నా కూడా తీరని కోరికే అయింది.

పట్నం వచ్చాక ఎక్కడికి వెళ్లాలన్నా దూరాలు, అందుబాటులో బస్‌పాస్‌లు ఉండటంతో మళ్లీ సైకిల్ వైపు ఆలోచన మళ్లలేదు. కానీ నాకు బిడ్డ పుట్టి ఆమెకు సైకిల్ కొన్నాక మాత్రం ఆ కోరిక మళ్లీ మనస్సులో చేరింది. అలా ఇద్దరు పిల్లలు పుట్టినతర్వాత మేము ఓయూ క్వార్టర్స్‌కు మారాం. ఇల్లు ఎంతో విశాలంగా ఉన్నా, దూరం కూడా అంతే విశాలంగా ఉండేది. ఎక్కడికి వెళ్లాలన్నా, ఏ పని చేసుకోవాలన్నా చాలా దూరాలు. నడక మంచిదే అయినా సామాన్లతో, కూరగాయలతో ఇబ్బందిగా మారిపోయింది. ఆ సందర్భంలోనే తమ్ముడు చంద్రయ్య తన ఆక్టివాను అమ్ముతానని చెప్పాడు(దాని పూర్తి కథ మరోసారి చెప్తాను.) 'ఆక్టివాను రెండు నెలల క్రితం కొన్నానక్కా. షోరూమ్‌లో ఎంత ధర చెబితే అంతకే ఇస్తాను' అన్నాడు. అలా మరో ఆలోచన చేయకుండా ఆక్టివా కొనుక్కున్నాను. బండైతే కొన్నాను. కానీ డ్రైవింగ్‌లో వెంటనే పర్‌ఫెక్ట్ కాలేకపోయాను. ఒకటి రెండు రోజుల సాధన నాలో రోడ్డుపై వెళ్లగలననే కాన్ఫిడెన్స్‌ను ఇవ్వలేదు. రోడ్డు మీద నడపగలనా అనే సంశయంతో నేను అప్పటికే పనిచేస్తున్న పరిషత్ కాలేజీకి బస్సులోనే వెళ్లేదాన్ని.

ఒకరోజు బస్సులోనే కాలేజీకి వెళ్లాను. క్లాస్ మొదలుపెట్టాను. కుండపోత వర్షం. దాదాపు గంటసేపు ఆగకుండా పడుతూనే ఉంది. కరెంట్ పోయింది. మా ప్రిన్సిపాల్‌గారు 'వర్షం తగ్గేలా లేదు, వెళ్లండి మేడం' అన్నారు. క్లర్క్ తన బండి మీద రాంకోఠి బస్టాప్ వరకు దింపాడు. బస్సులు లేవు. బస్టాప్ నిండా జనం. ముఖ్యంగా ఏ వాహనాలు లేని స్త్రీలు వందకు పైగా ఉన్నారు. ఓ అరగంట తర్వాత విఎస్‌టి వైపు వెళ్లే బస్సు ఒకటి వచ్చింది. సరేలే కనీసం సగం దూరం చేరుకుంటాననుకుంటూ ఊపిరాడకుండా నిండిన జనాల మధ్యకి తోసుకుంటూ బస్సులోకి ఎక్కాను.

కుండపోత వర్షంతో రోడ్లన్నీ నీళ్లతో నిండాయి. దాదాపు కరెంట్ లేదు. ప్రతీ స్టాప్‌లో ఆగుకుంటూ, నిండిన జనాలతో వంగిపోయిన బస్సు కదలలేక కదలలేక ఒక 45 నిమిషాలకు శంకర్‌మఠం చేరింది. అక్కడ దిగేసాను. ఆ బస్టాప్‌లో కూడా నాలాంటి వాళ్లే. అంటే ఏ వాహనం లేకుండా బస్సు మీద ఆధారపడ్డవాళ్లే ముఖ్యంగా 80 శాతం స్త్రీలున్నారు. తార్నాక వైపు వెళ్లటానికి ఒక్క బస్సు కూడా లేదు. రోడ్ల మీద చేరుకుని ప్రవహిస్తున్న నీళ్ల వలన బస్సులన్నీ డిపోకు వెళ్లిపోయాయని ఓ ఆటోడ్రైవర్ చెప్తున్నాడు. గంటసేపు గడిచిపోయింది. ఆటోలు వస్తున్నాయి. కానీ, తార్నాక వైపు వచ్చే ఆటోలు లేవు. అన్నీ రాంనగర్ వైపు వెళ్తున్నాయి. దాదాపు 9.30 అయింది. ఇల్లు ఎలా చేరడమా అని ఆలోచిస్తున్నాను. నడుద్దామా అంటే దూరమే కాకుండా వర్షం, చీకటి. ఈ లోపు ఇంటి నుంచి ఫోన్. 'ఎక్కడి వరకు వచ్చావు. నేనొస్తాను అక్కడే ఉండంటూ' నా భర్త చెప్పాడు. 'కాసేపు చూద్దాం ఆటోలు దొరుకుతాయిలే' అంటూ ఫోన్ పెట్టేసాను.

మెల్లగా బస్టాప్‌లో జనాలు పలచబడ్డారు. కొందరు ఆటోల్లో, మరికొందరు వాళ్ల వాళ్లతో, కొందరు నడుస్తూ ఇళ్లదారి పట్టారు. తార్నాక, హబ్సిగూడ వైపు వెళ్లేవాళ్లే ఆ

బస్టాప్‌లో మిగిలారు. అందులో ఓ పదిమంది స్త్రీలు మిగిలిపోయాం. వచ్చీపోయే అన్ని ఆటోలను తార్నాక వైపు వస్తారా అని అడుగుతున్నాం. కానీ ఎవరూ తార్నాకనా, దూరం అంటూ వెళ్లిపోతున్నారు. నాలాగే ఓ కాలేజీలో పనిచేసే మహిళకూడా మాతోపాటూ ఉంది. పరిచయం చేసుకుంటూ 'ఎక్కడి వరకు' అని అడిగింది. 'ఓయూ ఆర్ట్స్ కాలేజీ' అన్నాను. తాను తార్నాక వెళ్లాలని చెప్పింది. ఇద్దరం ఒకటే దారి కావడంతో ఆటో ప్రయత్నాలు పెంచాం. కానీ ఒక్క ఆటో డ్రైవర్ కూడా తార్నాక వైపు రావడానికి సుముఖంగా లేడు. ఆమెతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉంది. ఎలా అని ఆలోచనలో పడ్డాం. నేను కూడా ఇంటికి ఫోన్ చేసి బండి తీసుకొని రమ్మందామని అనుకుంటున్నాను. ఈలోపు ఆమె స్నేహితురాలు 'నేను దింపేస్తాను. పదా' అని తనతో అన్నది. వారిద్దరూ ఆమె కారు వైపు కదిలారు. నేను ఏం చేయాలా అని ఆటోల వైపు చూస్తున్నాను. ఓ పది సెకన్ల తర్వాత ఆమె వెనక్కి తిరిగి మీరు కూడా రండి. దారిలోనే కదా దింపేస్తాను అన్నది. అవి అమృత వాక్యాలలా వినిపించాయి. మొహమాటంతో పర్లేదు అందామనుకున్నాను. కానీ ఆ చీకటి వర్షపు రాత్రి నా నోటి నుంచి ఆ మాటలను రానివ్వలేదు. థ్యాంక్యూ అంటూ వారితో పాటు వెళ్లి కారులో కూర్చున్నాను. దారిలో ఓయూ గురించి, నా గురించి, వారి గురించి పరిచయ వాక్యాలు మాట్లాడుకున్నాం. ట్రాఫిక్ లేకపోవడంతో ఐదు నిమిషాల్లో నన్ను ఆర్ట్స్ కాలేజీ దగ్గర దింపి, మీవాళ్లు కచ్చితంగా వస్తారుగా అంటూ వెళ్లిపోయారు. అప్పటికే నా కోసం బండి మీద ఎదురుచూస్తున్న నా భర్తను చూపిస్తూ వారిద్దరికీ మనస్ఫూర్తిగా మరోసారి థాంక్స్ చెప్పాను. ఇది ఒక చిన్న సంఘటననే కావచ్చు కానీ డ్రైవింగ్ విషయంలో నాకు ఒక స్పష్టత వచ్చిన సందర్భం అని చెప్పాలి. కార్ డ్రైవ్ చేసిన మహిళ దారిలో తన మిత్రురాలితో 'అందుకే నిన్ను డ్రైవింగ్ నేర్చుకోమని చెప్పాను. వినిపించుకోవు కదా' అన్నది. ఆ మాటలు నన్నేనా అనిపించింది. మర్నాటి నుంచి సీరియస్‌గా, సిన్సియర్‌గా ఆక్టివాతో పాటు నా బిడ్డ సైకిల్ కూడా నేర్చుకున్నాను. ఓ సంఘటన, అనుభవం మన జీవితంలో కొన్ని ౹ావిషయాలను సులభతరం చేస్తాయనడానికి ఇదొక ఉదాహరణ.

T

(48వ పేజీ తరువాయి)

సమితి, తెలుగు భాషాభిమానులు, పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కమిటీ**

ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ ఐక్య కార్యాచరణ సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా ప్రొ. సి. కాశీం, డా. వెల్దండి శ్రీధర్ , డా. సంగి రమేశ్‌లు, సభ్యులుగా ప్రొ. సిల్మా నాయక్, డా. నర్సింహులు, డా. మాలతి, డా. మాణిక్యం, తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల తెలుగు శాఖాధిపతులు వ్యవహరిస్తారు. అలాగే సలహాదారులుగా డా. నందిని సిధారెడ్డి, ప్రొ. ఉమా మహేశ్వరరావు, ప్రొ.బన్నఐలయ్యలు వ్యవహరిస్తారు. ఈ కమిటీ ఈ కింది తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించింది.

**తీర్మానాలు:**

1.ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం జీవోను జారీ చేసి, అమలు చేయాలి.

2. ప్రాథమిక విద్యలో తెలుగు బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలి.

3. అన్ని రకాల ద్వితీయ భాషల సిలబస్‌ల్లో ఏకరూపత ఉండాలి.

4. ఒక ప్రాంత సంస్కృతి, జీవన విధానం, ఆ ప్రాంత మాతృభాషలో వ్యక్తం అవుతుందనే సూత్రాన్ని ప్రభుత్వం, పౌర సమాజం గుర్తించాలి.

5. ప్రైవేటు కళాశాలల్లో తప్పనిసరిగా తెలుగు ద్వితీయ భాషగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

6. తెలుగు చదివిన వారికి పోటీ పరీక్షలలో బోనస్ మార్కులు ఇవ్వాలి.

7. సంస్కృత భాషాబోధన, పరీక్షా నిర్వహణ సంస్కృతంలో దేవ నాగరి లిపిలోనే ఉండే విధంగా ప్రభుత్వం జీవోను జారీ చేసి అమలు చేయాలి.

8. టెట్ పరీక్షలో ఉపాధ్యాయుల ఎంపికకోసం నిర్వహించే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంవలె తెలంగాణలో కూడా పేపర్ 3 లో తెలుగు సిలబస్ ఉన్న పేపర్‌ను ప్రవేశపెట్టాలి.

9. తెలుగు పండిత శిక్షణ కళాశాలలను తిరిగి ప్రారంభించాలి.

T

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



Don't Clink on **Suspicious** links

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007